

06-1980
జూన్ '80
రూ 3/-





నా సౌందర్యం. అంటే ఆయనకు ఎంతో ప్రీతి!
ఆ విషయం ఆయన చెప్పనవసరం లేదు — ఆయన కళ్ళలోకి చూస్తేనే చాలు! అలా కలిగే ఆనందానికి హద్దులేదు.
ఆ ఆనందం వలన ఇంటి పనులలో నాకు — కష్టమేకలగదు.

నిజం చెప్పాలంటే నాకు వివాహమయి పది సంవత్సరాలు పూర్తయిందంటే నమ్మలేరు గదా...కాదా?
ఆ రహస్యం—ఆయనకు, నా సౌందర్యానికి సహాయం చేస్తోన్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌కి మాత్రమే తెలుసు.

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్
మీరు కూడా సౌందర్యంతో శోభించండి.

Pond's

PIL. 1840 R

సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జూన్ 1980

సంపుటి 18 **విషయసూచిక** సంచిక 5

ఈ నెల నవలానుబంధం


జ్యోతి నవలల పోటీలో మూడవ బహుమతి పొందిన నవల

కడలి అంచు కాపురం

రచన : పాలకోడేటి సత్యనారాయణరావు

ముఖచిత్రం : 'సన్నాయి అప్పన్న'లో శోభన్‌బాబు

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423129
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు




తొలిమాట

సార్త్రే

సిద్ధాంతాలు ప్రవచించడం వేరు. ఆ సిద్ధాంతాలకు అనుగుణంగా జీవించడం వేరు. చెప్పింది ఆచరించే మేధావులు అరుదు. ఏప్రిల్ 15 న పారిస్ నగరంలో మరణించిన మహా మేధావి సార్త్రే ఆచరణ శీలి. ఆధునిక నాస్తికవాదానికి, మనిషి సుఖదుఃఖాలకు మనిషే బాధ్యుడని, దైవం అనబడే కల్పితశక్తికికానీ, మరే యితర మానవేతర శక్తులకుకానీ మనిషి చేసే పనులతో, తత్ఫలితాలతో ప్రమేయం లేదని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పి, తన తాత్వికచింతన మరింత సులభంగా, సరళంగా ప్రజానీకానికి అర్ధమవడానికి వీలుగా, సాహిత్య ప్రక్రియలద్వారా ప్రచారం సాగించి మహా రచయితగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన వాస్తవిక భావశిల్పి సార్త్రే. సార్త్రే తెలుగు సాహిత్యాన్ని కూడా కొంత మేరకు ప్రభావితం చేశాడు. బుచ్చిబాబు, గోపీచంద్ వంటి రచయితలమీద ఆయన ఆలోచనల ప్రభావం బలంగానే వుంది. 1965లో తన 'లె మాట్స్' గ్రంథానికి లభించిన, నోబెల్ బహుమతిని తిరస్కరించగలిగిన స్వతంత్ర భావప్రియత్వం, నిర్భికత సార్త్రే ప్రత్యేక లక్షణాలు. ఆ మహాతత్వవేత్తకి, ఆ మహా రచయితకీ జ్యోతి శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

*　*　*

'మనసు సంగతి' పేరుతో మనో విజ్ఞాన విశేషాలను వివరించే కొత్త శీర్షికను ఈ సంచికలో ప్రారంభిస్తున్నాము.



ఉత్తరాలు

మే నెల "జ్యోతి"లో కథలన్నీ బాగున్నాయి: కొండంత దీపం, వీక్‌నెస్ కథలు మగవాడి మరో బుద్ధికి మచ్చుతునకల్లాంటివి. విద్యార్థుల కథల్లో స్టాండర్డు కనిపించటం లేదు. "మీరా" సీరియల్ చాల రిలీఫ్ నిస్తోంది. శ్రీశ్రీగారి ప్రహేళికను సాల్వ్ చేయలేక పోతున్నాము.

—యస్. రవీందర్‌రావు, వెంకటాపురం.

మే నెల జ్యోతిని చదివాను. కథలు అత్యు దయాత్మకంగా వున్నాయి. 'సిల్లీ'కి ఆ నెల కథలలో అగ్రస్థానం ఇవ్వవచ్చు. 'రిఫరీస్ ఫౌల్'కూడ బాగున్నప్పటికీ, సమస్యను మాత్రమే రచయిత చెప్పడంవలన అంతగా ఆకట్టుకోలేకపోయింది. "కొండంత దీపం", "ఒప్పుతున్న తప్పు" కొత్తదనంలేని పాత కథలు. "వీక్‌నెస్" మానసిక రుగ్మతలని ఎత్తిచూపే సైకాలజికల్ స్టోరీ. కథకన్నా కథనం ఆకట్టుకొంది. ఎవరయినా సెంటిమెంటుకి నిర్వచనం అడిగితే శర్మగారి 'వీక్‌నెస్'నే వుదాహరణగా చెప్తాను.

కొత్త రచయితలకి అవకాశం కల్పిస్తూ, మంచి కథలకే ఆదరణ చూపిస్తున్న మీకు హార్దిక అభినందనలు చెప్పకుండా వుండలేక పోతున్నాను.

—దరిగి సువర్ణకుమార్, కలకత్తా.

ఎన్టీఆర్ ముఖచిత్రంతో వెలువడిన మే నెల "జ్యోతి" చాలా ఆకర్షణీయంగా వుంది. "ఈ బ్రతుకింతే", "కళ విలువ", "కొండంత దీపం" కథలు చాలా బాగున్నాయి. దాస్‌బాబు గారి "అల్లావుద్దీన్ అభినవ దీపం" చాలా బాగున్నది. ఇన్ని వెరైటీలను అందిస్తున్న "జ్యోతి"కి నా అభినందనలు.

—జి. ఎ. వి. సత్యనారాయణ, అత్తిలి.

మే నెల "జ్యోతి"లో కథలు చాలా బాగున్నాయి. కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ "కళ విలువ" మమ్ముల నెంతో ఆకర్షించింది. నిజానికి ఈ రోజుల్లో వాస్తవిక చిత్రాలకి గుర్తింపు లేకుండా పోయింది. క్రొక్విల్ అను కాకిక ధారి కథా కార్టూన్లు కొత్త పంథాలో వున్నాయి.

—వి. దయానంద్, పిందం గండయ్య,
హైదరాబాదు.

యన్. టి. రామారావు ముఖచిత్రంతో వెలువడిన మే నెల "జ్యోతి" అత్యంత ఆకర్షణీయంగా వుంది. "సహజాతాలు" కథ చదివి చాలా బాధపడ్డాను. చాలా మంచికథ. "ప్రేమ సింహాసనం, మీరా" రెండు సీరియల్స్ వూహించలేనిమలుపులతో బ్రహ్మాండంగా సాగుతున్నాయి. ఈ నెల అనుబంధం నవల "ఆకాశానికి అటూ ఇటూ" నవల చాల సంతృప్తి నిచ్చింది. నిజానికి ఈ నవల ఒక్కసారేకాదు ఎన్నిసార్లు చదివినా తనివితీరనిది. ఇంత చక్కని నవల అందించిన మీకు నా ధన్యవాదాలు.

—కందిగట్లప్రభాకర్, జనగామ.

కడప మిత్రునికి శ్రీశ్రీ సమాధానం

ఐన్‌స్టెయిన్ సాపేక్ష సిద్ధాంతం ప్రకారం నీడకు ముందూలేదు. వెనకాలేదు. ఆదిశంకరుల మిథ్యావాదం అయితే అసలు నీడాలేదు, మీరూలేరు, నేనూ లేను.

"మొదల నూచిన కడుగొప్ప పిదప కురుచ" అన్న ఏనుగు లక్ష్మణకవి పద్యం (భర్తృహరి శ్లోకానికి అనువాదం) జ్ఞాపకం తెచ్చుకోండి.

ఆరుద్ర దూడ కోతికాదు. దస్తగిరి. అందస్తగిరి. (అందు+అస్తగిరి) లోని సంధిని విస్మరించి "దస్తగిరి" ఒక వ్యక్తి పేరుగా ఆరుద్ర పొరబడ్డాడు. పొరపాట్లు ఎవరికైనా వస్తాయి. ఆరుద్రను కించపరచడం నా వుద్దేశం కాదు. ఈ పొరపాటులోని తమాషాను మాత్రమే నేను స్వీకరించాను.

మీరు పేర్కొన్న రెండు ఆధారాల్లోనూ నిఘంటువులతో కుస్తీలేదు. కొత్తగా ఇదో అభాండం నా మీద వేశారు. నిఘంటువుల్లో లేని మాటల్ని, బుద్ధిబలంతో సాధించవలసిన వాటిని తరచు నా ప్రహేళికల్లో (ఇప్పటికీ) వాడుతున్నాను. ఐనా మీరు "గత కాలమె మేలువచ్చు కాలము కంటెన్" అనుకొనే వారికోవకు చెంది వుండవచ్చు. అలాగే వుండండి. నా అభ్యంతరం లేదు.

శ్రీశ్రీ

సాంస్కృతిక విశేషాలు

ట్వెంటీఫస్ట్ సెంచరీ రైటర్స్ సప్తమ వార్షిక సమావేశం

ట్వంటీఫస్ట్ సెంచరీ రైటర్స్ సప్తమ వార్షిక సమావేశం 13-4-'80 నాడు శ్రీకృష్ణ భవన్ విజయనగరంలో జరిగింది. 1980-81 సం॥కి కార్యవర్గం:— నిష్ఠల వెంకటరావు (ప్రెసిడెంట్) రావి-ఎన్. అవధాని (సెక్రటరీ) శ్రీమతి అడవికొలను పార్వతి, బి. గురుప్రకాష్, మంథా వెంకట రమణరావు. ఇప్పటి వరకు పుస్తకాలు ప్రచురించిన ఈ సంస్థ, తన పదకొండవ ప్రచురణగా ఇంగ్లీష్ వెర్స్ ప్రచురించబోతూంది. ఇంగ్లీషులో హ్యూమర్, సెటైర్ వున్న వెర్స్ ఎవరైనా పంపవచ్చును. సమావేశంలో ఈ కిందివారి ఇంగ్లీష్ వెర్స్ చదువబడింది:— వేగుంట మోహన్ ప్రసాద్, వజీర్ రహమాన్, ఇస్మాయిల్, నిఖిలేశ్వర్, కమేండర్ ఆర్. ఎస్. పండిట్, దేశిరాజ్ విరాట్, అయ్యగారి లక్ష్మణరావు, చలం, హెచ్. సి. బుల్లి, జి. రమేష్‌బాబు, డా॥ జె. కె. బున్యాల్, సోమ్నాద్ కౌల్, కుమారి మాలా జనార్దన్, అజిత్ చాక్, మంథా వెంకటరమణరావు, నిష్ఠల వెంకటరావు, బెర్లిన్ (వెస్ట్ జర్మనీ) కవి పి. పి. జహల్ పంపిన వెర్స్ కూడా చదువబడింది.

'విభావరి'కి ఫ్రీవర్స్ ఫ్రంట్ బహుమతి

హైదరాబాదులోని ఫ్రీవర్స్ ఫ్రంట్ వారు వచన కవితలో రాసిన వుత్తమ కావ్యానికి ఏటేటా యిచ్చే బహుమతి 1979వ సంవత్సరానికి శ్రీ. వి. హనుమయ్య రచించిన "విభావరి" కావ్యానికి వచ్చింది. ఇటీవల బహుమతి మొత్తాన్ని రు. 500 లకు పెంచిన తర్వాత యిదే ప్రథమ ఫలితం. ఈ బహుమతి పొందిన వారిలో హనుమయ్యగారు పదవవారు.

కథావేదిక ఎన్నిక

ఏప్రిల్‌లో మాకు నచ్చిన కథలు

ఆఖరిదారి

వి. రాజారామమోహనరావు

ఆంధ్రజ్యోతి— 18-4

మంచి పేరడీ

పునరపి జననం పునరపి మరణం

పి. ఎస్. గోపాలకృష్ణ

ఆంధ్రజ్యోతి— 25-4

కథా వేదిక

విశాఖపట్నం-530003

ప్రేమ సింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

24 సీరియల్

సుధీర్‌కి పినతండ్రి వరస అయిన, అరుణాచలంగారి యింట్లో ఆయన కూతురి పెళ్ళి వారంరోజుల క్రితమే, ఆయన, ఆయన భార్య వచ్చి, శుభలేఖ యిచ్చి, తప్పకుండా రావాలి అంటూ మరీ మరీ పిలిచి వెళ్ళారు. సుగుణమ్మగారయితే మరీను. స్వప్నతో అతిచనువుగా మాట్లాడుతూ, 'ఇదుగో! కోడలు పిల్లా! నాకు మగపిల్లలు కూడా లేరు, సుధీరే నాకు కొడుకు. నువ్వు వాడు, ఒకరోజు ముందు వచ్చి, పెళ్ళిపెత్తనం చేయాలి సుమా! రాకుండా ఎగ్గొటాలనుకుంటావేమో! జాగ్రత్త!' అంది.

ఆవిడ కలుపుగోలుతనానికి స్వప్న ఆనందపడింది. బంధువులందరిలో ఆవిడే యిలా యిష్టంగా మాట్లాడిన వ్యక్తిగా కనిపించింది. ఆవిడ యిష్టాన్ని, పెళ్ళికి వెళ్ళి బాగా సాయపడి, రెట్టింపు చేసుకోవటానికి నిశ్చయం చేసుకుంది.

పెళ్ళి దగ్గరకి వచ్చింది. స్వప్న సుధీర్‌తో సుగుణమ్మగారు ముందుగా రమ్మనమని మరీ మరీ చెప్పిన సంగతి గుర్తు చేసింది. అతను స్వప్న మాటలు విని వూరుకున్నాడే తప్ప ఎలాటి వ్యాఖ్యానమూ చేయలేదు. 'ఆ రోజు వుదయానికి వెళ్ళ వచ్చులెద్దూ' అన్నాడు. స్వప్నకి సుధీర్‌మీద కోపం వచ్చింది. అసలు బంధువులందరూ తమని వెలివేసినట్టు చూస్తున్నారు. ఎవ్వరూ సరిగ్గా మాట్లాడనే మాట్లాడరు. సుగుణమ్మగారు, అందరిలా కాకుండా, ఆత్మీయంగా మాట్లాడింది. ఆవిడ ఇంటికి వెళ్ళాలని స్వప్నకి ఎంతగానో వుత్సాహంగా వుంది. కానీ సుధీర్ ఎందుకోగానీ, ఆ వుత్సాహపు పొంగుమీద నీళ్ళు చల్లేస్తున్నాడు. స్వప్నకి అర్థంగాలేదు.

పెళ్ళిరోజు వచ్చింది. సుధీర్, స్వప్న వెళ్ళారు. అప్పటికే యింటినిండా బంధువులున్నారు. సుగుణమ్మగారు వెళ్ళగానే, పలకరించలేదు. స్వప్న వచ్చి ఎంతసేపయినా, చిరునవ్వు కూడా నవ్వలేదు. అసలు స్వప్నని చూడనట్టే వూరుకుంది. స్వప్న కల్పించుకుని తనే, ఏదో పని చెయ్యబోతే, 'నువ్వెందుకు వద్దు' అంది. ఆ మాటలో మన్ననకంటే, తిరస్కారమే ఎక్కువగా వుంది.

స్వప్న లోపల గదిలోకి వెళ్ళబోయింది. గుమ్మంలో అడుగు పెట్టబోయిన స్వప్న అక్కడే ఆగిపోయింది. అడుగు ముందుకు పడలేదు. అక్కడ అహల్యమ్మగారు కూర్చుని వుంది. ఆవిడ చుట్టూ నలుగురైదుగురు ఆడవాళ్ళు పరివేష్టితులై వున్నారు.

స్వప్న చప్పున వెనక్కు తిరిగి యివతలకి వచ్చేసింది. తల్లి వచ్చిందని సుధీర్‌కి తెలుసా? అతను దూరంగా, అరుణాచలంగారితో ఏదో మాట్లాడుతున్నాడు. స్వప్నకి ఏం చెయ్యాలో తోచలేదు. పనిలో కల్పించుకోవాలనే ఉత్సాహం ఆవిరి అయిపోయింది. సుగుణమ్మగారి ముభావానికి అర్థం ఏమిటో కూడా తెలిసిపోయింది. ఏం చెయ్యాలో పాలుపోలేదు.

అందరూ భోజనాలకి కూర్చున్నారు. స్వప్నని ఎవరూ పిలవలేదు. స్వప్న యీ అవమానం దిగమింగలేకపోతోంది. సుధీర్ అక్కడెక్కడా లేడు. స్వప్న యివతలకి వచ్చేసింది. అక్కడ గుట్టగా పడివున్న చెప్పుల్లో, తన చెప్పులు వెతికి తీసుకుని వేసుకుంది. వేసుకుంటూ తాత్సారం చేసింది. ఎవరైనా చూసి ఆగమంటారేమోనని. ఎవ్వరూ అనలేదు. సుగుణమ్మగారు చూసి వూరుకుంది. స్వప్న ఇవతలికి వచ్చేసింది. అక్కడెక్కడా సుధీర్ లేడు. బహుశా పెళ్ళివారిని ఆహ్వానించటానికి వెళ్ళాడేమో! స్వప్న యింటికి వచ్చేసింది. తాళంచేతులు అతని జేబులోనే వున్నాయి.

స్వప్న వరండాలో కూర్చుంది. స్వప్నలో మళ్ళీ భీషణ సమరం ప్రారంభమైంది. ఈ జన్మకి యిక విముక్తిలేదు. ఇది యింతే! సుధీర్‌ని అసలు తను ఎందుకు పెళ్ళి చేసుకున్నట్టు! తను పడే బాధ అతని నెత్తిన రుద్దటానికా! స్వప్నకి ఆ క్షణంలో తను జైలు కటకటాలమధ్య బందీలా వున్నట్టే అనిపించింది. తనకిక స్వేచ్ఛలేదు. సుధీర్ తనని చిన్న జైలునుంచి తప్పించి పెద్దజైలులోకి తీసుకువచ్చాడు. అంతే తేడా! ఈ పెద్దజైలు పేరు మహాప్రపంచం! ఆ జైలులో ఒక్కడే జైలర్! ఇక్కడ అందరూ అధికారులే!

తనకి యీ జైలు నుంచి విముక్తి కావాలి! స్వేచ్ఛ కావాలి! ఎలా! ఏ విధంగా! స్వప్నకి పాలుపోవటంలేదు. సుధీర్ తనని పెళ్ళి చేసుకున్నాడు! ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఏ వ్యక్తి అయినా, భార్యనుంచి ఏం కోరుకుంటాడు. ప్రేమ, గౌరవం! యివి తననుండి అతనికి ఏం లభించినాయి! తను చూస్తూనే వున్నది! పెళ్ళి అయిన క్షణం నుంచీ, అతని జీవితం ముళ్ళకంప మీద పడిన వస్త్రంలా అయింది! సుధీర్

తెలివి గలవాడు: చదువుకున్నవాడు. తెలిసి తెలిసి అతను స్వప్నలాటి పతితని చేసుకోవటం, తల్లేకాదు, లోకం కూడా క్షమించటంలేదు: అతనికి తల్లి దూరం అయింది. మేనమామ పగపట్టాడు. స్నేహితులు మెల్లగా దూరం అవుతున్నారు: తనని కబళించటానికి సిద్ధం అయిన కొండచిలువలాటి ఒంటరితనం మెల్లగా, అతనివైపు పాకి వస్తోంది: ఈ మహాపన్నగం నుంచి అతన్ని రక్షించాలని తన మనసు విలవిలలాడుతోంది: కానీ, ఎలా? ఎలా? అదే స్వప్నకి పాలుపోవటంలేదు:

ఒక్కోసారి అతన్ని వదిలి వెళ్ళిపోవటం ఒక్కటే మార్గమేమో అన్పిస్తుంది: కానీ ఆ వూహ రాగానే, అంతలోనే గజగజ వణికిపోతుంది. అతన్ని వదిలి వెళ్ళటం అంటే మృత్యు పరిష్వంగమే: స్వప్నకి ఈ వూహ రాగానే ఏడుపు వచ్చేస్తుంది:

ఇంతలో కారు లైట్లు ఆవరణలో పడ్డాయి:

సుధీర్ డ్రైవ్ చేస్తున్న తెల్లటి ఫియట్ కారు, సర్రున వరండా దగ్గరకి దూసుకు వచ్చింది.

అతను కారులోనుంచి దిగి, శబ్దం అయేలా డోర్ తప్పునవేసి మెట్లవైపు వచ్చాడు.

అతన్ని చూడగానే స్వప్న లేచి నిలబడింది: అతను మెట్లెక్కి వచ్చాడు: ఇద్దరూ ఒకరి ముఖభావాలు ఒకరు పసిగట్టున్నట్టుగా, క్షణంసేపు చూస్తూ నిలబడిపోయారు.

సుధీర్ ఏం మాట్లాడలేదు: వెళ్ళి తలుపు తాళం తీసాడు.

స్వప్న అతని వెనకే లోపలికి వచ్చింది.

అతను చివాలున వెనక్కి తిరిగాడు. "యింటికి రాదల్చుకున్నదానివి నాతో ఎందుకు చెప్పలేదు?"

స్వప్న మాట్లాడలేదు. ఎలా చెబుతుంది? తనకి కలిగిన అవమానం చెప్పినా అతనికి అర్థం గాదేమో: లోపల గదిలోకి వస్తూ కోటు విప్పి గిరాటుకొట్టి, టై విప్పుతూ అన్నాడతను. "నీకు లక్షసార్లు కోటిసార్లు చెప్పాను: నువ్వు ధైర్యంగా వుండాలని: నువ్వు ప్రతిసారీ పిరికిదానిలా పారిపోయి వస్తున్నావు. నీ పిరికితనం చూస్తుంటే అసహ్యం వేస్తోంది: ఛీ: నువ్వింత పిరికిదానివి అనుకోలేదు:"

అతని ఛీత్కారం, తిరస్కారం కొరడా దెబ్బలు తగిలినట్లుగా, స్వప్న ముఖంలో రక్తం లేకుండా చేసినాయి.

అతను ఆగ్రహంగా అన్నాడు "స్వప్నా: నేను నిన్ను పెళ్ళి చేసుకున్నాను: ఎందుకో తెలుసా? నువ్వు మళ్ళీ యీ సంఘంలో రావటానికి నే నొక దర్వాజా అవాలని అనుకున్నాను: నువ్వు స్థయిర్యంగా, మనోబలంతో నిలబడితే, నీ గతం మరిపించేయగలనని: మా అందరిలా నువ్వూ బ్రతకాలని: నువ్వేం చేస్తున్నావు? యీ

సంఘాన్ని చూడగానే దెబ్బతిన్న కుక్కపిల్లలా ముడుచుకుపోతున్నావు. నీ కీ పిరికితనం తగదు అంటాను."

"అవును: అవును. నేను పిరికిదాన్ని:" స్వప్న అరిచినట్లుగా అంది. "ఒకసారి కాదు: వందసార్లు చెబుతున్నాను. నేను పిరికిదాన్నే:" స్వప్న ఆవేశంగా చూపింది. గుప్పిట బిగపెడుతూ అంది. "మీరు పెళ్ళి చేసుకుంది నాకోసం అనుకున్నాను: నాకు మీరు కావాలి: అంతే: అసలు యీ సంఘం దయాధర్మాలకోసం నే నెందుకు యాతనపడాలి? యాచించాలి? నన్ను అర్థం చేసుకోలేని యీ సంఘంతో నాకు పనేమిటి? మీకు—మీకు—నిజంగా నామీద ప్రేమ వుంటే, యీ సంఘం దయాధర్మాలు లేకుండా బ్రతగ్గలిగే మనోధైర్యం నా 'కివ్వండి: అంతేగానీ—" స్వప్న చేతులు జోడిస్తూ హఠాత్తుగా ఏడుస్తూ అంది. "దయవుంచి నన్నెప్పుడు పిరికిదాన్నని అనకండి: మీ నోటినుంచి ఈ మాట వింటూంటే, నాకు పొడుచుకుచావాలన్నంత బాధ వేస్తుంది: ఇంకెప్పుడూ అనకండి: దయ వుంచి అనకండి:"

"స్వప్నా:" అతను గభాల్న రెండడుగులు వేసి ఆమె దగ్గరగా వచ్చాడు.

స్వప్న వెనక్కి అడుగులు వేసింది. ఏడుస్తూనే అంది. "నాకు తెలుసు. నేను—నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటం ఎంత పొరపాటో:—"

"స్వప్నా:"

"కొంచెం టైమిస్తే యీ పొరపాటు సర్దుకుంటానండీ:"

"స్వప్నా:" అతను అప్పటికే స్వప్నను దగ్గరకి లాక్కున్నాడు.

"నేను పడే బాధ మీకు తెలియటం లేదండీ: ఈ బాధ భరించటానికి నేనెంత శక్తి కూడదీసుకుంటున్నానో:"

స్వప్నని అతను దగ్గరకు తీసుకుని గుండెలకి అదుముకున్నాడు. "స్వప్నా: సారీ: ఐయామ్ సారీ: నువ్వు అక్కడనుంచి వచ్చేసావంటే నాకు కోపం వచ్చింది: నీమీద తిరస్కారం చూపేవాళ్ళని నువ్వు లొంగదీసుకోవాలిగానీ, నువ్వు వాళ్ళకి లొంగిపోగూడదు: నువ్వు వచ్చేయడం పరిష్కారం కాదు: నువ్వు వాళ్ళందరి మాటలు ఎందుకు లక్ష్యపెట్టావు: నేను నిన్ను అక్కడికి తీసుకువెళ్ళాను: నీ ధైర్యం, నీ బలం నేను అవాలని నా ఆశ; అది కాలేకపోతున్నానే అని నా బాధ:"

స్వప్న కొత్త సత్యం తెలుసుకుంటున్నదానిలా మౌనంగా వుండిపోయింది. అవును: నిజమే: ఆ సంగతి తను ఆలోచించలేక పోయిందేమిటి: అతని హృదయ సామ్రాజ్యంలో తనకి ప్రేమసింహాసనం వేసి, తనని మహారాణిని చేసాడు: ఆ గౌరవం దక్కించుకోవాలి: తను అన్ని విధాలా అర్హురాలని నిరూపించుకోవాలి: స్వప్న ఆలోచిస్తూ వుండిపోయింది. (సశేషం)



వాసిరెడ్డి సీతాదేవి నవలకి సాహిత్య అకాడమీ బహుమతి

ఆంధ్ర పత్రికలలో వెల్లువలా పొంగివస్తున్న రచనలు అధిక భాగం రచయిత్రులవే. అయితే ఈ వెల్లువలో ఉవ్వెత్తున లేచే అలలు బహుతక్కువ అటువంటి సాహితీ ఉత్తుంగతరంగాల్లో ఒకరు వాసిరెడ్డి సీతాదేవి. వాస్తవికతకి అద్దంపట్టే ఇతివృత్తం, సుస్పష్టమైన భావవ్యక్తీకరణ, సరళసుందరమైన శైలి, విస్తృతమైన జీవితాధ్యయనం సీతాదేవిగారి రచనలలో కనిపించే ప్రత్యేక లక్షణాలు. మూడుపదులకుపైగా నవలలు, శతాధికంగా కథలూ రచించి, తెలుగు కాల్పనిక సాహిత్యలోకంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని యేర్పరుచుకున్న వాసిరెడ్డి సీతాదేవిగారి 'ఉరిత్రాడు' నవలకి 1979 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి బహుమతి లభించడం, ఆమె అభిమానులకు సంతోషకరమైన విషయం. ఇటువంటి బహుమానాలూ, పురస్కారాలూ సీతాదేవిగారికి కొత్తకాదు. సీతాదేవిగారి మరొక నవల 'సమత'కి 1972లో సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 'మట్టిమనిషి' వంటి మహత్తరమైన నవలని రచించిన రచయిత్రికి నిజానికి యేమిచ్చినా తక్కువే.

—సమత

కళాశాల విద్యార్థుల కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

తెలిసింది

పి. వి. కృష్ణారెడ్డి, బి. ఎస్సి. (ద్వితీయ)
జవహర్ భారతి, కావలి.

గోధూళి వేళ........

పొలాల నుంచి పశువులు ఇళ్ళకు తిరిగొస్తున్నాయ్. వీధుల్లో పిల్లలు కేకరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.

వీధి అరుగుమీద కూర్చొని పిల్లల ఆటలు చూస్తూ ఆలోచిస్తున్నాడు ఎలమంద. ఉదయం నుంచి ఆలోచనలతో ఒక కొలిక్కి రాలేక పోతున్నాడు.

వాళ్ళ తాత గొప్ప ఆసామి. కాని, ఆయన దాన ధర్మాలవల్ల కుటుంబం చితికిపోయింది. ఎలమంద గృహస్థుడయ్యేనాటికి ఒక ఎకరం మాత్రమే మిగిలింది.

ఆ ఊళ్ళోనే ఒక ఆసామి దగ్గర సేద్యానికి చేరాడు. పెద్దపిల్ల పెళ్ళి చేయడానికని, ఆ డబ్బుని పదహారేళ్ళనుంచి ఆయన దగ్గరే దాచాడు. ఏడెనిమిది వేలు అయివుంటుందని అప్పుడప్పుడూ సంబరపడేవాడు.

ఈ మధ్యనే పిల్లకి సాయిపేట సంబంధం కుదిరింది.

వెళ్ళి తన ఆసామికి చెప్పాడు.

"అట్టాగేలే....నీ బరువు దిగిపోయింది-సంతోషం—ఇంక ఆ చిన్న పిల్లగూడా ఏదో నాలుగు రాళ్ళు వెనకేస్తే నీకేబాధా వుండదు. మగపిల్లకాయల దేముంది, ఎటాగయినా బతుకుతారు" అన్నాడు.

పిల్ల పెండ్లయిపోయినట్లు సంబరపడిపోయాడు. ఇక జీవితంలో తనకే బాధా లేదని ఆనందంగా ఇంటికెళ్ళిపోయాడు.

పెండ్లికి మూడు రోజులుందనగా, ఒకనాటి రాత్రి వెళ్ళి మరలా గుర్తు చేశాడు.

"పెండ్లింక మూడ్రోజులుంది. రేండ్రోజుల ముందుగా వాళ్ళకి డబ్బియ్యాలి. నా డబ్బుగాక మరో నాలుగొందలు సర్దాలయ్యా."

"అదిగా దెలమందా! నీ దగ్గిరికి నరసింహన్ని పంపా, చెప్పలా?"

"చెప్పలేదయ్యా, ఏంది?"

"ఏం లేదు. డబ్బేమో వుందిగాని, ఆ కోనేటి మిట్ట వెంకటేశ్వర్లు లేడూ-వాడి పొలం అమ్ముతుండాడు. బేరాలు కుదిరిపోయినయ్. రెండు వేలు అడ్వాన్సు కూడా ఇచ్చా. ఇప్పుడా పొలానికి ఇంకొక ముప్పైవేలు గావల, ఎట్టాగా? అని ఆలోచిస్తున్నా" అన్నాడు.

"ఇప్పుడెట్టాగయ్యా?"

"ఆఁ ఏం లేదు, పెళ్ళికేం తొందర; ఓ రెణ్నెల్లు ఆగకూడదదూ? అప్పుడయితే డబ్బులు చేతికొస్తాయ్, ఇంకో రెండు వేలు ఎక్కువిస్తా."

"ఇప్పుడు తమరెక్కడయినా బదులు తీసుకోగూడదంటయ్యా?"

"తీసుకోవచ్చు. ఎవుణ్నడిగినా ఇస్తాడు. కాని ఇప్పుడేం అంత తొందర? ఎవర్నయినా అడగితే అలుసైపోతాం. అందుకని...."

"అదిగాదయ్యగారూ! పెళ్ళాగిపోతే ఎట్టాగయ్యా? ఎల్లుండిపాటికి వచ్చేస్తారంతా. ఇప్పుడాగిపోతే దానికి జన్మలో పెళ్ళిగాదు, ఏదో మంచి సంబంధం."

"మంచి సంబంధం అంటున్నావ్.... వాళ్ళకే రెణ్ణెల్లాగి ఇస్తానని చెప్పు. ఈలోగా నే నెలాగో సర్దుతా."

"మర్యాదగా ఉండదయ్యా.... నలుగురి ముందు నగుబాట్లవుతుంది. మీరే ఎక్కడో దగ్గర అందుకొండయ్యా" అన్నాడు ఎలమంద.

కాని ఆసామికి ఆ మాటలు చెవికెక్కలేదు. కాస్త గట్టిగా మాట్లాడేసరికి అసలు నా దగ్గర నీ డబ్బేం లేదు పో! పొమ్మన్నాడు. తనెం బ్రతిమాలేడు. కాని లాభం లేదు. ఇప్పటి వరకూ రెణ్ణెల్ల తరువాతయినా వస్తుందని ఆశ వుండింది. ఇప్పుడు అది కూడా పోయింది.

ఇప్పుడెలాగ!

ఎల్లుండి పెళ్ళి. ఏం చెయ్యాలి! ఏం తోచ లేదు. పిల్ల [illegible] పుణ్యహీనంగా చూస్తున్నాడు.

[illegible]

[illegible] ఉన్నాయి. అవి ఇవ్వమని అడిగింది పాప.

"మీరు ముగ్గురూ మట్టి తీసుకొచ్చి ఇక్కడ పోస్తే, ముగ్గురికీ మూడిస్తా" అని అన్నాడు.

చాలా మట్టి పోశారు. 'ఇవ్వ'మని అడిగింది పాప.

"ఇంకా పొయ్యండి, ఇస్తా" అన్నాడు.

చాలా సేపటినుంచి పోస్తూనే వున్నారు. వాడు మాత్రం బుడ్డీలతో, మట్టితో ఆడుకొంటున్నాడు.

మట్టి పోసీ పోసీ ఇక పోయలేక ఆగిపోయారు. పాప అడిగింది "చాలా పోశాం ఇంకివ్వు."

"ఇప్పుడేనా! ఇంక యింతపోస్తే, అప్పుడిస్తా" అన్నాడు.

పాప బ్రతిమాలి, బ్రతిమాలి ఇక ఇవ్వడని ఏడుస్తోంది.

ఎలమంద పెద్దకొడుకు కూడా ఎప్పటికైనా ఇవ్వడా! అన్నట్లు ఆశగా వాటికేసి చూస్తున్నాడు.

ఎలమంద చిన్న కొడుకు రవి అడిగాడు "ఏరా మట్టి పోశాం, తలా ఒక బుడ్డీయ్."

"ఏమిట్రా బెదిరిస్తున్నావ్, నేనివ్వను. ఏం చేసుకుంటావో చేసుకోపో!" అన్నాడు.

"మర్యాదగా ఇస్తావా, ఇవ్వవా'"

"ఇవ్వను పోరా!"

రవి వాటిని పెరుక్కోబోయాడు. వాడు చేతికి చిక్కినన్ని పట్టుకొని, మిగతా వాటిని రవి అందుకోబోతుంటే కాలితో తన్ని పగుల గొట్టేడు.

రవికి వళ్ళు మండింది. చాచి చెంపకేసి రెండు కొట్టేడు. వాడు బుడ్డీలు అక్కడ పడవేసి ఏడుస్తూ, రవీవాళ్ళ యింటికి వెళ్ళాడు వాళ్ళమ్మకు చెప్పడానికి.

రవి తనకు దొరికిన బుడ్డీలలో రెండుంచు కొని, తలో రెండు పంచి, వాడికీ రెండు వుంచాడు.

రవీ వాళ్ళమ్మను తీసుకొచ్చాడు వాడు. ఆమె చేతిలో కర్ర. అక్కడ ఎలమందను చూసి, రవిని కొట్టబోయినదల్లా ఆగి— "ఏమయ్యా, రవిగాడు ఆ పెద్ద రైతుగా రబ్బాయిని కొట్టేడంట" అంది.

అప్పటివరకూ రవి వాళ్ళ నాన్నను చూడ లేదు. ఇప్పుడు నిలువెల్లా వణికిపోతున్నాడు. వాళ్ళ నాన్నంటే వాడికి 'సింహస్వప్నం'. తానేమో ఎవరిమీదనయినా కోపం వస్తే కొడతాడు కాని వాళ్ళ నాన్న మాత్రం ఎవరయినా పెద్ద ఆసామిగారి పిల్లాడ్ని కొడితే వూరుకోడు. ఇక ఆ రోజు రవి వీపు సంగతి చెప్ప నవసరం లేదు.

ఏదో ఆలోచిస్తున్న ఎలమంద ఈలోకంలో కొచ్చాడు. రవిని దగ్గరకు పిలిచాడు. రవి భయపడిపోయాడు - కొడతాడేమోనని. కాని ఎలమంద ఒక్కసారిగా రవిని కౌగలించుకుని, వాణ్ణి ముద్దాడాడు. ఈ హటాత్పరిణామానికి అంతా విస్తుపోయారు.

అదే అదననుకొని బుడ్డీలు తీసుకొని ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు.

"ఏందయ్యా-వీడు వూళ్ళో పిల్లల్నందర్నీ కొడుతుంటే, నువ్వటా ముద్దు చెయ్య, నీ నెత్తినెక్కి కూర్చుంటాడు."

"నీకు తెలియదే వీడి సంగతి. ముందు నువ్వెళ్ళి తండవా, చెప్పులు, చేతికర్రా పట్రా. ఆసామింటిదాకా పోయొస్తా."

"ఆ డబ్బులావు, ఇక లాభం లేదని రాత్రే గదయ్యా చెప్పింది" అంది.

"అవునే రాత్రి చెప్పింది నిజమే—కానీ ఇప్పుడు తెలిసింది-ఎట్లా తీసుకోవాలో!" □

వాగుడు మాటలు

— వింధ్యవాసిని

సాయంకాలం అయిదున్నరయింది. ఆఫీసు నుంచి రెండు బస్సులు మారి ఇల్లుచేరిన కృష్ణ ఉసూరని నిట్టూర్చేడు. నిర్మల లేదింట్లో. వంటామె యిచ్చిన కాఫీ తాగి బట్టలయినా మార్చుకోకుండా అలానే కూర్చుని, ఆవేళటి న్యూస్‌పేపర్ పుచ్చుకుని చదవసాగేడు.

కళ్ళు పేపర్లో అక్షరాల వెంట పరుగులు తీస్తున్నా, మనసు మాత్రం మరేదో ఆలోచిస్తోంది. హఠాత్తుగా ఎందుకో, "అమ్మగారెన్ని గంటలకి వెళ్ళారు?" అని వనామెని అడిగాడు.

"భోంచేసి రెండు గంటలకి వెళ్ళారండి" అందామె.

అడిగిన తర్వాత అన్పించింది కృష్ణకి ఎంత పనికిరాని ప్రశ్న వేశానా? అని. ఎన్ని గంటలకి వెళితేనేం? తాను వచ్చేసరికి ఆమె లేదు. ఎన్ని గంటలకి వస్తుందనే విషయం ఎవరూ చెప్పలేరు. ఇంకా ఆమె ఏం డ్రస్సు వేసుకుని వెళ్ళిందని అడిగితే బావుండు అనిపించింది.

కానీ అలాంటి ప్రశ్న అడగలేదు తను. మోడెస్టీ అడ్డం వస్తుంది.

నిర్మల కొక లైట్‌బ్లూ, ప్లెయిన్ అమెరికన్ జార్జెట్ శారీ వుంది. దానికి మాచింగ్‌గా బ్లూ స్లీవ్‌లెస్ చికెన్ వాయిల్ బ్లవుజ్ వేస్తుంది. ఆ డ్రస్సు వేసుకుని ఆమె బయటికి వెళ్ళటం కృష్ణ కిష్టం వుండదు. ఆ డ్రస్సులో ఎంత అందంగా వుంటుందో, తెల్లని గుండ్రటి భుజాలు, శారీ లోపల్నించి బయటికన్పించే జాకెట్ కింది భాగం ఎంత ప్రొవోకింగ్‌గా వుంటాయో ఇతనికి అనుభవ పూర్వకంగా తెలుసు. పెళ్ళికి ముందు ప్రేమించుకునే రోజుల్లో, ఎంతగానో కోరి ఆమెనా డ్రస్ వేసుకు రమ్మనేవాడు. మరి అదే ఇప్పుడు కంటకమయింది. ఆమె ఒంటరిగా బయటికెళ్ళినప్పుడా చీర కట్టుకోకపోతేనేం అనుకుంటాడు. కానీ నోరు విడిచి చెప్పలేడు పాపం. చెప్పినా వింటుందనే నమ్మకమూ లేదు. పైపెచ్చు ఎగతాళి చేసినా చెయ్యొచ్చు.

కృష్ణ ఇలా పేపర్ చదువుతూ మధ్య మధ్య ఆలోచనల్ని నంజుకుంట్లో వుండగానే, హైహీల్డు చెప్పులు టకటకలాడించుకుంటూ వచ్చింది నిర్మల. తాను అదే పనిగా ఆమె కోసం కాచుక్కూచున్నట్లు కన్పించటం ఇష్టం లేదు. అందుకని, "మిస్టర్ జగజీవన్‌రామ్, లీడర్ ఆఫ్ ది అపోజీషన్, టు నైట్ కారక్టరైజ్డ్ ది ప్రెసెంట్ గవర్నమెంట్ లెడ్ బై మిస్టర్ చరన్‌సింగ్ ఏస్ ఎ మైనారిటీ కేర్ టేకర్ గవర్నమెంట్, వుచ్ హేడ్ నో రైట్ టు టేక్ ఎనీ పాలిసీ డెసిషన్స్" అని తనలో తను చదువుతున్నట్లు పైకే చదివాడు.

చెప్పులొక మూలకి విసిరేసి కృష్ణకెదురుగా మరో కుర్చీలో కూలబడి, "అవ్వా టీ తీసుకురా" అని ఓ కేకేసింది వనామెని.

"అబ్బ. ఇవాళ భలే బోర్ కొట్టేసిందనుకో కృష్ణా. మూడు గంటలకల్లా రిహార్సల్స్‌కి రెడీగా వుండమంటాడు ఆ హేమంత్. ఒకరొస్తే ఒకర్రారు. బొత్తిగా డిసిప్లిన్ లేదు. అందుకే ప్రతిసారీ అనుకుంటాను ఈ ఎబిఆర్ డ్రామాల జోలికి వెళ్ళనే కూడదని" అని

మాట్లాడుతున్నదల్లా వంటావిడ తెచ్చిన టీ అందుకుని, ఇంకా అలాగే పేపర్ పట్టుకుని వున్న కృష్ణని చూసి, "అసలు నేనొచ్చానసీ, ఏదో వాగుతున్నాననీ గమనించావా?" అంది నవ్వుతూ.

"ఎందుకు తెలీదు? వింటూనే వున్నాను గద?" అని పేపర్ పక్కకి తీసి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు, ఆమె కట్టుకున్న గ్రీన్ ప్రింటెడ్ సింథటిక్ చూసి.

నిర్మలకి చదువుకుంటున్న రోజుల్నించీ డ్రామాలు రాయటం డైరెక్టు చేయటం, నటించటం అలవాటు అయింది. పెళ్ళయాక స్టేజి నాటకాలు మానేసి, రేడియో డ్రామాలకే పరిమితం చేసుకుంది తన టాలెంటుని. ఆమెకే హాబీ వున్నా కృష్ణకి అబ్జక్షన్ లేదు. కానీ ఆదే పిచ్చిగా పరిణమించటం మాత్రమిష్టం లేదు. అందుకే పట్టనట్లుగా వుంటాడు.

ర ర ర

ఉదయం ఎనిమిదిన్నరయింది. అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటూ, మీసాలు ట్రిమ్మింగ్ బాగా కుదిరిందా లేదాని చూసుకుంటున్నాడు కృష్ణ. అప్పుడే స్నానం చేసి వచ్చి దువ్వెన తీసుకుని కూచుంది నిర్మల.

ఇటు తిరిగి, "సైనాట్ కరెక్టుగా కుదిరిందో లేదో చూడవోయ్ కాస్త" అన్నాడు. నిర్మల దగ్గరకొచ్చి కొద్దిగా సరిచేసి, అతని రెండు భుజాలమీద చేతులేసి చిలిపిగా కళ్ళలోకి చూసింది.

"ఇవాళేమిటి ప్రోగ్రాం, రిహార్సల్స్ లేదను కుంటా." అన్నాడు.

"ఉహుఁ! లేదుగానీ సమతా పబ్లిషర్ మేనేజర్ని చూడటానికి వెళ్ళాలి. అతన్నన్ను వరకట్న నిషేధం మీదొక డ్రామా రాసివ్వమని ఎన్నాళ్ళబట్టో అడుగుతున్నాడు కద. అయిపోవచ్చింది రాయటం. వెళ్ళి మాట్లాడదామని."

ఆ మేనేజరంటే కృష్ణకి పడదు. అతనెప్పుడయినా పనిమీద తమ ఆఫీసు కొస్తుంటాడు. అతనికి గౌరవమివ్వటమంటే ఏమిటో తెలియదు. తానేదో అందరికన్నా పైమెట్టులో వున్నట్టు, మిగతా వాళ్ళంతా తన సబార్డినేట్సు అయినట్లు ప్రవర్తిస్తాడు.

"పర్సనల్‌గా వెళ్ళకపోతేనేం? ఓ కార్డు రాసి పారేస్తే సరి. ఎవర్నయినా పంపిస్తాడు" అన్నాడు.

"ఇలాంటివి లెటర్స్‌తో జరుగుతాయా కృష్ణా! ఒక వెయ్యిన్నరదాకా రెమ్యూనరేషన్ వుండే డీల్ యిది. జాగ్రత్తగా చేయాలి. అవతలి మనిషెంత పిసినారివాడో తెలిసుండీ మధ్యవర్తుల ద్వారా మాటలు జరపమంటావేం?" అన్నది ఆశ్చర్యంగా.

"అబ్బ. నీకెప్పుడూ డబ్బు గొడవేనా? నా ఫీలింగ్ అసలు అర్థం చేసుకోవేం? ఆ మనిషితో నీవెళ్ళి మాట్లాడటం నాకిష్టం లేదు" అనాలనిపించింది. కానీ అనలేకపోయాడు.

"అయితే సాయంకాలం నేరుగా టాంక్ బండ్ దగ్గరి కొచ్చేస్తావా! అలా తాసేపు గడిపి మంచి హోటల్లో భోంచేసి వద్దాం" అన్నాడు హుషారు తెచ్చుకుంటూ.

"ఓ....సారీ కృష్ణా! మా ఫ్రెండు సునీత ఇంటికొస్తానని మొన్ననే ఓ కార్డు రాసేశాను. తను తన ప్రోగ్రామ్స్ అన్నీ మానుకొని నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది. పోనీ, రేపు తప్పక వస్తాను. సరా?" అంది ఓదారుస్తున్నట్లుగా.

నీరసం వచ్చేసింది కృష్ణకి. ఎలాగో షూష్ వేసుకోవటం ముగించి, బ్రీఫ్‌కేసు పుచ్చుకుని బయలుదేరాడు.

నడుస్తోంటే, బస్ ఎక్కి ప్రయాణిస్తోంటే ఆలోచనలు గతంలోకి వెళుతున్నాయి తనకి తెలీకుండానే. ఎప్పుడూ యింతే నిర్మల. తన ఇష్టానుసారంగా కార్యక్రమాల్ని నిర్ణయించుకొంటుంది. తన కోసం ఎప్పుడూ ఆమె ప్రోగ్రామ్స్ మార్చుకోదు. అయితే చేసే పనులకి కారణాలు మాత్రం బాగా సృష్టించగలదు. కృష్ణకి అనిపిస్తుంది, ఆమెకి తనతో రావటం ఒకోరోజు యిష్టంలేకనే అలా సాకులు చెప్పి సమర్ధించుకుంటుందేమో అని. అప్పుడూ, ఎప్పుడూ ఆమె ప్రవర్తన ఇంతే. కానీ,



అప్పుడు పెళ్ళికి ముందు, తామిద్దరూ ప్రేమించుకుంటున్న రోజుల్లో తన కోసం, వాళ్ళ నాన్నకి సాకులు చెప్పేది. అప్పుడదంతా తనమీద ప్రేమకి నిదర్శనంగా సంతోషాన్ని కలిగించేది.

అప్పట్లో ఒక రోజు జరిగిన సంఘటన గుర్తొచ్చింది. సాయంకాలం కాలేజీనించి నేరుగా వచ్చి, పబ్లిక్ గార్డెన్స్‌లో తామెప్పుడూ కూర్చునేచోట తనని కలుసుకుంది. అంతవరకూ రెస్టులెస్‌గా కాచుకుని వున్న తనకామె అల్లంత దూరంలో కన్పించేగానే, ఎంతో సంతోషమయింది. ఆ సంతోషంలో దగరికి రాగానే గట్టిగా వాటేసుకుందామనుకున్నాడు. కానీ అతని వుద్దేశం నిర్మలకేం తెలుసు? గబగబా నడవటం అందులో హైహీల్సుతో, ఒకవైపు చీరకుచ్చిళ్ళు ఎత్తిపట్టుకుని వచ్చి ఆయాసంగా కూచుంటూ "నిన్నేమయిందో తెలుసా కృష్ణా?" అని మొదలుపెట్టింది తన ధోరణిలో.

అయినట్టే ఇక; తను చెప్పాలిసిందంతా చెప్పేదాకా ఏం చేయనీయదు, మాట్లాడనీయదు అనుకున్నాడు కృష్ణ.

నిర్మల ఏదయినా చెప్పాలని అనుకుంటే అవతలి మనిషి రెస్పాన్స్ లేకున్నాసరే పట్టించుకోవటం వుండదు.

"నిన్న మా డాడీ వూళ్లో లేరని ధైర్యంగా నీతో సినిమా కొచ్చేనా? ఇల్లు చేరేసరికి తొమ్మి

దిన్నరయింది. హాయిగా "ఆకాశం నీ హద్దురా అవకాశం వదలొద్దురా" అని హమ్ చేసుకుంటూ ఇంట్లో అడుగు పెట్టేను. ఆఫీసు రూమ్‌లో లైటు కనిపించేసరికి గుండె గుభేలుమంది.

"నిమ్మీ ఏమ్మా ఇంతాలస్యం అయింది?" లోపల్నించి విన్పించింది నాన్నగారి స్వరం గంభీరంగా. మా డాడీకి నేనంటే ఎంత ముద్దు అయినా, డిసిప్లిన్ తప్పితే వూరుకోరని తెలుసుగా?"

గబ గబా చెబుతోంది. "ఫరవాలేదు. కాస్త నిదానంగా చెప్పు. తొందరేం లేదు" అన్నాడు కృష్ణ హాస్యంగా.

నిర్మల ఆ హాస్యాన్ని కూడా గమనించే స్థితిలో లేదు.

"అప్పుడొక్క క్షణంలో నాకెలా స్ట్రయిక్ అయిందో ఏమో. మెల్లిగా వెళ్ళి డాడీ కుర్చీ చేతిపై కూచుని "మరేమో డాడీ - మా బోటనీ మాడమ్‌కి నేనంటే చాలా ఇష్టమని చెప్పలేదూ? ఆవిడే సాయంకాలం ఇంటికి బయలుదేరి వెళ్ళేటప్పుడు, 'నిర్మలా! ఇవాళ మా యింటికి రారాదూ? అని ఆహ్వానించింది. ఆమె అలా ఎవర్నీ అడగదు. నన్నయినా యిదే మొదలు. మారు మాట్లాడకుండా వెంట నడిచాను.

"సబ్జక్ట్ గురించి ఏదో మాటాడుకుంటూ రిక్షాలో ఆవిడ ఇంటికి వెళ్ళాము. ఆవిడ నా కోసమని కాఫీ, టిఫిన్‌చేసి పెట్టేరు. ఇంతలో ఆమె కొడుకు నాలుగేళ్ళవాడు ఆటల్లో కింద పడి నుదుటికి దెబ్బ తగిలించుకుని వొచ్చాడు. ఏకధారగా రక్తం కారిపోతోంది. ఆ రక్తం చూడగానే మేడమ్‌కి కళ్లు తిరిగినట్లయి మాట్లాడలేకపోతున్నారు. సమయానికి ఆవిడ భర్త ఇంట్లో లేరు. నేనే గబ గబా ఓ కర్చీఫ్ గట్టిగా కట్టి ఆమెని తొందరపెట్టి హాస్పిటల్‌కి బయలుదేరదీశాను. ఆటో తీసుకుని, హాస్పిటల్‌కి వెళ్ళి చూపితే, బాగా చీలింది కుట్లు వేయాలన్నారు. అవన్నీ అయి, డ్రస్సింగ్ చేయించుకుని ఇంటికొచ్చేసరికి ఎనిమిదిన్నరయిపోయింది.

"అప్పుడు టయిం చూసుకుని నేను గాభరాగా ఇంటికి వెళ్ళాలన్నాను మేడమ్‌తో. అప్పటికామె భర్త సుబ్బారావుగారు వచ్చున్నారు. జరిగిందంతా తెలిసి నాకెంతగానో కృతజ్ఞతలు చెప్పారు—టయానికి మేడమ్‌కి సహాయం చేశానని. అయినా నేను స్పెషల్‌గా చేసిందేముంది డాడీ? ఆ సిచ్యువేషన్‌లో ఎవరున్నా అంతమాత్రం చేయగలిగేవాళ్ళు కదూ? ఎంత చెప్పినా వినకుండా, భోజనం చేయాలని ప్రెస్ చేశారు. అయినాక ఇద్దరూ కలిసి టాక్సీ తీసుకొచ్చి ఆ వీధి చివర్లో దిగబెట్టి వెళ్ళారు" అని ముగించాను.

"నమ్మినట్లే కన్పించారు డాడీ. "అక్కణ్నించి అలాగే పంపేశావా? ఇంటికి రమ్మనలేదూ?" అనడిగారు.

"మీ రింట్లో వుంటారని నాకేం తెలుసు? ఇంకోసారెప్పుడయినా మీకు చెప్పి ఆహ్వానిద్దాంలే అని వూరికే వుండిపోయాను" అన్నాను.

ఆమె సమయస్ఫూర్తికి పొంగిపోయాడు కృష్ణ అప్పుడు. ఆ తెలివే నా ప్రాణం తీస్తుంది అనుకుంటున్నా డిప్పుడు.


* * *

తెల్లారి ఆరున్నరయింది. కృష్ణ నిద్ర పోతున్నాడు. నిర్మల లేచి ఆవలిస్తూ వచ్చి పేపర్ పుచ్చుకుంది.

"అమ్మా, పాలకి డబ్బులు" అంది అవ్వ.

ఒక బాటిల్ పాలకి ఒక్క రూపాయి ఐదు పైస లివ్వాలి. తన బేగ్‌లో రూపాయిలున్నాయి కానీ చిల్లరలేదు. అయిదు పైసల కోసం కృష్ణ పేంటు జేబులో చూస్తే రెండు చిన్న కాగితం ముక్కలుకూడా తగిలాయి. ముందుగా అవ్వకి డబ్బిచ్చి పంపేసి, పేపర్ ముక్కల్ని పరీక్షించింది. రెండు రెక్స్‌థియేటర్ సినిమా టికెట్ ముక్కలు. ఏదో మోసం జరిగిపోయినట్లుగా కుంచించుకుపోయింది నిర్మల ముఖం. క్రితం రాత్రి లలితకళామందిర్‌లో ఏదో సాహిత్యసభకి వెళ్తానని చెప్పినట్లు గుర్తు. ఆవేళ తనకేం ప్రోగ్రాం లేదు. ఇద్దరం కలిసి ఎటయినా వెళదామన్నది.

"సారీ నిమ్మా. మా ఫ్రెండొకడు పాస్



పట్టుకొచ్చిచ్చాడు. మాంచి సాహిత్య సభ. మిస్ కావడమెందుకని వెళదామనుకున్నాను. ఏమనుకోకు" అని బుగ్గమీద చిటికేసి వెళ్ళిపోయాడు. సాహిత్యసభలంటే తనకూ ఇష్టమే. వీలుంటే తనూ వెళుతోంటుంది. దానికయితే వద్దనడనే అలా చెప్పాడు కృష్ణ.

ఉహుఁ ఇలా ట్రిక్ వేశాడన్నమాట-అనుకుని పెదవి కొరుక్కుంటూ, ముఖమయినా కడుక్కోకుండా అలానే కూలబడిపోయింది.

ఈయనెప్పుడూ ఇంతే. దేనికయినా సాకులు ఎక్స్‌క్యూజెస్ వెతికి, మోసం చేయటం బాగా అలవాటు. ఒకప్పుడు పెళ్ళికి ముందు, తన కోసం వేరేవాళ్ళని బుట్టలోపడేసి వొచ్చేవాడు- ఇలా అనుకుంటే ఆమె మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

ఒకరోజు నిర్మల కాలేజీకి వెళ్ళగానే తెలిసింది, ఎవరో బిషప్ చనిపోయారని, సెలవిచ్చారనీను. వాళ్ళది మిషనరీ కాలేజి.

ఇంటికి వెళితే ఏం తోచదు. ఇప్పుడు కృష్ణని కలవగలిగితే హాయిగా సాయంకాలం దాకా ఏ గండిపేటకో చెక్కెయ్యొచ్చు. వెంటనే ఎదురుగా కన్పించిన టెలిఫోన్ బూత్‌లో దూరి కృష్ణ ఆఫీస్‌కి ఫోన్ చేసింది.

"కృష్ణా నువ్వు వెంటనే సెలవుపెట్టి వచ్చేసెయ్. అర్జెంట్" అంది సస్పెన్స్ క్రియేట్ చేస్తూ.

"ఏమిటి? అసలేమయిందో సరిగ్గా చెప్పవోయ్" అన్నాడతను ఆదుర్దాగా.

"అయ్యో మాస్టారూ? ఎందుకంత భయం. మాకు సెలవిచ్చేశారు. నువ్వు సెలవు పెట్టి వచ్చేస్తే....జామ్మని గండిపేట...."

నిర్మల మాటలు ముగించనేలేదు. "అఁ చాల్చాలు. ఇంకేం చెప్పద్దు. పెట్టెయ్యి ఫోను. ఒక్క నిముషం కూడా వేస్టు చెయ్యకుండా వచ్చేస్తాను" అని పెట్టేసాడు. ఆ మాటల్లో తొంగి చూస్తున్న ప్రేమకి పొంగిపోయింది నిర్మల.

ఇరవయి నిముషాల్లో స్కూటర్‌తో ప్రత్యక్షమయాడు కృష్ణ. గండిపేట అని చెప్పివుండటంవల్ల ఎవరో ఫ్రెండ్ స్కూటర్ తీసుకొచ్చాడు కాబోలు అనుకుంది నిర్మల. "కూచో మరి. నేరుగా వెళదాం" అని స్టార్ట్ చేశాడు. దారిలో కొన్ని స్నాక్స్, పళ్ళు పాక్ చేసుకుని అరగంటలో గండిపేట చేరారు.

చెరువు ఒడ్డున సావధానంగా కూచుని, కృష్ణ తలని తన ఒళ్ళో పెట్టుకుని వున్నపుడు అడిగింది నిర్మల "అయితే నా కోసం సెలవు పెట్టి వచ్చేశావు కదూ!" అంది.

"ఊహూ! సెలవు పెట్టలేదు. పర్మిషన్ పెట్టి వచ్చేశాను డియర్, ఆన్ డ్యూటీ నేను" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"ఆన్ డ్యూటీనా! ఏమని చెప్పావసలు?" అంది ఆశ్చర్యంగా.

"ఏవో ఒకటిలెస్తూ. ఇప్పుడెందుకవన్నీ" దాటెయ్యబోయాడు.

"ఊఁ అలాకాదు. చెప్పు కృష్ణా!" గోముగా అడిగింది.

"మా ఆఫీసర్ హయవదన్రావుగారికి సన్యాసులు, సాధువుల పిచ్చివుంది. ఊరిలోకి కొంచెం పేరున్న ఏ స్వామి వచ్చినా, వీలు చూసుకుని తమ ఇంటికి ఆహ్వానిస్తుంటారు. అలా ఎంత మందికి ఆతిథ్యమిస్తే అంత పుణ్యం వస్తుందని వారి అభిప్రాయం.

"నువు ఫోన్లో పిలవగానే నాకో అయిడియా తట్టింది. అంతే యేదో ఒక ఫైలు పట్టుకుని సంతకాలకోసం ఆఫీసర్ గదిలో దూరేను. ఇవాళ సాయంత్రమాయన ఒక ముఖ్యమయిన మీటింగ్ ఎటెండ్ అవాలసి వుంది. అందుకని పనిలో బిజీగా వున్నారు. అయినా ఛాన్సు తీసుకుని చెప్పాను.

"సర్. శంకరమఠానికి స్వామి రామానంద అని బెంగాల్ నుండి ఒక స్వామివారు వేంచేశారట. నా మిత్రుడొకడు వారి ముఖ్య భక్తుడు. మీకు తెలుసా సార్ వారు?" అన్నాను. వెంటనే రియాక్షన్ కన్పించింది. 'అలాగటోయ్ కృష్ణా. మరి మన యింటికి ఆహ్వానిస్తే బావుంటుందే. ఏమంటావ్?' అన్నారు. 'బావుంటుంది సర్. కానీ వారికింకా చాలా వూళ్ళకి వెళ్ళే ప్రోగ్రామ్స్ వున్నాయట. ఓ రెండ్రోజులిక్కడ వుంటారేమో అంతేనని చెప్పాడు నా స్నేహితుడు'' అన్నాను జాగ్రత్తగా.

"దాన్దేముంది. మనం ఇవాళే వెళ్ళి, మనింటికి రేపు వచ్చేలా ఆహ్వానిద్దాం. సరిపోదూ! కానీ నా కివాళ ఎటు వెళ్ళేందుకూ అసలు తీరికే లేదే. ఏమిటి చేయడం? పోనీ సాయంకాలం నువ్వెళ్ళి నా తరపున మాట్లాడరాదూ?" అన్నారు.

"ప్లానేం పారేలాలేదు అనుకుని ఆఖరి ప్రయత్నంగా, 'మరి నా స్నేహితుడి సహాయం కావాలంటే ఇప్పుడే వెళ్ళాలి. వాడు ఆఫీసుకి సెలవేసి ఉదయం నుండీ సాయంకాలంద్దాకా అక్కడే గడుపుతున్నాడు. ఇప్పుడు పోవటానికి కూడ నా పని—''' అని నసిగాను.

"'అఁ పనికేముంది, రేపు చూసుకోవచ్చు. అర్జెంట్ ఏదయినా వుంటే సురేష్కో, చంద్రశేఖరానికో చెబుతాను చూడమని. వెళ్ళు వెళ్ళు. నువ్వెళ్ళిరా....ఒట్టిగా ఆహ్వానించటం కాదు. వారేం తింటారో, వారి అలవాటేమిటో అన్నీ వివరంగా కనుక్కుని రావాలి. ఏం?' అని తన వర్క్లోకి పడబోతూ, తిరిగి అన్నారాయనే, 'అన్నట్లు కావాలంటే స్కూటర్ తీసికెళ్ళు. ఎంత సేపయినా ఫరవాలేదు. ఇప్పుడప్పుడే నాకేం అవసరం లేదులే' అని తాళాలు అందించారు.

"నాకు ఏనుగెక్కినంత సంతోషమయింది. ఆఘమేఘాల మీద వొచ్చాను" అని ముగించాడు కృష్ణ.

"మరి ఆ స్వామిని ఆహ్వానించటం...."

"అరే పిచ్చి నిమ్మా! ఇంత ఆలోచన్లేకుండానే ఇంత ప్లాన్ వేస్తానని ఎలా అనుకున్నావ్? ఆ స్వామి వారి శిష్యుడెవరో కాదు, నా క్లోజ్ ఫ్రెండ్ రాజబాబు లేడూ, వాడే. వచ్చే ముందు వాడికి ఫోన్ చేసి అంతా వివరంగా చెప్పివచ్చాను. చెయ్యాల్సిందంతా ఇప్పటికి చేసేవుంటాడు. నేను వెళ్ళే పనేలేదు" అని నవ్వేశాడు.

ఆరాధనగా చూసింది నిర్మల కృష్ణవయిపు.

ఆ సంఘటన తల్చుకుని, 'హు' అని నిట్టూర్చి, బాత్రూంకి వెళ్ళింది.

* * *

అవాళ "కోరికలే గుర్రాలయితే!" సినిమాకి వెళ్ళాలని రెడీ అవుతున్నారు, నిర్మల, కృష్ణ. కృష్ణ డ్రెస్ చేసుకుని కూచుని ఏదో పత్రిక చదువుతున్నాడు, నిర్మల రెడీ అయే లోపల ఓ

కథ చదివేయొచ్చని.

అద్దం ముందు కూచుని, ముడి, దానిలో రోజా పువ్వు చక్కగా కుదిరాయా లేదా అని తల అటూ యిటూ తిప్పి చూసుకుంటోంది నిర్మల.

"కృష్ణా నే నొక మాటడుగుతాను. సరే అంటావా?" ఇట్నుతిరగకుండానే, ముఖానికి పవుడర్ రాసుకుంటూ అంది.

పలకలేదు కృష్ణ.

"అసలు వినిపిస్తోందా?" కాస్త గట్టిగా అంది.

"ఏమిటోయ్. కథ మంచి ఇంటరెస్టుగా వుంటేనూ....యేవిఁటి చెబుతున్నావ్? ఇంకోసారి చెప్పు, వినేస్తాను త్వరగా."

"ఇంకా ఏమీ చెప్పందే...."

"సరే, మరి మొదలుపెట్టేసేయి...."

మళ్ళీ పత్రికలో ఎక్కడ తల దూర్చేస్తాడో నన్న భయంతో చెప్పేసింది.

"మరే. మనం ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాంగా బెంగుళూరు, మైసూరు వెళ్ళిరావాలని. ఈ వీక్లో రెండో శనివారం, ఆదివారం కలిసొస్తాయి. మరో రెండ్రోజులు సెలవ్ పెట్టేస్తే వెళ్ళిరావొచ్చు. వూఁ అను, కృష్ణా. ఈసారి దాటెయ్యకు."

"ఈ నెల్లో కొంచెం ఖర్చులెక్కువయ్యాయని నీకూ తెలుసుగా....మరి డబ్బులు...."

"ఆపాపు. నువ్వలా అనేసి తప్పించుకుంటావని తెలుసు. రేపు సమతా పబ్లిషర్స్ మేనేజర్ అయిదొందలకి చెక్ ఇస్తాడు అడ్వాన్సుగా, సో, ఆ ప్రాబ్లమ్ కూడా లేదు. సరేనా?"

"సరే. బాగానే వుందిగానీ, మరీ ఆఫీసులో కొత్త సూపర్నెంట్ వచ్చి పదిరోజులు కూడా అవలేదు. ఇన్నాళ్ళూ కష్టపడి పెంచుకున్న ఇంప్రెషన్ కాస్తా ఇప్పుడు సెలవు తీసుకుంటే ఏమయిపోతుంది? ఇంకొక్క నెల రోజులాగేవంటే తప్పక వెళదాం."


ఈ సారి వూరుకోలేదు నిర్మల. కృష్ణ దగ్గరకొచ్చి, కుర్చీచేతులమీద, రెండు చేతులేసీ అతని కళ్ళలోకి యేదోలాగ చూసింది. అప్పుడు గమనించాడు కృష్ణ. తన కిష్టమయిన లైట్ బ్లూ అమెరికన్ జార్జెట్ చీర కట్టుకుంది. తెల్లటి నుదుటిమీద ఎర్రటి బొట్టు, అచ్చంగా అదే కలర్లో లైట్గా వేసుకున్న లిప్స్టిక్, తలలో తొంగి చూస్తున్న ఎర్రగులాబీ పూవు-మత్తెక్కిస్తోంది ఆమె రూపం. గభాలున ఒళ్ళోకి లాక్కున్నాడు.


"కృష్ణా! బంగారువి కదూ? సెలవు పెట్టెయ్యవూ? ఏ ఆఫీసర్ అవుతే నీకేం భయం? ఏమ్నేం చేయగలరు? నీ సిన్సియారిటీ అందరికీ తెలిసిందే. రేపో మాపో నువ్వే ఆఫీసర్ అవుతావు. అందుకని యేదో ఒక సాకుతో సెలవు పెట్టెయ్. 'మదరిన్లా సీరియస్' అని టెలిగ్రాం వొచ్చిందని చెప్పేస్తే సరి. ఎలాగూ మా అమ్మ లేదు గద...."

అతను వీపుమీద చేతులేసి లాక్కుంటోంటే ఊపిరి తిప్పుకుని మెల్లిగా అంది. "అయినా యేదయినా చేయాలనుకున్నావంటే దానిక్కారణాలు వెతికి చెప్పటం నీకు వెన్నెతో పెట్టిన విద్య కదూ?" అనేసింది, అనకూడదనుకుంటూనే.

నిజానికి మామూలుగా అవుతే, "నువ్వేం తక్కువదానివా?" అనేసి వుండేవాడు కృష్ణ.

చిన్నప్పు డాడుకునే దాగుడుమూతలు, పెద్దాళ్ళయ్యాక, పెళ్ళయాక కూడా ఆడుకుంటే? □





అల్లావుద్దీన్ అభినవదీపం

దాసుబాబు

అల్లావుద్దీన్, మజ్జా మహానగరం మధ్యలోకి వచ్చిం తర్వాత, ఓ చౌరాస్తాలో నిల్చుని నలువైపులా పరికించారు. అన్నీ సినిమా బోర్డులే కనిపించాయి. అల్లావుద్దీన్ ముచ్చట పడ్డాడు.

"మజ్జా మనం ఏదన్నా సినిమాకెళ్దామా?"

"మనమా? సినిమాకా? ఇక్కడా?" మజ్జ ఆశ్చర్యపడ్డాడు.

"ఏం మనం సినిమా చూడకూడదా?"

"చూడొచ్చు సార్. కాని ఏ సినిమా చూద్దాం చెప్పు. నిజం చెప్పాలంటే నీ కథనే పది రకాలుగా మార్చి, హీరోల్ని మార్చి, పేర్లు మార్చి పాతిక సినిమాలు తీశారు.... యిప్పటికి."

"ఏంటి మజ్జా మార్చిమార్చి అంటున్నావ్? ఇది ఏప్రిల్ కదా! నాకేం అర్థం కావడంలేదు."

"చాలా పాత జోకు సార్! మీకు జీవితానుభవమే సరిగ్గా లేదు. సినిమా అనుభవం అసలే లేదు. మార్చి మార్చి ఈ మనుషులు చేసే పనులు నీకెలా అర్థమవుతాయి చెప్పు?" మజ్జ అనుభవం మీద చిన్నపాటి లెక్చర్ దంచాడు.

"అదేమన్నా సరే-నాకర్థమయ్యేటట్టు చెప్పాల్సిందే—" అల్లావుద్దీన్ పట్టుపట్టేడు.

"చూడు సార్! మాటకొక లెక్చర్ కొట్టొచ్చు. నా మాటలకు అంత బరువుంది. తమరు ప్రతి మాటకు బంగమూతి పెడితే నేను చావాలి....వాటిని వివరించలేక! ఇక్కడ మార్పిడి బిజినెస్ చాలా స్ట్రాంగు. వీళ్ళు ప్రతిదీ మార్పిడి చేస్తారు. చెప్పుకోడానికే సిగ్గు. పోన్లే నువ్వడిగింది సినిమా గొడవ కదా, అదే చెప్తా. పొరబాటుగా ఏదన్నా సినిమా హిట్టయిందనుకో—"

"హిట్టంటే?" అల్లావుద్దీన్ అడిగాడు.

"బాగా డబ్బులు సంపాదించినదన్నమాట. ఆ హిట్టయిన సినిమా పేరు మార్చి, నటుల్ని మార్చి, పాటల్ని మార్చి, ప్రేక్షకుల్ని యేమార్చి మరో సినిమా తీస్తారు. మళ్ళీ దాన్ని చూసి మళ్ళీ మరొ హిట్....మళ్ళీ మళ్ళీ మరో హిట్....మళ్ళీ మళ్ళీ—"

"ఛా-పూర్కో. ఎన్ని మళ్ళీలు?" అల్లావుద్దీన్ అడిగాడు విసుగ్గా.

"ఈ మాట అడగాల్సింది నన్ను కాదు; సినిమాలు తీసేవాళ్ళని. మజ్జ చేతులు కట్టుకుని ముఖం పక్కకు తిప్పి పోజు పెట్టాడు.

"పోనీ వాళ్ళు తీస్తే తీశారు. అందులో నటించే నటులకయినా...."

"అబ్బెబ్బే—వాళ్ళు ముడితే చాలు. తమ పనేదో తాము చేసుకుపోయే మంచివాళ్ళు."

"పో మజ్జా నువ్వన్నీ బడాయి మాటలు చెప్తావ్...."

"నిజం సార్! మన హీరోకి తెలివొచ్చేది ఇంటర్‌వెల్ తర్వాతనే....తెలుసా? అసలు చెప్పాలంటే ఇంటర్‌వెల్ తర్వాత కనిపించే హీరోకి ఇంటర్‌వెల్‌కి ముందు కనిపించే హీరోకి బుద్ధుల్లో పోలికలే వుండవు. అయినా హీరోలంతా నటించడంలేఁ అంతే...." మజ్జ బాధగా అన్నాడు.

"ఏమిటో మజ్జ, యింత ఖర్చుపెట్టి తీస్తారుకదా జాగ్రత్తగా తీస్తే పోలేదూ?" అల్లావుద్దీన్ సలహా విసిరాడు.

"ఆఁ ఆఁ జాగ్రత్తగానే తీస్తున్నారు అవి పోతూనే వున్నాయి. ఈదేశంలో పెద్ద అదృష్టం ఏమిటో తెలుసా? పాతికదాకా రకరకాల రాష్ట్రాలుండటమే. అందులో ఓ అరడజను భాషల్లో సినిమాలు వారానికొకటి బయట కొస్తాయి. అ సినిమాల్ని ఆ భాషవాళ్ళు, ఈ భాషవాళ్ళు చూశాక....మార్పిడి బిజినెస్ మొదలవుతుంది. అరవంనుంచి తెలుగుకి, తెలుగునుంచి హిందీకి; మళ్ళీ హిందీనుంచి తెలుగుకి, తెలుగునుంచి అరవానికి! అంటే ఒకె సినిమా కాస్త బావుంటే ఆరు సినిమాలకు అమ్మ అవుతుంది!" మజ్జా ఇకిలించాడు.

"అబ్బా....అంత గొప్పగా కొడతారన్న మాట 'కాపీ!'" అల్లావుద్దీన్ నవ్వాడు.

"అహో—నీకూ అర్థమయిందే సిన్మాల సంగతీ...." మజ్జ దీర్ఘం తీశాడు.

"ఇదంతా బాగానే వుంది కాని....ఇప్పుడు వున్నపళంగా ఏదన్నా సినిమాకి తీసుకెళ్ళు—" ఆదేశించాడు.

మజ్జ నొచ్చుకున్నాడు. కాని తప్పదు. అరవై ఓట్టుల బల్బు మహత్యం!

ఎత్తు, పొడవు, వెడల్పు—అన్నీ సరిగ్గా వున్న ఓ సినిమా టాకీస్ దగ్గర కొచ్చారు యిద్దరూ. సినిమా హాలు ముందు జనం కిటకిటలాడుతున్నారు.

"మజ్జా ఏమిటి ఇంతమంది వచ్చారు.... ఇక్కడేమయినా జాతర జరుగుతుందా?" అల్లావుద్దీన్ అడిగాడు.

"ఆహా! ఎందక్కా అడిగావ్ సార్। జాతరే ఇది. ప్రతి సినిమా ఇక్కడవాళ్ళకి జాతరే! ఆ సినిమా ఎలా వున్నా సరే - తిరనాళ్ళకొచ్చినట్టు జనం వచ్చి పడుతుంది. తిండికన్నా ఎందుతారు గాని సినిమా చూడకుండా వుండలేరు. రెండు ఇంగ్లీషు రాగాలు, రెండు ఇండియా రాగాలు జొప్పించి-నాలుగు డాన్సులు పెట్టి ఒక సినిమా తీసి ప్రజల మీదకు విసిరేస్తారు...." మజ్జూ గుక్క తిప్పుకోకుండా.

"అంతమాత్రానికే ఇంత విరగబడి సినిమాలు చూస్తున్నారంటావా?" ధర్మసందేహాన్ని వెలిబుచ్చాడు అల్లావుద్దీన్.

"చెప్పాగా. ఆ సినిమాలు అంతే ఈప్రజలు అంతంతే. పోతే ఒహల్లే....ఇప్పుడు కొత్త ఫార్ములా కనిపెట్టారు. అది ఎంత మంచి సినిమా అయినా సరే ఏదో ఒక రీల్లో హీరోయిన్ గుడ్డలిప్పాల్సిందే; ఎక్కడో ఒకచోట రేప్‌సీను వుండాల్సిందే! హ్హ...."మజ్జు ముఖం సిగ్గు పడింది: పళ్లు బయటకొచ్చాయి.

"ఛీ, మరీ ఇంత పబ్లిక్కుగా ఆలాంటివా?"

"అదే గమ్మత్తు....పబ్లిక్కు వెళ్ళేదే వాటి కోసం! అవి లెవ్వనుకో—ఇక అంతే సంగతులు" మజ్జూ నవ్వాడు.

ఇంతలో గళ్ళ చొక్కావాడు అక్కడ కొచ్చి, అల్లావుద్దీన్‌ని మజ్జూని ఎగాదిగా చూసి పక్కకు తిరిగి—

"మూడు రూపాయల్ ఐదు రూపాయల్" అన్నాడు. అవే మాటలు రెండు మూడుసార్లు అని, కాస్త దూరంగా వెళ్ళి నిల్చొని 'ఏమంటారు'—అన్నట్లు చూస్తూ వున్నాడు. ఇదేమిటి అన్నట్లు అర్థం కాని చూపులు చూశాడు అల్లావుద్దీన్.

"ఇదొక మార్పిడి బిజినెస్. మొత్తం టిక్కెట్లలో సగం కిటికీల్లో, సగం రోడ్డుమీద."

"సగం రోడ్డుమీదేమిటి?"

"ఇక్కడ నడిరోడ్డే నల్లబజారు! పట్ట పగలే నిలువుదోపిడి! ముందుగా ఏవో కొన్ని టిక్కెట్లు మామూలుగా కిటికీల్లో అమ్ముతారు. మిగతా టిక్కెట్లన్నీ నల్ల బజారుకు మెల్లగా జారుకుంటాయి. మూడు రూపాయల టిక్కెట్ అయిదు రూపాయల, కమ్మడం." కమీషన్ డబ్బులు అందరూ పంచుకోవడం."

"అందరూ అంటే—" అల్లావుద్దీన్ అమాయకంగా అడిగేడు.

"మనం కాదుతే! కమీషన్ తతులు కొన్ని వుంటాయి. బతుకంతా కమీషన్ బతుకే" మజ్జు అసహ్యించుకొన్నాడు.

"మజ్జూ—యిక్కడేవిటి ఒకళ్ళ వెనకాల ఒకళ్ళు అంత పొడుగ్గా?"


"దాన్ని 'క్యూ' అంటారు. అంటే వరస క్రమం అన్నమాట. అసలు క్రమం మాట దేవుడెరుగు-వరసయితే వుంది. వీళ్ళంతా టికెట్లకోసం క్రమంగా జపం చేస్తున్నారు పాపం—"మజ్జూ జాలి ఒలకబోస్తూ అన్నాడు.

"ఇందులో పాపం ఏముంది మజ్జూ?"

"చెప్పాగా.... సగం టికెట్లు నల్లబజారు చేరుకుంటాయని. ఈ రోజు తప్పకుండా సినిమా చూడాలనుకుంటే బజారు పాపం పంచుకోవాల్సిందే!" మజ్జు వ్యంగ్య ధోరణి అల్లావుద్దీన్‌కి అర్థం కాలేదు. కాసేపు తటపటాయించి—

"ఏమో మజ్జు....నువ్వన్నీ పాపం మాటలు మాట్లాడుతున్నావ్. సినిమా చూపించు అంటే ఇంత కథ చెప్పితే ఎలా? ఏ గోడమీద చూసినా సినిమా గొడవే గదా, పాపం అంటే ఎలా? ఎన్నో లక్షలు ఖర్చుపెట్టి సినిమాలు తీసి కళాపోషణ చేస్తున్నారుకదా....నువ్వింత నిర్దయగా మాట్లాడితే ఎలా?" అల్లావుద్దీన్ తెలివిగా మాట్లాడాననుకున్నాడు. మజ్జూ వూరొక్కలేదు.

"కళాపోషణ కాదు సార్....ఉగర పోషణ! ఇన్ని లక్షలు పెట్టి కళాసేవచేస్నేమహానుభావులెవరున్నారు? అయినా లక్షలు....కోట్లు పెట్టి కళాపోషణ అంటే చాలా ప్రమాదం....ఏమీ లేదు చిప్ప చేతికొస్తుంది. నిజం చెప్పాలంటే అసలు కళాపోషణ చేసేది తీసిన ప్రతి సినిమాని నమ్మకంగా చూసే పేద ప్రజానీకం. నిజానికి వాళ్ళ అండదండలే గనుక సినిమా



వాళ్ళకు లేకపోతే - భిక్షాందేహి"-మజ్జు పళ్ళు బయటకొచ్చాయి. చివరి మాటలు అర్థంకాక పోయినా అల్లావుద్దీన్ కూడా నవ్వాడు....మజ్జు పళ్ళు చూసి.

"పోతే ఒహల్లే, అప్పుడప్పుడు కళాఖండాలు వస్తూనే వున్నాయి. అయితే అందులో కూడా గమ్మత్తు వుంది. కళాఖండాలుగా వుండాలని సినిమాలు తియ్యడం లేదు. అవి బయట కొచ్చి, తెర ఎక్కాక కళాఖండాలు అని ప్రజానీకం అనేసరికి—నిజమేమోనని నిర్మాతలు జబ్బలు చరుచుకుంటున్నారు. అంతేగాని సినిమాలో కళేమిటి....అంతా వ్యాపారం.... మార్పిడి బిజినెస్—" మళ్ళీ మొదటికొచ్చాడు మజ్జు.

"పోన్లే మజ్జు-వ్యాపారం అంటున్నావ్‌గా - ఎవరో ఒకరు బాగుపడతారు."


"అంతే అంతే— ఎవరో ఒకరే బాగుపడతారు. ఈ సినిమాలో నువ్వు తెల్సుకోవలసిన సత్యం మరొకటి వుంది. ఇందులో బాగుపడే వాళ్లకన్న నష్టపొయ్యే వాళ్ళే ఎక్కువ"

"అంతే నంటావా?"

"ముమ్మాటికీ అంతే సార్. చూశారా ఇక సినిమా' యేం చూస్తాం హౌస్ ఫుల్. అంటే టిక్కెట్లు లేవు అని అర్థం. ఇంకా చెప్పాలంటె రోడ్డుమీద టిక్కెట్లు కొనండి అని అర్థం. అవి ఎలాగూ మనం కొనం. పదండి సార్ అన్నపూర్ణాలో మీకు డబుల్ స్ట్రాంగ్ కాఫీ తాపిస్తా" మజ్జు హోటల్ వైపు దారి తీశాడు. అతని వెనకాలే వెళ్ళక అల్లావుద్దీన్‌కి తప్పలేదు.

(ఇంకా వున్నాడు)





(3)

MCA-PDF-62-TEl

సులక్షణ

— పి.వి.యస్. అచ్యుతవల్లి

శివరాం సాయింత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే రోజూలానే అడిగింది సత్యవతి

"ఆమెను కనుక్కున్నారా?" అని. శివరాం తల అడ్డంగా విదిలించేడు లేదన్నట్లు. ఆ దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్దది ఆడపిల్ల. బేబి. ఏడవ తరగతి మూడేళ్ళనించి దాటటం లేదు. తర్వాత పిల్లవాడు నందూ. వాడుకూడా ఏడవ తరగతిలోకి వచ్చేడు. తర్వాత పిల్లవాడు బుజ్జి. చేతిపిల్లవాడు. రెండో మూడో చదువుతున్నాడు. ఆ రోడ్డు చివరగానున్న పెంకుటింటిలోనికి ఒక పంతులమ్మ అద్దెకు వచ్చింది. నాలుగయిదు రోజుల్లోనే ఆ వాడకట్టు పిల్లలు చాలామంది ఆమె వద్దకు ప్రయివేట్ చెప్పించుకునేందుకు చేరిపోయ్యారు. ఇరుగూ పొరుగూ వాళ్ళు ఆవిడ చాలా బాగా చెప్పుతూందనే సర్టిఫికేట్ కూడా ఇచ్చారు. సత్యవతికి అరికాళ్ళల్లో దుమ్ము లేచిపోవటం మొదలు పెట్టింది. ఎంతో బాగా చదువుకునే పిల్లలకు కూడా ప్రయివేట్ పెట్టించారు. తన పిల్లలు శుద్ధ మొద్దులు. అందులో నందూ వున్నాడంటే అయిదూ నాలుగూ ఎంతంటే ఎనిమిదంటాడు తడుముకోకుండా. బేబీ అయితే ఏదో ఊసుపోని చదువు అనుకుంటుంది. మగపిల్లవాడికి కూడా చదువు అబ్బకపోతే ఎలాగు? ఇరుగు పొరుగూ కొత్త పంతులమ్మ సమర్థత పొగుడుతున్నకొద్దీ సత్యవతికి ఆరాటం ఆగటం లేదు. శివరాం ఆ దారినే వస్తూ పోతూ వుంటాడు. కాస్త ఒక్కక్షణం ఆగి, ఆమె పరిచయం సంపాదించుకుని "మా పిల్లలకి కూడా ట్యూషన్ చెప్పండి" అని ఖరారు చేయించటానికి ఇంత త్రతిమిలాడించుకుంటున్నదేమిటి! అనుకుని విసుక్కుంది.

"ఏమిటండీ! వారం రోజులనుంచి చెబుతున్నాను, పంతులమ్మకు చెప్పి కుదిర్చారా అని! ఎందుకు అలా ఆలస్యం చేస్తారు? అప్పుడే సెప్టెంబరు చివరి వారం వచ్చేసింది" అంది.

"నువ్వెళ్ళి మాట్లాడకూడదూ! నన్ను చంపకపోతే?" అన్నాడు.

"నయం. మీరు వెళ్ళితే బాగుంటుంది. కాని నేను వెళ్ళి ట్యూషన్ ఫీజు ఎంత పుచ్చుకుంటావు అని అడగనా? మొహమాటంగా వుండదూ?"

"మొహమాటం దేనికి? ఆవిడ చేస్తున్న వృత్తి అదేగా? టైలర్ వద్దకు వెళ్ళి జాకెట్‌కు ఎంత తీసుకుంటావు అని అడగవా? అలాగే ఇదీనూ."

"అదీ ఇదీ ఒకటేనా? ఈమె మర్యాదస్తురాలుగా వుంది. చటుక్కున మీరు ప్రయివేట్ చెప్పటానికి ఎంత పుచ్చుకుంటారని తేలిగ్గా ఎలా అడిగేస్తాం?"

"టయిలరింగ్ చేసుకునేవాళ్ళు మర్యాదస్తులు కారా?"

"ఏమిటో మరీ ఒక్కొక్క ప్రొఫెషన్ ఒకొక్కలా స్ఫురిస్తుంది. టయిలర్స్ యింతకంటె ఎక్కువే సంపాదించవచ్చును. కాని గబుక్కున జాకెట్టు కెంత, లంగా కెంత



అని రేట్లు అడిగేయటానికి వీలుగా వుంటుంది. టీచింగ్ ప్రొఫెసన్ అలా కాదు. గమ్మున మీరు ఇంతకయితే మా పిల్లలకు పాఠం చెప్పరా అని అడిగేయ బుద్ధి పుట్టదు. ఎంచేతనో? చదువుకుని స్వతంత్రంగా బ్రతుకుతున్న వాళ్ళని లోకువగా మాట్లాడబుద్ధవదు నాకు!" అంది సత్యవతి. శివరాం వింతగా చూసేడు ఆమె వెంప.

శివర్రాం పాతిక ముప్ఫయ్ సంబంధాలు వెతికి వెతికి చివరికి సత్యవతిని భార్యగా చేసుకున్నాడు. సంసారపక్షంగా వుండాలి. ఆడవాళ్ళు వంటయింటి గడప దాటకూడదు అని శివరాం అభిప్రాయం. శివరాం ఆఫీసులో లేడీ క్లర్క్లు వున్నారు. వనజ, కామాక్షి. వనజ బి. ఏ. ప్యాసయింది. ఇంచుమించు శివరాంతో సమానంగా జీతం వస్తుంది ఆమెకి. కామాక్షి హైస్కూలు. ఏమాత్రం చనువుగా మాట్లాడినా సంసారాన్ని చదవట్టించుకున్నట్లే అంటాడు చలం. వనజ చాలా రిజర్వుడుగా వుంటుంది. ఆఫీసరుకి దూరపు బంధువట. అందుకని అప్పుడప్పుడు అతని కారులో వస్తూ వుంటుంది. సత్యవతికి పెళ్ళి అయిన కొత్తలో శివరాం వాలకం అదో మాదిరిగా అన్పించేది. పండుగలకు, పబ్బాలకు తనని వెంటపెట్టుకుని తిరగకుండా అతనంతట అతనే బజారుకుపోయి చీరలు జాకెట్లు తెచ్చేవాడు. తెచ్చిన చీరలు తనకు నచ్చకపోయినా కట్టుకోవలసిందే.

"ఇంత పెద్ద పెద్ద పూల చీరలు నాకు బాగా వుండవు. నేను పొట్టిదాన్ని కదా! అయినా మీరు బజారుకు వెళ్ళేటప్పుడు నన్ను కూడా పిలుచుకుపోకూడదూ! సన్నని ప్రింట్స్ నా కిష్టం. బాగుంటాయి కూడాను" అంది. బేబీ పుట్టిన రెండేళ్ళకి కొంచెం చనువు వచ్చింది ఆమెకి.

"బజారుకు నువ్వెందుకు రావటం! ఈసారి సన్నని పూలవే తెస్తానులే" అన్నాడు శివరాం.

"అంతా బజారుకి వెళుతున్నారు. అసలు ఇంట్లో సరుకులు కూడా ఎవళ్ళంతట వాళ్ళే తెచ్చుకుంటున్నారు. ఎదురింటి వాణి లేదూ! ఆమె కూరగాయల మార్కెట్టుకు వెళుతూ నన్ను రమ్మంది. మీతో చెప్పలేదని అన్నాను. చెప్పేదేమిటిలెద్దూ అంది. మీరు కోపపడతారని భయమేసి, తల నొప్పి అని అబద్ధ మాడాను" అంది సత్యవతి.

"అబద్ధమాడవలసిన అవసరం ఏమీ లేదు. మావారికి చీటికి మాటికి ఆడవాళ్ళు రోడ్ల వెంట తిరగటం ఇష్టం వుండదు అని చెప్పేయి. ఇంక నిన్ను ఇక్కడకు రమ్మని అక్కడకు రమ్మని పీక్కుతినటం మానుతారు" అన్నాడు శివరాం ఖండితంగా.

చామన చాయలో నాలుగడుగులు మించి వుండదు సత్యవతి. కోల ముఖం, వంకులు వంకులు వున్న సన్నని జడ. శివరాం పచ్చగా పొడుగ్గా వుంటాడు. అతనిదీ కోల ముఖమే. వంకుల జుత్తు. చక్కని డ్రెస్సులో నీటుగా వుంటాడు అతను. చూడగానే అంత అందగత్తెలా కన్పించదు సత్యవతి. చూడగాచూడగా పల్చని చెక్కిళ్ళతో తళతళ్లాడే కళ్ళతో పొట్టిగా ఎత్తుగా వున్న ముక్కుతో లేత గులాబీరంగు పెదాలతో మృదువయిన మనిషి అని మటుకు అన్పించుతుంది. నందూ పుట్టినాక కాబోలు అప్పుడప్పుడు సిన్మాలకు తీసుకు వెళ్ళడం ప్రారంభించాడు. బుజ్జి పుట్టినాక సత్యవతికి కొంచెం నోరు వచ్చింది. ధైర్యంచేసి ఎదురింటి వాణితో రెండు మూడుసార్లు బజారుకు వెళ్ళింది. శివరాం ఏదన్నా అంటే ఎదురు జవాబులు చెప్పటం మొదలు పెట్టింది. ముగురు పిల్లల తల్లిని ఏమీ అనలేక తానే తగ్గిపోతున్నాడు శివరాం. నందూకు కొత్త పంతులమ్మ వద్దకు ఎప్పుడు వెళ్ళి చదువుకుందామా అని తహతహగా వుంది. అంచేత నెమ్మదిగా తండ్రి వద్దకు జేరేడు.

"నాన్నా! నాన్నా! పోనీ ఆవిడ్ని ఇక్కడికి పిలుచుకుని రానా?" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు శివరాం.

"మీరు ఎంతకీ వాళ్ళింటికి వెళ్ళడం లేదు. అప్పుడే మన వీధి పిల్లలకు అయిదారు ఛాప్టర్స్ చెప్పేశారు ఆవిడ. నేను స్కూల్లో

కూడా చాలా వెనకబడి వున్నాను" అన్నాడు నందూ దీనంగా.

"మీ క్లాసు టీచర్ మీకు అర్థమయ్యేలా చెప్పరా?"

"ఆయన ఏం చెప్పినా మాకు అర్థంకాదు. మా క్లాసు పిల్లలందరూ ప్రయివేట్లు పెట్టించుకున్నారు."

"ప్రయివేట్‌గా చదువుకోవాలంటే ఇంక స్కూళ్ళకు వెళ్ళి ప్రయోజనం ఏమిటి? లెక్కల మాష్టారు ఒక్కరేనా, మిగిలిన సబ్జెక్టులవాళ్ళు కూడా అంతేనా?"

"అందరూ అంతే నాన్నా! వాళ్ళేమి చెబుతున్నారో మాకు అర్థం అవటం లేదు. ఇంటి దగ్గర పెద్దవాళ్ళు ఎవరయిన చెబితే తెలియని పాఠాలు మాకు తెలుస్తాయి. చెప్పేవాళ్ళు లేక పోతే ట్యూషను పెట్టుకుంటున్నారు" శివరాం ఎప్పుడో ఇరవయి నాలుగేళ్ళ క్రితం చదువుకున్నాడు. ఆ రోజుల్లో మాస్టరు చెప్పే పాఠాలు బాగానే అర్థం అయ్యేవి. ఇంకా యస్సెల్సీ పరీక్షల ముందు డౌట్స్ ఏమన్నా వుంటే ఇంటికి రమ్మనమనేవారు ఎంతో శ్రద్ధగా. తన క్లాసులో ప్రతి విద్యార్థీ ప్యాసు కావాలన్న తపన ఆ రోజుల్లో వుపాధ్యాయులకు వుండేది. ఇప్పుడు హైస్కూల్ నించి కాలేజీ చదువు వరకూ అంతా ట్యూషన్ మీదే చదువుకోవలసి వస్తుంది. అటు స్కూల్ ఫీజులు, పుస్తకాలు, ఇటు ట్యూషన్లు వీటితో నలుగురు పిల్లలు చదువుకోవలసినవారు వుంటే ఆ ఇల్లు ఇంక దివాలా పరిస్థితిలో వుంటుంది.

"నా మాట వినండి. పాతిక రూపాయలు పోతే పోయినాయి. ఆ ఖర్చు ఇంకో దానిలో తగ్గించుకోవచ్చును. ఆవిడ వద్ద ట్యూషన్‌కి పెట్టించండి. వీడివల్లేనా బేబీ కూడా నాలుగు అక్షరమ్ముక్కలు వంట పట్టించుకుంటుంది" అంది బెల్లింపుగా.

"సర్లే! రేపు మాట్లాడతాను. ఇద్దరికీ పాతిక రూపాయలకు చెప్పరేమో" అన్నాడు.

"ఎందుకు చెప్పదూ! ఎదురింటి వారింట్లో ముగ్గురు పిల్లలకూ ముప్పయ్ రూపాయలకే చెప్పించుతున్నారు. ఇరవయికి అడిగి చూడండి" అంది.

"ఎదురింట్లో రామూ, తమ్ముడు మూడో క్లాసు చదువుతున్నాడు. అందుకని తక్కువ జీతం పుచ్చుకుంటున్నారు వాళ్ళవద్ద" అంది బేబి.

"సర్లే. రేపు వెళ్ళుతాను. అయినా ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుకోవాలి శ్రద్ధగా. ఇంటికి రాగానే ఏం మింగుదామా, ఎక్కడ గెంతులు వేద్దామా అనే తప్ప చదువుకుందుకు ముందుకు రాదు బుద్ధి" అన్నాడు విసుగ్గా. పిల్లలు మూతి ముడుచుకు కూర్చున్నారు.

"వాళ్ళు చెప్పందే వీళ్ళేం చదువుతారు? వుత్తికి వుత్తినే రాముడు దేవుడు అంటూ పదిసార్లు వల్లెవేస్తే సరిపోతుందా? రాముడు దేవుడు ఎందుకయినాడో, దైవత్వం పొందటానికి ఎన్ని మంచి పనులు చేయాలో? అసలు మంచి అంటే, చెడ్డ అంటే ఏమిటో ఇన్ని వివరణలు ఆ పసి మనస్సులకు హత్తుకు పోయేలా చెప్పాలి. అంత ఓపిక నేటి ఉపాధ్యాయుల కున్నదా? రాముడు దేవుడు. అప్ప చెప్పండిరా అంటారు. అప్పచెబుతుంటారు. దేవుడంటే ఎవరు? రాముడు. రాముడు ఎటువంటివాడు? దేవుడులాంటివాడు. అంతే తప్ప దేవుడు అనేదానికి ఎటువంటి విలువ వుందో వాళ్ళకు తెలియదు" అంది సత్యవతి.

"ఇలా పురాణ ప్రసంగాలు చేస్తూ పోతూ వుంటే ఈ పిల్లలకు ఇంక మామూలు చదువు ఎప్పుడు చెబుతారు? జీవితంలో ఎదుగుతున్న కొద్దీ మనుష్యులు వాళ్ళంతట వాళ్ళే నేర్చుకుంటారు" అన్నాడు శివరాం.


ఈమధ్య సత్యవతిని గమనిస్తూంటే శివరాం ఆశ్చర్యపోతున్నాడు మనస్సులోనే. తాను పెళ్ళి చూపులకు వెళ్ళిన రోజు గుర్తుకు వచ్చింది శివరాంకు. సత్యవతి పుట్టినిల్లు చాల్లా పల్లెటూరు. సత్యవతి మేనమామ ఇంటిలో నుండి ఫిఫ్తుఫారం చదువుకుంది. శివరాంకు సత్యవతి చాలా నచ్చింది. సత్యవతి ముఖం చాలా ప్రశాంతంగా వుంది. పెద్దలు చెప్పినట్లు వినే ఒదిక సత్యవతిలో కనిపించింది. మారు మాట చెప్పకుండా ఒప్పుకున్నాడు. ఎంతో భయస్తురాలు అనుకున్నాడు. అలాంటిది ఇప్పుడు ఎంతో చలాకీతనం వచ్చింది. అటు పిల్లలని ఇటు తనని తన గ్రిప్‌లో వుంచుకోవాలనే తాపత్రయం హెచ్చింది. ఇల్లంతా ఆధునికమయిన పద్ధతిలో అలంకరించుకోవాలనే వుత్సాహం వచ్చింది. మారుమూల పల్లెటూళ్ళల్లో చిన్న చదువులు చదువుకున్నా బస్తీ వాతావరణంలో ఉద్యోగస్తుడయిన భర్తతో, జీవితం ప్రారంభించేసరికి కొత్త కొత్త అభిరుచులన్నీ పుట్టుకు వస్తాయి కాబోల్ను. నిమ్మకు నీరెత్తినట్లుండే పల్లెటూరిలో పుట్టి పెరిగినవారు, బస్తీ కాపురాల్లోకి వస్తే అన్నిటికీ అబగా వెంపరలాడుతారు. సత్యవతీ అంతే. కొత్తలో భర్త తనని ఇటూ అటూ త్రిప్పడం లేదని మనస్సులో కించపడేది. క్రమంగా ఇరుగు పొరుగుతో మాటా మంతీ కలిశాక ఈ నగరంలో చూసి నేర్చుకోవాలసినవి చాలావున్నాయి అని తెలుసుకుంది. మాట పలుకుబడి కూడా మార్చేసుకుంది. అన్నిటికీ ఇరుగు పొరుగు వారితో పోటీ పడుతోంది. ఈ మార్పు మంచిదయినా, చూసి నేర్చుకోవటం మంచిదయినా ఆర్థికస్థితి ఆలోచించే స్వభావం కూడా వుండాలి ఆడవాళ్ళల్లో. సత్యవతికి ఆ స్వభావం కూడా వుంది. ఎంతో జాగ్రత్తగా పొదుపుగా చేసుకు వస్తోంది. పైకి నాగరీకంగా డాబుగా వుంటుంది అది శివరాంకూ సంతోషంగానే వుంటోంది. కాని వచ్చిన చిక్కేమిటంటే ప్రతి చిన్న విషయాన్ని చర్చనీయాంశంగా చేస్తుంది. ఆ స్పీచ్ వింటోంటే శివరాంకు తనేదో చాలా చిన్నవాడినసీ అమాయకుడ్ననీ ఏమీ ప్రపంచజ్ఞానం లేనివాడిననీ అన్పించుతుంది. అప్పుడు సత్యవతి తన ఊహా పరిధి దాటి చాలా విస్తృతంగా పెరిగిపోయింది అని భయం వేస్తుంది. వారం పది రోజులుగా సతాయిస్తోంటే తప్పనిసరి అయి మర్నాడు భోజనం చేసేప్పుడు అన్నాడు.

"ఇవ్వాళ వెళతాను. సరేకాని ఎంతయితే ఒప్పుకోమంటావు?"

"ఇద్దరూ ఒకటే క్లాస్ కదా ఇరవయి రూపాయలు యిస్తే చాలుననుకుంటాను."

"మరీ అంత తక్కువా? ఏమన్నా అనుకోదూ?"

"అనుకోవటానికేం. పేటవాళ్ళంతా ఒక్క పిల్లకి ఇదరు పిల్లలకు అని మాట్లాడుకొని నలుగురేసి పిల్లలని పంపుతున్నారు" అంది.



శివరాం సైకిల్ స్టాండువేసి మెట్లు ఎక్కి-

వస్తోంటే లోపల హాలులోంచి చూసింది సులక్షణ. ఆ ఇంటికి చాలా ఎత్తయిన అరుగు లున్నాయి. పెంకుటిల్లే అయినా విశాలంగా వుంటుంది. ఇల్లు చాలా నిశ్శబ్దంగా వుంది. హాలులో అయిదారు పేము కుర్చీల మధ్యన రౌండుగా అల్లిన బల్ల వుంది. శివరాం హాలులోకి వచ్చేడు. ఏమని పిలవాలో తెలియలేదు. తలుపులు తీసే వున్నాయి. కాని హాలులోకి వున్న నాలుగు గుమ్మాలకు మందపాటి కర్టెన్స్ కట్టివుండటంచేత కనుచీకటిగా వున్నట్లు వుంది. తీసి వున్న తలుపును టక టక మని పించేడు. సులక్షణకు శివరాం వెలుగులోంచి వచ్చేడు కనుక కనిపించేడు. హాలులో నించున్న సులక్షణ అతనికి కనిపించలేదు.

"లోపలికి రావచ్చు" అంటూ పెరటి వైపు వున్న కర్టన్‌ని తొలగించింది. హాలులోకి చిరు వెలుగు వచ్చింది. శివరాం హాలులోకి వచ్చేడు. సులక్షణ భుజాలమీంచి చెంగు ముందుకు తీసుకుంటూ

"కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది.

"మీరూ కూర్చోండి" అంటూ ఆమె ముఖంకేసి చూసి క్షణంలో సగం ఊపిరి అందనట్లు గిజగిజలాడి —

"మీరు.... మీరు...." అన్నాడు.

"అవును నేనే! ఏం?" అంది సులక్షణ. ముఖంలో అదే ఠీవి, అదే పొగరు, ధీమా.

"ఇక్కడ ఇలా?"

"అవును. ఏం?" కంఠంలో దర్పం, ముఖంలో మందార రంగు.

"ఎందుకంత కోపం? అసలు జరిగిందేమిటంటే...." అంటూ నీళ్ళు నమిలాడు శివరాం.

"జరిగిన కథ నా కనవసరం. నాకు గతంతో నిమిత్తంలేదు. నువ్వెందుకు యిక్కడికి, నా ఇంటికి వచ్చినట్లు?" అంది సులక్షణ. శివరాం బిక్కచచ్చిపోయేడు.

ఆమెవంక కళ్ళు విప్పుకు చూస్తూ వుండిపోయేడు. సులక్షణకా చూపు చూస్తూంటే పలక బద్దలు కొట్టుకొని మాష్టారుచేత దెబ్బలు తినటానికి సిద్ధమయిన పిల్లవాడు గుర్తుకు వచ్చేడు. మధ్యాహ్న సూర్యుడి తీక్షణత మబ్బుల సాయంకాలం తగ్గించినట్లు అతని అమాయకపు ముఖం, ఆమె కోపం యొక్క ఉద్రిక్తతను చాలమటుకు తగ్గించేసింది. అయినా బింకం సడలకుండా,

"ఏమిటి కథ ఎందుకు వచ్చేవు." అంది మళ్ళీ.

"ఏంలేదు పిల్లలు. పిల్లలు...."

"హుం. ఇంకా పిల్లలు కూడా కావలని వచ్చేరా! నీకు అసలు బుద్ధీ జ్ఞానం వుందా! ద్విపాదపశువి!"

"అదికాదు. అదికాదు. నువ్వు పొరపాటు పడుతున్నావు. నా పిల్లలు ట్యూషన్ చెప్పించుకోవాలంటున్నారు. నువ్వు బాగా చెప్తున్నావు అని అందరూ అంటున్నారు. అంచేత నీ చేత మా పిల్లలకి ట్యూషన్ చెప్పించాలని మా ఆవిడ తాపత్రయ పడుతోంది."

"ఏం చదువుతున్నారు!"

"ఏడవ తరగతి."

"నేనెవరినో వాళ్ళకి తెలియదా?"

"అసలు నువ్వెక్కడున్నావో నాకు తెలిస్తేగా! నీ కథ యింట్లో చెప్పుకుందికి! అసలు ఈ వూరు ఎందుకు వచ్చేవు?"

"అవును! ఈ వూరు ఎందుకు వచ్చేను? వచ్చినా, నా ప్రారబ్ధంకొద్దీ ఈ పేటలోనే ఈ వీధిలోనే యిల్లు దొరకాలా?"

"నేను ఈ వూరు బదిలీ అయి వచ్చి మూడేళ్ళయిపోతోంది. ఇంక రేపో మాపో మేమూ తట్టాబుట్టా సర్దేయవలసి వస్తుంది."

"అయితే నేను భయపడి పారిపోవలసిన అవసరం లేదన్న మాట."

"నీకు భయమా?" అన్నాడు శివరాం.

"అవును. నాకు భయంలేదు. సిగ్గులేదు. బాధలేదు. అవమానంలేదు. నేను మొండిని. జగమొండిని."

"అబ్బబ్బ ఏమిటా దండకం!"

"దండకమా! నువ్విచ్చిన సర్టిఫికేట్సు. దానివల్లే నేనిన్ని రోజులూ, ఏ వూళ్ళోవున్నా ఆ వూళ్ళో మరువలేని మహారాణిలా గడిపేశాను. నువ్విచ్చిన ఆ సర్టిఫికేట్లే నా కీనాడు



అండగా వున్నాయి."

"అదికాదు. నా మాట వినిపించుకో! నువ్విన్ని రోజులూ ఎక్కడెక్కడ వున్నావు! నీకు వంటరితనం భయమనిపించలేదూ! పది మందిలో పుట్టి పెరిగిన దానివి! నీకు ఏకాకితనం విసుగనిపించలేదూ! పోనీ నాన్నగారికి అమ్మగారికీ నీ మీది కోపం అనుకోవచ్చును. అక్కయ్యలున్నారు. నేను వున్నాను. అన్నయ్యలున్నారు. ఎవరికయినా నీ క్షేమం ఒక్కముక్క వ్రాసి పడెయొచ్చుగా!"

"ఎందుకు వ్రాయాలి! ఇంట్లో అందరూ నాకు బద్ధశత్రువులే అయిపోయేరు. నీవు మటుకు ఏం చేసావు! నాన్నగారికి నా మీద కోపం రావాలని వున్నవీ లేనివీ కల్పించి చెప్పావు. 'రమణ'చేత ప్రేమలేఖలు వ్రాయించేవు. నాకు అన్నిట్లోనూ ఫస్టు మార్కులు వస్తున్నాయని జెలసీతో కళ్ళు కుట్టుకున్నావు. కాలేజీకి వెళ్ళితే రమణగాడి ప్రేమగోల. ఇంటికి వస్తే అమ్మా నాన్న ఏదో పరువు ప్రతిష్ఠలు పీకి పందిరేసినట్లు కాకిగోల. వళ్ళు మండింది. మీరు మగవాళ్ళు అవవచ్చును. ఏం చేస్తున్నారు? డిగ్రీ రాగానే ఎక్కడికో అక్కడికి పొట్ట చేత్తో పట్టుకుని పోతున్నారా లేదా? అల్లాగే నేనూ నా దోవ నేను వెదుక్కుందుకు పోయేను. బి.ఏ. ప్యాసయినప్పట్నించీ చచ్చు పుచ్చు సంబంధాలు వెతకటం మొదలెట్టారు" సులక్షణ ఆగింది.

"నీకు నచ్చకపోతే నచ్చలేదు అని చెప్పవచ్చును. అంతేకాని అజపజా తెలుపకుండా పారిపోవటమేనా!"

"ఎంతమంది మగపిల్లలు పారిపోవడం లేదూ! అల్లాగే నాకూ చికాకు వేసుకువచ్చింది. వెళ్ళిపోయేను."

"రమణగాడు ఏమయ్యాడు!" అన్నాడు శివరాం.

"ఏమో!"

"మీరిద్దరూ కలిసి వెళ్ళిపోలేదా!"

"మళ్ళీ ఇదొక అభాండమా!"

"మాకు తెలీదు నిజంగా. అభాండంకాదు. రమణగాడు నీ వెంట పడేవాడు కదా! మీ రిద్దరూ కలిసే వెళ్ళిపోయేరని అంతా అనుకుంటున్నారు."

"అంటే అంతా నమ్మేసేరన్నమాట! రమణగాడు బి. ఏ. మూడుసార్లు ఫెయిలయినాడు. వాళ్ళ ఆస్తిలో వీడికి వచ్చేది పది పైసల వాటా కూడా వుండదు. బి. ఏ. చదువుకునే వాడికి ప్రేమేమిటి నా బొంద! తల్లిదండ్రులు చక్కగా చదువుకోరా ఒక గుమాస్తా ఉద్యోగమయినా దొరకబుచ్చుకుంటే నిన్ను కట్టుకున్న

దానికయినా గంజినీళ్ళయినా పోస్తావు" అని పిల్లలని చదువుకుందుకు పంపిస్తే ఒకత్తి చలాకీగా వుందనీ, ఇంకొకత్తి బాగా పాడుతుందనీ, ఇంకొకత్తి బాగా చదువుకుంటుందనీ వెంటపడి వెర్రెత్తిపోవటమేనా? వాడు నన్నేమి పోషించగలడని వాడితో వెళ్ళిపోతానను కున్నారు? అంతకన్నా దద్దమ్మలని నాలుగు వేలు అయిదువేలు కట్నాలు ఇస్తామనీ నన్ను పరీక్షించుకోమని అమ్మనాన్నలు కాళ్ళా వేళ్ళా పడేవారు కదా?"

"ఏమో నువ్వెళ్ళిపోయినప్పటినించీ రమణగాడు మళ్ళీ మన వూళ్ళో కనబడలేదు. అంచేత...."

"ఇద్దరం కలిసి వెళ్ళిపోయేము అనుకున్నారా? భలేవారే!" అంది సులక్షణ. శివరాం ఏదో అడుగుదామనుకుని అడగలేకపోతున్నాడు. అతని సందేహం సులక్షణ గమనించింది. గడుసుగా నవ్వింది.

"కాఫీ కలుపుకుని వస్తానుండు. ఇంతకీ నీ పిల్లలకి నేను ప్రయివేట్ చెప్పితే నాలాగే తయారయిపోతాడేమో, దేరా మేకుల్లాగ!"

"ఛ ఛ! ఈ వాడలో అందరూ నిన్ను తెగ పొగడుతున్నారుట! మీ వదిన రోజూ కతపోరగ కతపోరగా ఇవ్వాళ నిన్ను కనుక్కుందామని వచ్చేను. ఇంతకీ ఇన్నాళ్ళూ నీవు మన కుటుంబంతో సంబంధం లేకుండానే వుండిపోయేవు. ఇకనయినా మనవాళ్ళతో రాకపోకలు జరుపకూడదా!" అన్నాడు ఆర్ద్రతగా. సులక్షణ కాఫీ కలిపి తెచ్చింది!

"ఇంటితో సంబంధం నా కెందుకు! మీ అందరి దృష్టిలో నేను లేచిపోయిన మనిషి నాయె. మరీ పెళ్ళి చూపుల మిషతో అడ్డమైన గాడిదలు వేసే కుంటిగుర్రం ప్రశ్నకు జవాబులు చెబుతూ ఎప్పుడు పెళ్ళి అయి ఒక నాథుడి అండ దొరకబుచ్చుకుంటానా అనే ఆశతో పాతికేళ్ళు ముప్ఫయ్ ఏళ్ళు అమ్మానాన్న చాటున ఆకుమాటున పిందెల్లె కాగిపోతూ పుడుకుపిందల్లె రాలిపోవటం కంటె నాదయిన ఒక జీవితం జీవింపగలనా లేదా అనిపించింది. వీధిలోకి వెళితే అర్భకాకారపు రమణగాడి ప్రేమగొడవ. ఇంట్లో ఎప్పటికీ తెమలని పెళ్ళి సంబంధాల వేటల దప్పుల మోత! ఏమి జీవితం అందులో థ్రిల్ ఏమీ లేదు! అన్పించింది. మీ రిచ్చిన మొండి ధైర్యంతోనే నేను సుఖంగా బ్రతుకుతున్నాను. మళ్ళీ చుట్టాలు, బంధువులు, రాకలు పోకలు నా కెందుకూ!" అంది సులక్షణ.


"అమ్మానాన్నలకి నువ్విలా వున్నావని వ్రాయొద్దా! వాళ్ళు నీ వెక్కడో రమణ్ని పెళ్ళి చేసుకుని సుఖంగా సంసారం చేసుకుంటున్నావని అనుకుంటున్నారు. మన కులాలు ఏకం కాకపోయినా ఇంత ఇప్పుడు పదిహేనేళ్ళ తర్వాత వాళ్ళకు పట్టింపులు ఏమీ వుండవు."

"వాళ్ళకి వున్నా లేకపోయినా నాకు వుండవా! మళ్ళీ నన్ను ఒక యింటిదాన్ని చేయాలని ఈ పెద్దకాలంలో ముసలాళ్ళు తాపత్రయ పడతారు. ఎందుకు అనవసరం గొడవ?"

"అనవసరం గొడవ ఏమిటి! తల్లితండ్రులు పిల్లల బాగుకోసం తాపత్రయ పడటం సర్వ సహజం. ఆవేళ అన్నయ్య రెండో పెళ్ళి సంబంధం చూసాడనే కదా నీకు కోపం వచ్చిందీ! అసలు ఏం జరిగిందంటే...."

"నాకంతా తెలుసు. పెద్దన్నయ్య భార్యకు ఆయన చెప్పాడట. చదువుకున్న అమ్మాయి అయితే చాలును. కట్నం అక్కరలేదని అన్నయ్య ఉబ్బితబ్బిబ్బయిపోతూ చెప్పాడు. మొదటి భార్యను అస్తమానూ అనుమానంతో తిట్టి కొట్టి చంపేవాడుట. ఇప్పుడు చదువుకున్న భార్య కావాలని గెంతులు గెంతుతూంటే చుట్టూ భక్తులంతా చేరి భజన చేస్తున్నారుట. అదేదో నా మెరిట్‌కి వచ్చిన సంబంధం అనుకోవాలని అన్నయ్యా వదినా నా చెవిలో ఇల్లు కట్టి చెప్పటం మొదలుపెట్టారు.

బి.ఎ. ప్యాసయి మూడేళ్ళు ఇంట్లో కూర్చున్నాను. ఏదోలా పెళ్ళిచేసి నా బాధ్యత వదిలించుకోవాలనే వాళ్ళ మనస్తత్వం నాకు నచ్చలేదు. మగవాళ్ళకి చదువులు చెప్పించి వున్న ఆస్తులు పంచి ఎలా చూస్తున్నారో అల్లానే ఆడపిల్లలకీ చదువులు చెప్పించి తాము



సంపాదించినదేదో అన్న తమ్ముళ్ళలతో సమానంగా ఇచ్చేస్తే ఇంక జ్ఞానం వున్న పిల్లలు ఎవళ్ళకు నచ్చిన భాగస్వాములని వాళ్ళు ఎన్నుకుంటారు. మగపిల్లలకయితే మా వాడికి నచ్చితే మాకు అభ్యంతరం లేదు పెళ్ళికి అంటారు. ఆడపిల్లలకయితే ఆ పిల్లకి నచ్చకపోయినా ఆ పెళ్ళికొడుకు దేవేంద్రుడు, మహేంద్రుడు అంటూ నచ్చచెప్పటం మొదలుపెడతారు. ఇప్పుడు నాకు వచ్చిన లోటేమిటి? మీ లాగే చదువుకున్నాను. ఉద్యోగం దొరకలేదు. ప్రయివేట్లు చెబుతున్నాను. ఒక వూరు బాగా నలిగి, జనం మధ్యలో నా గురించి ప్రశ్నార్థకాలు మొదలయ్యేసరికి ఉడాయించేస్తాను. మళ్ళీ కొత్తవూరు కొత్త ప్రజలు, కొత్తపిల్లలు. నా భవిష్యత్తుకు సరిపడా డబ్బు పోగుచేసుకున్నాను. మీరు నా కన్న ఎక్కువ సుఖంగా వున్నారా! ఎందుకు నా గురించి మీరంతా లేనిపోనివి వూహించుకుని బాధపడటం! చెల్లెలుకూడా కాని వాడితో లేచిపోయిందనే పుకారుతో, మీరు ఇంటిల్లిపాదీ ఈ పాటికి కుళ్ళి కృశించి పోయివుంటారు. లేచిపోకుండా మళ్ళీ అక్కడ కూడా ఒక మగవాడి అండ లేకుండా వంటరిగా జీవించుతుందంటే ఇంకా మీకు హృదయ విదారకంగా వుంటుంది. రమణగాడు విజయవాడలో ఒక మోటారు గారేజిలో పని చేస్తున్నాడు. భగ్నప్రేమకుడిలా కాకుండా వాడికి తగిన వాళ్ళ కులం అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. నలుగురు పిల్లలున్నారు. వాళ్ళ అమ్మాయికి ప్రైవేట్ చెప్పాను నేను అక్కడ వుండగా."

"రమణగాడు విజయవాడలో వున్నాడా!" అన్నాడు శివరాం.

"అవును. నేను అక్కడ ఆర్నెల్లు వున్నాను" అంది సులక్షణ.

"మరి నేను వస్తాను. పిల్లల్ని పంపనా!"

"పంపు. మరి వదినగారికేం చెబుతావు!"

"ఫీజు ఇరవయి రూపాయలని. అంతకంటే ఎక్కువ ఇవ్వద్దన్నది మీ వదిన."

"గట్టిదే! ఫీజుమాట కాదు. మరి నే నెవరని అడిగితే ఏమని చెబుతావు?"

"అడగదు."

"ఎందుకని."

"నాకు చెల్లెలున్నదని ఆమెకు తెలియదు. ఇంట్లో కూడా యెవ్వరూ నీ ప్రసక్తి యింత వరకూ తేలేదు."

"మంచిదే అయితే. రమణగాడి ధర్మమా అని పాపం మీ వాళ్ళందరి పరువు ప్రతిష్ఠలు అటక ఎక్కించేసాడన్న మాట. పోనీలే. అదీ ఒకందుకు మంచిదే."

"ఇప్పటికన్నా నిజం తెలిసిందిగా! సులక్షణా! మా యింటికి వచ్చెయ్యి, వదినతో అంతా చెబుతాను. అందరం కలిసే వుందాము."

"ఇదేమన్నా సినిమా కథా శివా! మా చెల్లెలు దొరికింది అంటే వదినలందరూ హారతులు పట్టటానికి? ఎప్పుడు వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది? ఎలా వెళ్ళింది? ఎవళ్ళతో వెళ్ళింది? ఇప్పుడెవరితో వుంటోంది? అంటూ సవాలక్ష ప్రశ్నలతో వాళ్ళ బుర్రలు వేడెక్కిపోతాయి. ఇంట్లో ఆడవాళ్ళ బుర్రలు వేడెక్కినాయంటే ఇంక ఆ ఇంటి వాతావరణం భోగిమంటవద్ద కూర్చున్నట్లే వుంటుంది. ఎందుకివంతా? నా బ్రతుకు నేను బ్రతుకుతున్నానుకదా! ఏమీ గాభరా పడకు" అంది సులక్షణ.

"నువ్వేమీ మారలేదే బాబూ!" అన్నాడు శివరాం.

"ఎందుకు మారాలి?" ఎదురు ప్రశ్న వేసింది.

"మా అందరి కొసం" అన్నాడు.

"ఒక్కదాని కోసం మీరంతా కించిత్తూ పట్టుదలలు సడలించుకోలేదు. మీ అందరి కోసం నేను ఒక త్తినీ నా వ్యక్తిత్వానికి నీళ్ళొదులుకోవాలా? లాభం లేదురా శివా! లాభం లేదు" అంది.

"పోనీలే" అంటూ వెళ్ళిపోయేడు శివరాం.

చెల్లెలు బాగా చదువుకుందని అందుకని తలబిరుసుని అనుకుని తను చదువుకోని అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. సత్యవతి మెల్లి మెల్లిగా చాపక్రింద నీరులాగ తననాక్రమించుకుని తనదే పైచేయి అన్పించుకుంటోంది. ఎలాగయినా ఈ రోజుల్లో ఆడవాళ్ళు చాలా మారారు. అమ్మా వదినల కాలంలోలా కాదు అనుకుంటూ నిట్టూర్చాడు శివరాం.

"రేపట్నించీ పంపమంది పిల్లల్ని." అన్నాడు ఇంటికి వచ్చి.

"మరీ రెండు గంటలు కూర్చుండిపోయేరేమిటండీ అక్కడ? మీకు తెలుసున్నావిడా?" అంది సత్యవతి.

గతుక్కుమన్నాడు శివరాం. తను వాళ్ళింటికి వెళ్ళి ఎంతసేపున్నాడో నోటు చెసిందన్న మాట! ఏమి ఆడవాళ్ళు?

"అవును. ఆవిడ మా స్నేహితుడి చెల్లెలేనూ" అన్నాడు.

"పాపం ఒంటరిదిటా! పెళ్ళి పేరంటం కాలేదా? మొగుడొదిలేశాడా?" అంది.

"నేనేమీ అడగలేదు. లోకాభిరామాయణం మాట్లాడుకున్నాం అంతే!" అంటూ మళ్ళీ బయటికి వెళ్ళిపోయేడు.

ఆమె వచ్చి నిండా ఒక నెల కాలేదు. అప్పుడే సులక్షణ గురించి ప్రశ్నార్థకాలు మొదలయ్యాయి. ఏమయినా సులక్షణని వంటరిగా వదలకూడదు. దూరంనించయినా గమనించుతూ వుండాలి. అదే నిర్ణయం తీసుకున్నాడు శివరాం. □

'వంశీ - బర్కిలీ' పోటీలో

బహుమతులు పొందిన కవితలు

తెల్లిమబ్బు

నిర్మలాకాశంలో
ఓ తెల్లని మబ్బుతునక
నిశ్చలంగా సాగిపోతున్న దృశ్యం
నా కళ్ళకెంతో అందంగా
ఇంకెంతో మనోహరంగా వుంది
రాగ, ద్వేషాల కతీతంగా
ఘోర పాపాలకు సుదూరంగా
సాగిపోతున్నదనే దివ్యానుభూతి
నా నరనరాల్లోంచి ప్రాకుతోంది
మంచికి రూపంలా
మమతకు దీపంలా వున్న
ఆ మబ్బును చూచి
నేను నేర్చుకోవాల్సిందెంతో వుందనిపించింది
అందుకే ఒక్కసారి
నా మనసు అద్దంలోకి
తొంగి చూశాను—
అద్దం నిండా ఒకటే మరకలు
అవి నేను చేసిన తప్పులకు కాబోలుప్రతిరూపాలు
నిశ్చయించుకున్నాను—
మనసుకు పట్టిన మరకలు తొలగించుకోవాలని
నీలి అంచుపై తేలే మబ్బులా సాగాలని
అందుకే పవిత్ర జలముకై వెదుకుతున్నాను
ఆ నిరీక్షణలో—
నా కళ్ళల్లో నిలిచిన నీళ్ళు
నాలో వెలిగించాయి కోటి శాంతి దివ్వెలు

—కుమారి కాద సరోజారాణి

ఆవేదన

నందనంలా మురిపిస్తుందనుకున్న జీవితం
నరకంలా మారిపోతున్నప్పుడు,
ఆకాశమంతటి అంతరంగం
అంతకంతకూ సంకుచితమవుతున్నప్పుడు,
మమతల మల్లెలు విరియవలసినచోట
మాత్సర్యాలు కళ్ళు తెరుస్తున్నడు,
పున్నమిలా నవ్వలేను
పువ్వులు వెదజల్లలేను.

అంతరంగంలో ఎగిసిపడే కోరికలు
కడలి కెరటాల్లా కరిగిపోతున్నప్పుడు,
పరిమళిస్తుందనుకున్న జీవనసుమం
మొగ్గలోనే త్రుంచి వేయబడినప్పుడు,
అందలం ఎక్కిస్తుందనుకున్న భవిష్యత్తు
అగాథంలోకి త్రోసివేసినప్పుడు
వేకువను కనలేను
చీకటిలో మనలేను.

మోసాల అందమైన ఉచ్చుల్లో
మంచితనం చిక్కుపడిపోతున్నప్పుడు,
సమ్మెలూ సత్యాగ్రహాలతో నిండిన రాజకీయం
సామాన్యునికి శాపంలా పరిణమించినప్పుడు
వెలుగుపుంతకావలసిన విద్యార్థిలోకం
అతుకుల బొంతగా చితికిపోతున్నప్పుడు,
ఆశయాలు పండించలేను
ఆశీస్సులందించలేను.

నిశ్చింతగా విహరించే న్యాయము, స్వేచ్ఛ
గువ్వల్లా గూటిలోనే ఒదిగిపోతున్నప్పుడు,
అమృతం ఆశించిన చోట
హాలాహలం ఆవిర్భవిస్తున్నప్పుడు,
కవులనేవారి కవిత్వాలలో
కదిలించే శక్తి కరువైనప్పుడు
మనిషినని ఒప్పుకోలేను
కాదని తప్పుకోలేను.

కోటం రాజా (చిల్లర) భవానీదేవి

చీకటి ప్రసవించింది!

చీకటి
కటిక చీకటి
కరిలా
గోవర్ధన గిరిలా
టుక గగనంలా చీకటి
నెల తప్పిన అవివాహిత
అంతరంగంలా చీకటి!
తుమ్మెద రెక్కలు పరచిన
ఆకాశ పంచాంగంలా చీకటి!
అమావాస్య కౌగిట్లో నలిగిన
రాత్రి వేశ్య వదనంలా చీకటి!
మాడిన సింగాడే ఉదరంలా
మమత ఉడిగిన మిధునంలా
మృత్యుసదనంలా చీకటి!
అంతటా కటిక చీకటి!!
రాత్రంతా పురుటి నొప్పులతో
గగనతలంపై పొర్లాడిన
నిత్య గర్భిణి చీకటి ప్రసవించింది
విచిత్రం—
తూరుపు పొత్తిళ్ళలో
ఎర్రటి మగబిడ్డ!
అసలు పేరు సూర్యం
కలం పేరు శౌర్యం
చూస్తే - తెలుగువాడి తేజస్సు!!
అంతా భరతజాతి వర్చస్సు!!!

రఘుశ్రీ

మినీ కథ

ఇదేమిటి?

మల్లారెడ్డి, రత్నమాలా రంగారావు

సంతకాలు పెట్టడం పూర్తిచేసి, మెడలో దండవేస్తూ, సుశీల కళ్ళల్లోకి సూటిగా చూశాడు సుబ్రమణ్యం.

సుశీల కళ్ళు వాల్చుకుని క్రింది చూపులు చూస్తోంది.

చిపుక్కుమంది సుబ్రమణ్యానికి.

"ఈ నిముషం నుండీ మనిద్దరం ఒక్కటే. తోటలోని విడి విడి పూలన్నీ ఏరి ఒక్క దండలో బంధించినట్లు మనిద్దరం ఒకరి కొకరం అందమైన బందీలం. కష్టసుఖాలు ఇద్దరమూ కలిసే పంచుకుందాం...." ఇలా ఎన్నో బాసలు, వూహలు తన తొలిచూపులోనే అందిద్దామని కలలు కన్నాడతను పెళ్ళికాక ముందు. సర్ది చెప్పుకున్నాడు తనలో.

సిగ్గేమో. లేకపోతే తల్లి దండ్రులను విడిచి వచ్చేస్తున్నాననే బెంగేమో. అవును మరి. వివాహమనేది లాటరీలాంటిది. ఎన్నో మధురమైన వూహలతో, ఆశలతో పెళ్ళిళ్ళు చేసుకుని ఘోరంగా మోసపోయి జీవితాలు అంతం చేసుకున్నవాళ్ళు, ఛస్తూ బ్రతుకుతున్నవాళ్ళు ఎందరు లేరు?

స్త్రీలే కాదు. పురుషుడికీ వివాహం ఒక ముఖ్యమైన మలుపే. తన మట్టుకు తనకు ఈ పెళ్ళి పునర్జన్మే.

చిన్నప్పుడు జబ్బుచేసి ఫిట్స్ రావటం, దాని మీదట వళ్ళంతా మచ్చలుగా వచ్చి అవి స్థిరపడిపోవడంతో తన బ్రతుకు మీద తనకే ఆశ నశించిపోయింది. ఏదో మందులు వాడకం వలన ఫిట్స్ రావడం తగ్గిపోయినా అంటు వ్యాధి కాకపోయినా శరీరం మీద మచ్చలను ఏ డాక్టరూ తుడిచెయ్యలేకపోయాడు. ఏదో జీవితం వెళ్ళబుచ్చుకోవటానికి ఆధారం దొరికే తరుణంలో సంవత్సరం తేడాలో అమ్మ నాన్న తనని ఒంటరివాడిని చేసి వెళ్ళిపోతే, ఇక తానెవరి కోసం బ్రతకాలి అని కుమిలిపోయాడు? అందకోసం వివాహం చేసుకుందామంటే; శరీర ఆరోగ్య పరిస్థితి తెలిసి పిల్లనెవరిస్తారు? అనే బాధ. సిగ్గు!!

ఇటువంటి పరిస్థితిలో సుశీల అన్నయ్య కృష్ణతో పరిచయం కావటం, అతను తనంత తానుగా తన చెల్లెల్ని వివాహం చేసుకోమని కోరటం నిజంగా తన జీవితానికో పెద్ద మలుపే.

"అదేమిటి బావగారూ. ఇంతలోనే పరధ్యానంలో పడిపోయారు? పదండి ఇంటికి వెళదాం" కృష్ణ పరాచిక మాడాడు.

ఆ రోజు రాత్రి—

శోభనం గదిలో, స్వచ్ఛమైన మల్లెపువ్వులాంటి చీర, పాలగ్లాసుతో అడుగు పెట్టిన సుశీలలో అతనికి దైవత్వం కనిపించింది. తెలియని వుద్వేగం చోటు చేసుకుందతనిలో.

"సుశీలా!" ఆరాధనగా పిలిచాడతను.

"నువ్వు నా చీకటి జీవితానికి అంతులేని జ్యోతివి. జీవించటానికే అర్హతలేని నాకు నూతన జీవితం ప్రసాదించడానికి వచ్చిన ప్రేమస్వరూపిణివి నువ్వు. నీ సౌందర్యంతో నా జీవితానికో అర్థం చెప్పనున్న దేవతవు నువ్వు...." ఆవేశంగా చెప్పుకుపోతున్నాడతను.

"....నీ దగ్గర నా గురించి దాచి అబద్ధపు బ్రతుకు మొదలుపెట్టలేను....నాకున్న వ్యాధి సంగతి నీకు తెలుసుగా. ఇటువంటప్పుడు మనకి పుట్టబోయే పిల్లలకు కూడా ఇది సంక్రమించి వాళ్ళనుభవించబోయే బాధను చూసే శక్తిలేక, మనకి పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకున్నాను సుశీలా. పెళ్ళి అయిన దగ్గర నుండి మాతృత్వం ఎప్పుడెప్పుడా అని ప్రతి స్త్రీ కలలు కంటుందట....భవిష్యత్తును భరించలేక....నన్ను క్షమించవూ........

సుశీలకు మరి తరవాత మాటలు వినిపించలేదు. పక్కలో బాంబు పేలినట్లు వులిక్కిపడి నిటారుగా అయిపోయింది.

ప్రేమించి, నెల తప్పిందని తెలియగానే మోసంచేసి పరారయిపోయాడు మోహన్. చావలేక, మరో గత్యంతరం లేక, తన కడుపులోని బిడ్డకో తండ్రి కావాలని ఈ పెళ్ళి చేసుకుంటే, ఇదేమిటి? □

సీరియల్



సినిమా హాల్లోనే రాజేంద్రకి తలపోటు ప్రారంభమయింది. ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు.

ఇంటికి వస్తూనే అతను భోజనం కూడా చేయకుండా పడుకున్నాడు. కుసుమకి కోపం వచ్చింది. విసుక్కుంది కూడా. "చక్కగా యిన్నాళ్ళకి చూసేనని ఆనందంలేదూ,, ఏంలేదు. అయినా నేను నేను చాలా సంతోషంగా వున్నప్పుడు ఏదో ఒక అపశృతి."

రాజేంద్ర ఏం మాట్లాడలేదు. కుసుమ కూడా కోపం వచ్చి భోజనం చేయలేదు.

కుసుమతో అన్నాడు శర్మ నెమ్మదిగా "నేను తెల్లారగట్ల వూరు వెళ్తా పిన్నీ! నువ్వు నిద్రలో వుంటావు—లేపను."

"తెల్లారగట్లా!"

"నాలుగు గంటలకి—కారులో వెళ్తున్నాం. మీరు వెళ్ళాక అతను వచ్చి చెప్పాడు. మళ్ళీ ఎల్లుండి సాయంత్రానికి వచ్చేస్తాం" అన్నాడు.

"సన్నూ. లేపు కాఫీ కాచిస్తాను" అంది కుసుమ.

"ఆ! కాఫీకేమిటి! నువ్వలాంటివేమీ పెట్టుకోకు" అన్నాడు.

కుసుమ వినలేదు.

తెల్లారగట్ల లేచి శర్మకి కాఫీ కాచి యిచ్చింది.

"నువ్వే యెదురు రా పిన్నీ!" అన్నాడు శర్మ.

కుసుమ సంతోషంగా యెదురు వచ్చింది.

"వస్తా పిన్నీ!" అన్నాడు.

"క్షేమంగా వెళ్ళి లాభంగా రా!" అంది నవ్వుతూ.

"ఇదంతా నీ చలవే" అంటూ మరోసారి చెప్పి సాగిపోయాడు శర్మ.

కుసుమకి చాలా సంతోషంగా వుంది. శర్మ తన దగ్గరకి వచ్చి ఇంతవాడయాడు. తన వాళ్ళలో తనకెంత పేరు? అందులోనూ వాడి అభివృద్ధికి తనే డబ్బు సర్దుబాటు చేసింది! ఇదంతా ఆయనకి ఒక్కసారి చెప్పేస్తే! ఉహూ! వాడు అర్ధలక్షితో వచ్చేకా అప్పుడు చెప్పాలి.

రాత్రి కోపం మర్చిపోయింది కుసుమ! శర్మ గురించిన ఆలోచనలతో ఆవిడ మనసు సంతోషంగా వుంది.

రాజేంద్ర స్నానంచేసి—రోజూకన్న తొందరగానే తయారయాడు.

ఇంకా తలపోటు తగ్గలేదని టిఫిను తీసుకోలేదు. మరోసారి కాఫీ మాత్రం తీసుకుని, భార్యని డబ్బు తీసిమ్మన్నాడు.

పిల్లలకి టిఫిను తినిపిస్తున్న కుసుమ "వస్తున్నా" అందేకాని రాలేదు.

మరోసారి భార్యని పిలిచాడు. కుసుమ "వస్తున్నా" అంది మళ్ళా. రాజేంద్ర లేచివెళ్ళి బీరువా తెరిచాడు—

లాకరు తెరిచాడు—

ఖంగారుగా అటూ, ఇటూ వెతికాడు—శూన్యం.

"కుసుమా!" గావుకేక పెట్టేడు. అతని ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది.


కుసుమ ఖంగారుగా పరుగెత్తుకొచ్చింది. భర్త వాలకం చూసి, ఖంగారుగా "ఏమిటి—ఏమయింది?" అంది.

"డబ్బు! డబ్బు ఏదీ?"

"లాకర్‌లో మీరే పెట్టేరుగా!"

"అదే—లేదు! నువ్వేక్కడన్నా పెట్టావా?" కుసుమ యెక్కడన్నా పెట్టివుంటుందనే ఆశ మినుకు మినుకుమంటుండగా అన్నాడు. అతని మాట నూతిలోంచి వచ్చినట్టుగా వుంది.

"బాగుంది. నే నెందుకు తీస్తాను? మీరేగా పెట్టేరు?"



"ఏమిటి, నువు తీయలేదూ?...." అతని కళ్ళకి అన్నీ వచ్చవచ్చగా కనిపించసాగాయి. ఎలాగో రెండడుగులు వేసి మంచంమీద కూలబడ్డాడు.

అతని ఖంగారు అర్ధంలేనిదిగా అనిపించింది కుసుమకి. "ఏమంత ఖంగారు. అక్కడ పెట్టింది ఏమవుతుంది!" అంటూ తను చూసింది. బాగ్ లేదు.

"బాగ్ యెక్కడ పెట్టారు?" అని అడిగింది.

"అదేగా లేంది" అన్నాడు రాజేంద్ర లేచి విలబడుతూ. అతని కళ్ళు యెర్రగా అయినాయి.

"బాగ్ పళంగానే పెట్టేరా!" కుసుమకి నీరసం వచ్చేసింది.

"నీ ఎదురుగుండానేగా పెట్టింది? శర్మ ఏడీ? ఇలా పిలువు."

"వాడెందుకూ?"

"ముందు పిలువు" అరిచాడు రాజేంద్ర.

"వాడు నాలుగు గంటలకు వూరెళ్ళాడు...."

"వూరా? ఏ వూరు?" అతని గుప్పెళ్ళు బిగుసుకున్నాయి. అదివరకు డబ్బు—గ్లాసులూ వగైరా అతని కళ్ళముందు మెదిలి వాటి అర్ధాలు ఒక్కసారిగా తెలిసినట్టయింది.

శర్మని అనుమానించి అవమానించినట్లు గ్రహించి కుసుమ మనసు ఉడికిపోయింది. రాత్రనక పగలనక వాడంత కృషి చేస్తోంటే పైకి రావాలని—కుసుమ డ్రాయరు సొరుగూ అవీ వెతుకుతూనే జవాబిచ్చింది "వాడు నిన్ననే చెప్పేడు వూరు వెళ్తానని—మీ అనుమానం వాడి మీదకి పోయినట్టుంది. వాడు...."

కుసుమ మాటలు పూర్తికాకుండానే రాజేంద్ర కుసుమ జుట్టు పట్టుకుని వంగదీసి ఈ చెంపా ఆ చెంపా చెళ్ళుమనిపించేడు.

అనుకోని ఈ పరిణామానికి దిమ్మెరపోయింది కుసుమ. ఎప్పుడూ పల్లెత్తుమాటనని రాజేంద్ర అలా కొట్టడం—డబ్బులేదు—శర్మ వూరెళ్ళటం—రెప్పవేయడం మర్చిపోయినదానిలా గుడ్లప్పగించి రాజేంద్రకేసి చూస్తూ అలాగే వుండిపోయింది.

అంత కోపంలోనూ—ఆవేశంలోనూ తను చేసిన పనికి కొద్దిగా వెనక్కి తగ్గి—వెంటనే అక్కడనించి ఇవతలికి వచ్చేశాడు రాజేంద్ర.

* * *

మీరా మనసు చిత్ర విచిత్రమైన భావాలతో వూగిసలాడుతోంది.

"అరుణ వస్తోంది" అరుణ వస్తోందంటే అనిర్వచనీయమైన ఆనందం—మరోవక్క ఏదో భయం. అరుణ వస్తే తనిక్కడ మరీ బందీగా అవుతుందేమో!....తనిక్కడ వున్నట్టు అరుణకి తెలియదు కాబోలు. తెలిస్తే రెక్కలు కట్టుకుని వాలదూ! అది సాధ్యం కాకపోతే వుత్తరమన్నా రాసేది. హఠాత్తుగా తన్నిక్కడ చూసి అరుణ ఏమంటుంది....

క్రితం రోజే శాంతమ్మగారు తొందరగా రమ్మని చెప్పింది. మీరా తొందరగానే వచ్చింది. గేటుదాటి లోపలకి అడుగుపెట్టేసరికి శేఖరం కనిపించేడు.

"అరుణ రాలేదా? లేక ఏ టాక్సీలోనన్నా వచ్చేరా!" అనుకుంటూ లోపలికెళ్ళింది ఇటూ, అటూ చూస్తూ. ఎందుకో గుండెలు దడదడలాడాయి.

తడబడే అడుగులతో వంటగదిలోకి వచ్చింది.

స్టౌవ్ వెలిగించి నీళ్ళు పడేసింది—ఇంకో స్టవ్ వెలిగించి పాలు పెట్టింది.

పని చేస్తోందన్నమాటేగాని, ప్రతి చిన్నశబ్దానికీ ఉలిక్కిపడి చూస్తోంది.

శాంతమ్మగారూ-ఆవిడ వెనకాలే శేఖరం అక్కడికి వచ్చేరు.

శేఖరం గుమ్మం ఇవతలే ఆగిపోయాడు.

"డికాషన్ తీశావా?" శాంతమ్మగారు అడిగింది.

"తీశానండి!" నెమ్మదిగా చెప్పింది మీరా.

"మా పాప వచ్చింది" చెప్పిందావిడ.

మీరాకేసి పరీక్షగా చూస్తున్నాడు శేఖరం. అరుణ రాకకి ఆ ముఖంలో వెల్లివిరిసే ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అక్కడ శేఖరం వుండడంతో మీరా ఏమీ అనలేదు.

శాంతమ్మగారు "కాఫీ కలిపేయి" అంది.

మీరా కాఫీ కలిపింది. కప్పులో పోసి శాంతమ్మగారి చేతికి యిచ్చింది.

ఆవిడ శేఖరానికి యిచ్చింది.

"కాఫీ ఫ్లాస్కులో పోయమంటారా!" అని అడిగింది మీరా.

"పొయ్యి—యింకా అమ్మాయి లేవలేదు."

మీరా, కాఫీ ఫ్లాస్కులో పోస్తోంటే శేఖరం అన్నాడు "నాకు కొంచెం కావాల" అని. "అమ్మా అరుణ వచ్చినట్లు కాఫీకి తెలిసిందా ఏం? ఈ రోజింత బాగుంది,"

"ఇంటి ఆడబడుచు వచ్చిందని భయపడ్డట్టుంది" అందావిడ నవ్వుతూ.

మీరా ఫ్లాస్కులో పోయటం ఆపి అలాగే నిలబడిపోయింది.

మీరా ఆగిపోవటం చూసి, "అబ్బాయికియ్యి" అంది శాంతమ్మగారు.

మీరా మరో కప్పులోపోసి గుమ్మంవరకూ వచ్చి, ఆ పక్కనే వున్న స్టూలు యివతలికి జరిపి కాఫీకప్పు దానిమీద పెట్టి వెళ్ళిపోయింది.

కొంతసేపయాక మీరా అరుణ గదిలోకి వెడదామని వచ్చింది.

హాల్లో శేఖరం కూర్చున్నాడు. హాల్లోంచే ఆ గదిలోకి వెళ్ళాలి. మీరా వెనక్కి వెళ్ళిపోయింది. ఇంతసేపు అరుణని చూడకుండా వుండడానికి మీరా ఎంత వుగ్గబట్టుకునుందో శేఖరం గ్రహించలేకపోలేదు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటోంటే చూడాలని అతను చాలా కుతూహలంతో

యెదురు చూస్తున్నాడు. తర్వాత అరుణ తన మీద విరుచుకుపడుతుందనీ అతనికి తెలుసు.

శేఖరం లేచి దొడ్లోకి వెళ్ళేడు. అతను దొడ్లోకి వెళ్ళడం చూసిన మీరా గబగబా అరుణ గదికేసి నడచింది, అరుణ నిద్రపోతున్నా ఓ సారి చూద్దామని.

గుమ్మం వరకూ వచ్చిన మీరా ఆగిపోయింది. ఎందుకో గుండెలు దడదడలాడాయి. ఒక అడుగులోపలకి వేసి, ద్వారబంధం మీద చేతులాన్చి లోపలికి తొంగి చూసింది. అరుణ లేచింది. పెట్టె దగ్గర నిలబడి వుంది ఇటు వీపుపెట్టి.

ఇంకో అడుగు లోపలకి వేసింది మీరా. తలుపు కదిలిన శబ్దానికి అరుణ ఇటు తిరిగింది.

అంతే!!

మీరా ఏదో అనాలనుకుంది. ఏమీ అనలేకపోయింది. నవ్వు ముఖంతో చూస్తోంది.

క్షణంలో సగంసేపు ఇద్దరూ అలాగే చూసుకుంటుండిపోయారు.

అరుణ పూర్తిగా యిటు తిరిగింది.

మీరా ఒక్కంగలో వెళ్ళినట్టు అరుణ దగ్గరకొచ్చింది.

"అరుణా!" అని మీరా, "మీరా!?" అని అరుణా ఇద్దరూ ఒకేసారి ఒకర్ని ఒకరు పిలుచుకున్నారు.

"మీరా, నువ్వీ వూళ్లో వున్నావా! ఎందుకలా చెప్పకుండా పారిపోయావ్" మీరా భుజం మీద తల వాల్చి ఏడుపు గొంతుతో అంది అరుణ.

మీరాకీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నీ వంట్లో యెలావుంది. కులాసాగా వుంటోందా?" అంతకన్న ఏం మాట్లాడాలో తోచలేదు మీరాకి. అరుణ మొదటే 'ఎందుకలా చెప్పకుండా పారిపోయావ్' అని అడిగేసరికి అరుణతో ఎన్నో మాట్లాడాలనుకున్న మీరా మనసు మొదటే మూగబోయినట్టయిపోయింది.

"ఏమిటి మీరా! ఇలా అయిపోయావేమిటి? చాలా మారిపోయావ్—చాలా చిక్కిపోయావు. అమ్మగారు కులాసానా?" అంటూ మీరా చేయి పట్టుకుని మంచం దగ్గరికి నడిచింది అరుణ.

మంచం మీద కూర్చోవటానికి ఏమిటోలా అన్పించింది మీరాకి. 'శాంతమ్మగారు వస్తే' అనిపించింది.

అరుణ కూర్చుని మీరాని కూర్చోపెట్టింది. "నా మీద నీకు బాగా కోపం వచ్చింది కదూ! లేకపోతే చెప్పా పెట్టకుండా వెళ్ళిపోతావా?" అరుణ కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. మీరా చాలా నిగ్రహంగా కళ్ళమ్మట నీళ్ళు రాకుండా ఆపుచేసుకొంటోంది. "ఛా! అరుణా! ఏమిటదీ!" అరుణ కళ్ళు తుడుస్తూ అంది.

శాంతమ్మగారు చూస్తే బాగుండదని భయపడింది. "నీ మీద నాకు కోపమా అరుణా! ఎప్పుడేనా నీ మీద నాకు కోపం వచ్చిందా?"

"మరెందుకలా చేశావ్? కనీసం వుత్తరమన్నా రాయాలనిపించలేదూ! నేను రాద్దామంటే ఎక్కడకని రాయను?"

తడుముకోకుండా చప్పున అంది మీరా "రెండు వుత్తరాలు రాశాను నీకు. నీ దగ్గర నుండి జవాబు లేదు. నువ్వు లేవేమోనని ఇంక వూరుకున్నాను."

"నాకు అసలు నీ ఉత్తరాలే అందలేదు...."

శాంతమ్మగారు అక్కడకి రావటంతో మీరా లేచి నిలబడింది.

వాళ్ళిద్దరూ అంత సన్నిహితంగా మాట్లాడుకోవటం చూసి శాంతమ్మగారు తెల్లబోయింది. అరుణ కూడా లేచి నిలబడుతూ తల్లితో ఫిర్యాదు చేస్తున్నట్టుగా అంది " చూశావా మీరా ఎంత



దొంగో!" అని మీరాకేసి తిరిగి, "పోనీ అమ్మనడిగితే నా అడ్రసు చెప్పదూ!...." ఇంకా అరుణ ఏదో అంటోంది.

శాంతమ్మగారు ఆశ్చర్యంగా "మీరా నీకు తెలుసా?" అని అడిగింది.

మీరా తల వంచుకుని నిలబడింది.

ఈసారి ఆశ్చర్యపోవటం అరుణ వంతయింది. "అవునమ్మా! మీరా అది నా స్నేహితురాలని నీ కప్పుడు చెప్పలేదూ! అయితే మీరా నీకు చెప్పలేదన్న మాట!" ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే అంది. మీరా దగ్గరగా వచ్చి మీరా చేతులు పట్టుకుంటూ అంది మళ్ళా "ఎంత దొంగవి! అందర్నీ సర్‌ప్రైజ్ చేసేద్దామనా! బలేదానివేలే మొత్తానికి,"

మీరా బలవంతంగా నవ్వింది.

శాంతమ్మగారికేం అర్థం కాలేదు. అదివరకు అరుణ మీరా సంగతి చెప్పింది కూడా ఆవిడకి గుర్తురాలేదు. ఆవిడ యాత్రల నుండి హైదరాబాదు వచ్చినప్పుడు రెండు రోజులే వుంది. అక్కడ మీరాని చూడలేదు. మీరా అక్కడి ఇళ్ళల్లో వుండదేమో అనుకుందావిడ.

"పాపా, రా, కాఫీ తీసుకుందువుగాని" అని శాంతమ్మగారు వెళ్ళిపోయింది.

"మీరా! ఎంత నాటకమాడావు? బలేదానివేలే! కూర్చో! ఇప్పుడే అయిదు నిముషాల్లో వచ్చేస్తాను" అంది అరుణ.

"అలాగే" అన్నట్టు తలూపింది మీరా.

అరుణ ఇవతలకి వస్తోంటే చప్పున వరండాలోకి తప్పుకున్నాడు శేఖరం.

అసలు యుద్ధం ఇప్పుడుంది, అరుణ తనని ఇక్కడ ఇలా చూసి చాలా గొడవ చేస్తుంది. ఆ సమయం పెద్ద సమస్యలా అయిపోయింది మీరాకి. తను ఆ రోజే మొండితనంగా మానేయవలసిందేమో!....ఛ; ఏమిటిది! ఇలాంటి పరిస్థితి వచ్చింది!

అరుణ మొహం కడుక్కుని గదిలోకి వచ్చింది. మీరా అక్కడ లేదు.

"మీరా!" అని పిలుస్తూ ఇవతలకి వచ్చింది.

"పాపా! ఇలారా!" తల్లి పిలిచింది.

అరుణ అక్కడకి వచ్చింది. మీరా ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోస్తోంది. శాంతమ్మగారు టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చునుంది.

అంతక్రితం మీరాని చూసినప్పుడు కూడా అరుణ అంత ఆశ్చర్యపోలేదు. కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తూండిపోయింది చేత్తో తువ్వాలు అలాగే పట్టుకుని. మీరా కొద్దిగా కళ్ళెత్తి చిన్నగా నవ్వింది. అది నవ్వుకాదు; ఏడవలేక నవ్విన నవ్వు—

"రా, పాపా; చల్లారిపోతుంది" ఇదేం గ్రహించని శాంతమ్మగారు కూతుర్ని పిలిచింది.

అరుణ నిద్రలో నడిచినదానిలా నడిచి వచ్చింది. మీరా చెయ్యి పట్టుకుంటూ, "మీరా!...." అరుణ గొంతు, పెదాలు వణికినాయి. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

మీరా కళ్లు కిందకి వాలిపోయినాయి.

శాంతమ్మగారు తెల్లబోయి చూస్తోంది.

"అరుణా! ముందు కాఫీ తీసుకో-తర్వాత అన్నీ—" ఎలాగో అనేసి అక్కడ నుండి వెళ్ళిపోయింది మీరా.

మీరా వెళ్ళిన వైపు ఓ మారు చూసి, తల్లికేసి తిరుగుతూ అంది "ఏమిటమ్మా! మీరా ఇక్కడ...." మిగిలిన వాక్యం పూర్తి చేయలేనట్టుగా ఆగిపోయింది. కూతూరు అంత బాధ పడటం చూసి ఇద్దరికీ బాగా స్నేహమని గ్రహించిందావిడ.

"అవునమ్మా! పరిస్థితులు బాగాలేవని చెప్పి జేరింది. ఏం చదువుకోలేదటగా!"

"చదువుకోలేదా?" మరింత ఆశ్చర్యపోయింది.

"అలాగే చెప్పింది."

"అబద్ధం! బి. ఏ. చదివితే!—అన్నయ్య చెప్పలేదూ?"

"ఏమో! నాకేం తెలుసూ! చల్లారి పోతోంది. ముందు కాఫీ తీసుకో!"

తల్లి మాట వినిపించుకున్నట్టు లేదు అరుణ. వంటగదిలోకి వచ్చింది. మీరా అక్కడ గిన్నెలు సర్దుతోంది. అరుణ మీరా దగ్గరగా వచ్చి, "నీకిప్పుడేమయినా పనుందా?.... ఒక్క అయిదు నిముషాలు ఇలా రాగలవా?"

మీరా పరిస్థితికి కడుపులో బాధ వుండలు చుట్టినట్టు బాధ పెడుతున్నా అదేం కనపడ నీయకుండా పైకి హేళనగా అంది.

మీరా ఇటు తిరిగింది. అరుణకేసి నిదానంగా చూస్తూ చాలా శాంతంగా అంది "అరుణా, ప్లీజ్! నువ్వీరోజు ఇలా వుంటే అమ్మగారు ఏమనుకుంటారు? వెళ్ళి కాఫీ తాగిరా! అయిదు నిము షాలు కాదు—నీ యిష్టం! ఎంతసేవయినా మాట్లాడతాను."

"ఎంత మారిపోయావు?" బాధగా, కోపంగా అంది.

మీరా అరుణ భుజం మీద చేయివేసి బ్రతిమాలుతున్నట్టుగా అంది "అరుణా! నీకు పుణ్యం వుంటుంది. అలా మాట్లాడకు. వెళ్ళు. వెళ్ళి కాఫీ తీసుకురా. అమ్మగారు నీ కోసం చూస్తున్నారు. నా గురించి కొంచెం ఆలోచించు. అన్నీ వింటే నువ్వే అంటావు...."

"చాలా మంచిపని చేసేవనా?"

మీరా కోపంగా అంది "పోనీ చెప్పు! నీ కిష్టం లేకపోతే ఇప్పుడే వెళ్ళిపోతాను."

అరుణ మాట్లాడిలేదు. మీరానే చూస్తూ నిలబడింది.

"అరుణా! అలా చూడకు....అసలు నువ్విలా కూర్చో!" అని ఆ పక్కనే వున్న స్టూలు జరిపి అరుణ భుజాలు పట్టుకుని స్టూలుమీద కూర్చోపెట్టింది. గబగబా స్టౌ మీద నీళ్ళు పడేసింది.

చెంపకి చేయి జేర్చి మీరా చేసే ప్రతీపనీ చూస్తూ కూర్చుంది అరుణ.

పదినిముషాలు గడిచిపోయినాయి.

మీరా కాఫీ కలిపి రెండు కప్పుల్లో పోసి తీసుకొచ్చింది. ఒకటి అరుణకి యిచ్చింది. ఒకటి తను తీసుకుంది.

"ముందు కాఫీ అయినాక—ఆ తర్వాత నీ యిష్టం" అంది.

శాంతమ్మగారు వంటగది గుమ్మం వరకూ వచ్చి, వాళ్ళని చూసి వెళ్ళిపోయింది. మీరాకి ఏమిటోలా అనిపించింది. ఆవిడ ఎన్నిసార్లు చెప్పినా తనకి ఏం తీసుకోవాలన్నా ఏదోలానే అన్పిస్తుంది. కాని, ఇప్పుడు అరుణ గురించి తప్పదు.

δ δ δ

"ఇప్పుడు చెప్పు!" అంది అరుణ.

అరుణ వచ్చేకా అరుణ అడిగినదానికి యెలా చెప్పాలో ఏం చెప్పాలో ఎన్నడో తయారు చేసుకుంది మీరా. తడుముకోకుండా యిలా చెప్పింది.

"బామ్మకి జబ్బుగా వుందని టెలిగ్రాం వచ్చింది. అప్పటికప్పుడు బయలుదేరి విజయవాడ వచ్చేము. దేవుడి దయవల్ల బామ్మకి కాస్త కులాసా చిక్కింది. అమ్మకి సుస్తీ చేసింది—అది వరకే కాస్త నీరసంగా వుండేదిగా! బామ్మ ఈ వూళ్ళో యిల్లు కొంది. అంతా ఇక్కడకి వచ్చేము. మళ్ళీ బామ్మ ఆరోగ్యం దెబ్బతింది. కొన్నాళ్ళు మంచంలో వుంది—తర్వాత....

"అసలే కాస్త సుస్తీగా వున్న అమ్మ మంచమెక్కింది. అమ్మ మందులకి ఇంట్లో గడవటానికీ—ఉన్న డబ్బు కాస్తా తరుగుతూ వచ్చింది. మహామహా వాళ్ళకే కూర్చుని తింటే కొండలు తరుగుతాయంటారు. అలాంటిది మాబోటి వాళ్ళ సంగతి వేరే చెప్పేదేముంది? ఉద్యోగాలు యెంత తొందరగా దొరుకుతాయో నీకు తెలియదా, అరుణా! ఒక్కమాట నువ్వు నమ్ముతావో నమ్మవో కాని, ఇక్కడ నా కెలాంటి అగౌరవం జరగలేదు. అమ్మగారు యెంత అభిమానంగా చూస్తారనీ—ఇక్కడ కాకపోతే ఇంకో యింట్లోనన్నా చేయవలసిందే! నేను బి.ఏ. చదివేను నేను కుర్చీలోనే కూర్చుంటానూ అంటే కడుపు నిండదు అపుణా అమ్మకి ఏం చేసే ఓపికా లేదు...."

"అసలు దేనికేనా అప్లయ్ చేసేవా?"

"లేకపోతే? వూరికే కూర్చున్నాననుకున్నావా? ఆఖరికి ఈ వూళ్ళో—స్కూలు టీచరు పెళ్ళిచేసుకుని వెళ్ళిపోతుంది—ఆ పోస్టు కాళీ అని తెలిసి దానికి ప్రయత్నము చేసేను. ఎంత చిన్న ఉద్యోగం కావాలన్నా దక్షిణ కావాలిగా! దానికి తయారయాను. వెయ్యిరూపాయలట. అదీ నమ్మకంలేదు. వస్తే వస్తుంది—లేకపోతే లేదు. అన్నింటికీ సిద్ధమయి ముందుకు అడుగు వెయ్యాలి. నాకా ధైర్యం కలగలేదు. ఖచ్చితంగా వస్తుందంటే ఇంకో అయిదువందలన్నా ముందుకి అడుగువేద్దును. తీరా రాకపోతే! ధైర్యం చాలలేదు అరుణా."

అరుణ మీరా బుజంమీద చెయ్యి వేస్తూ అంది "మీరా! ఇన్ని అవస్థపడుతూ—నాకొక్క వుత్తరం రాయలేకపోయావా?"

"మీ అమ్మగారేనని నాకు తెలియదు."

"పోనీ అన్నయ్యని చూస్తే తెలియలేదూ! అన్నయ్య అప్పుడెదో అన్నాడని...."

అరుణ మాటకి అడ్డువస్తూ చప్పున అంది మీరా "నీకు తెలుసేమో అనుకున్నాను."

"నాను తెలిస్తే యిలా వూరుకుంటానా, మీరా! అసలలా యెలా అనుకున్నావు? అన్నయ్య నాకేం చెప్పలేదు" బాధగా అంది అరుణ.

"తెలిసి వూరుకుంటావని కాదు—అక్కడ నీ పరిస్థితులు ఎలాంటివో నాకు యెలా తెలుస్తుంది అరుణా!"



"అలాంటి పరిస్థితులేం లేవు మీరా! అయినా ఒక ప్రాణంలా మసులుకున్నాము. ఆ పాటి స్వతంత్రం వుండదా!" క్షణం ఆగి మళ్ళీ అంది బాధగా "ఎన్ని చెప్పేవప్పుడు? నన్ను యెంత ఆట పట్టించేవు. అన్నీ మర్చిపోయావా మీరా! ఎంత తేలిగ్గా మర్చిపోగలిగేవు...."

"అరుణా!...."

"అవును! నిజంగా పెళ్ళికూతుర్ని చేసినప్పుడూ—అప్పుడూ నా కెంత దుఃఖమొచ్చిందనీ! యెంత ఆపుకుందామన్నా ఆపుకోలేకపోయాను. మగపెళ్ళి వారిని మచ్చిక చేసుకుని—ఆడపడుచులా పెళ్ళికి వస్తానని చెప్పావు. మర్చిపోయావా? ఆ బాధలో—కోపంలో అన్నయ్యని తిట్టేను. నేను లేనప్పుడు నువ్వు వస్తే తనేదో అనే వుంటాడు అనిపించేది. అదే అన్నయ్యని అన్నాను. జ్యోతి యింటికెళ్ళి అడిగితే "ఎవరికో జబ్బుగా వుందని వెళ్ళారు" అని చెప్పిందనుకో! కాని, నువ్వసలు వుత్తరం కూడా రాయకపోవటంతో అన్నయ్యమీద విరుచుకుపడ్డాను."

మీరా మాట్లాడలేదు. చేతివేళ్ళు చూచుకుంటూ వుండిపోయింది. ఓ చెంప శాంతమ్మగారు ఏమనుకుంటోందోనని భయంగా వుంది. ఆవిడకి పూజకి టైము అవుతోంది.

మాటిమాటికీ అరుణ అలా కళ్ళ నీళ్ళు పెట్టుకోవడం మీరాకి భయమేసింది. శాంతమ్మగారేమనుకుంటుంది?

"అరుణా! నువ్విలా కళ్ళ నీళ్ళు పెట్టుకోకూడదు. ఈ రోజు పురిటికొచ్చి—తప్పుకదూ! అమ్మగారు నన్నెంత గౌరవంగా చూస్తారో తెలుసా!" అంటూ అరుణ కళ్ళు తుడిచింది మీరా.

"ఉండు అన్నయ్యని నీకు మంచి ఉద్యోగం చూడమంటాను. ఇంత చదువూ చదువుకుని యిలా దిగజారిపోవటమా!"

"ఏం అరుణా! నా చేతివంట రుచి చూడకుండానే హడలు పుట్టిందా!" బలవంతంగా నవ్వుతూ అంది మీరా.

"ఎలా నవ్వగలుగుతున్నావు అంత హాయిగా!" ఆశ్చర్యంగా అడిగింది అరుణ.

"నీలా ప్రతీ చిన్నవిషయానికీ బాధపడుతూ కూర్చుంటే యెలా?"

"ఇది నీకు చిన్నవిషయమా! ఎలాగయినా నువ్వు చాలా మారిపోయావు మీరా! ఇప్పుడు నీ మాటా అదీ చూస్తోంటే అప్పుడు నీ మాటలూ తమాషాలు చేసేది నువ్వేనా అనిపిస్తోంది" అంది అరుణ బాధగా, ఆశ్చర్యంగా.

"కొంపదీసి యిప్పుడు—నువ్వసలు మీరావే కాదు బొమ్మన్నవు కదా!" నవ్వేస్తూ అంది మీరా.

"నిజంగానే! ఆ మీరావి కాదు—"

అవతల శాంతమ్మగారికి పూజటైము అవుతోంది. ఆవిడేమనుకుంటోందోనని మీరాకి భయంగా వుంది. అరుణకి మీరాతో ఎక్కువసేపు మాట్లాడినా తనివితీరినట్లు లేదు.

అరుణ ఏవేవో కబుర్లు చెప్తూనేవుంది—ఇంక మీరా దృష్టి ఇటులేదు.

"ఆవిడేమనుకుంటున్నారో!" ఇదే ధ్యాస.

ర ర ర

ఎలాగయితేనేమి మీరా ఆ గదిలోంచి బయట పడింది.

శాంతమ్మగారు స్నానంచేసి వచ్చేసరికి ఆవిడకి పూజకి సిద్ధంచేసింది. అప్పటికిగాని మీరా మనసు కుదుటపడలేదు.

ఆ పూట శేఖరం టీకి కూడా లోపలకి రాలేదు. తన గదిలోనే వుండిపోయాడు. ఏవో ముఖ్యమయిన కాగితాలు చూసుకుంటూ వుండిపోయాడు. కానీ ప్రతీ చిన్న అలికిడికీ మనసులో వులికి పడుతూనే వున్నాడు. రాబోయే గాలి దుమారానికి సిద్ధంగానే వున్నా—

అరుణ రానే వచ్చింది—

అరుణ రాకని గ్రహించినా గ్రహించనట్టే వుండిపోయాడు శేఖరం.

అరుణ—అక్కడే వున్న ఇంకో కుర్చీ చప్పుడయేలా కాస్త పక్కకి జరిపి మరీ కూర్చుంది.

శేఖరానికి తల ఎత్తక తప్పలేదు. తల ఎత్తి అరుణకేసి చూసీ చూడనట్లు చూసి, చిన్నగా నవ్వేడు బలవంతంగా.

"చాలా అర్జంటు పనిలో వున్నట్టున్నావు" అతి మామూలుగా అంది అరుణ. కళ్ళు మాత్రం చాలా నిశితంగా పరీక్షిస్తున్నట్లుగా వున్నాయి.

ఇదేదో—చాలా పెద్ద దుమారమే అనిపించింది శేఖరానికి. కాయితాలు పక్కకి పెట్టి, గాలికి ఎగిరిపోకుండా దానిమీద పేపర్ వెయిట్ వుంచుతూ "ఏమిటరుణా!" అన్నాడు పూర్తిగా అరుణకేసి తిరక్కుండానే.

"అర్జంటు పనేమో! చూసుకో" ఈసారి అరుణ గొంతులో హేళన ధ్వనించింది.


శేఖరం కుర్చీలో వెనక్కి వాలుతూ అన్నాడు "అర్జంటేమీ కాదు."

"నేను అడగబోయే దేమిటో నీకు తెలిసే వుంటుందనుకుంటాను."

"చెప్పందే ఎలా తెలుస్తుంది?" చాలా నిదానంగా అన్నాడు.

అరుణకి కోపం వచ్చింది. దాన్ని పైకి కనపడనీయకుండా అంది "అదే మీరా సంగతి" అతని ముఖంలోకే చూస్తూ అంది.

శేఖరం మాట్లాడలేదు. కొంచెం ముందుకి వంగి ఎడమ చేయి టేబుల్ మీద ఆన్చుకుని—కుడి చేత్తో కాయితాల మీద వుంచిన పేపర్ వెయిట్ని ఇటూ, అటూ తిప్పుతూ వుండిపోయాడు.



"అర్ధం కాలేదా అన్నయ్యా!" ఆ గొంతులో బాధా, కోపం సమపాళ్ళల్లో ధ్వనించాయి.

"నువ్వేం చెప్పందే!" నవ్వేడు.

"మీరా కోసం అప్పుడు అంత ఏడ్చేనే! ఇక్కడ వంటమనిషిగా జేరింది—అది తెలుసుగా!"

'వంట మనిషి' అతని మనసు గిలగిల్లాడింది. 'మీరా గురించి—మీరా యీ పరిస్థితికి తనెంత వ్యథ చెందుతున్నాడో అరుణకేం తెలుసు....?'

"మీరా యిక్కడ వుందని చెప్పలేకపోయావా?....ఇంకా మీరా మీద నీకు కోపం పోలేదులా వుంది."

శేఖరం శుష్కహాసం చేసేడు.

"ఏం అన్నయ్యా, మాట్లాడవు?"

"ఇప్పుడు నేనేం చెప్పినా నువ్వు నమ్మవు."

"నిజం చెప్తే కూడానా?"

"................................"

"ఏం అన్నయ్యా! మాట్లాడవేం?" కొంచెం విసుగ్గా అంది అరుణ.

"ఏం మాట్లాడమంటావ్?" అన్నాడు శేఖరం.

"మీరా యిక్కడున్నట్లు చెప్పలేదేం? నాకు చాలా విచిత్రంగా అన్పిస్తోంది. జ్యోతి నీ స్నేహితుణ్ని ఏదో చేయట మేమిటి—అనుకోకుండా మీరా అక్కడున్నందుకు—మీరా మీద ఇంత కష.......!"

"అరుణా, ప్లీజ్! అ సంగతి నే నెప్పుడో మర్చిపోయాను—ఈ సంగతి ఆవిడ దగ్గర అనొద్దు కూడా....నీకు తెలుసేమో అనుకున్నాను.. లేకపోతే...."

"బాగుంది—ఇద్దరి కిద్దరూ బాగా సరిపోయారు. తను కూడా ఇలానే అంది. నాకు తెలిస్తే మీరా సంగతి నీ దగ్గర అనకుండా వుంటానా?"

"నేనున్నది ఎప్పుడూ? ఏదో ఒకపూట కనిపించి వచ్చేస్తున్నాను."

"ఒక్క పూట—ఒక్కపూట కాదు-ఒక్క నిముషమున్నా సరే! మీరా, ఇక్కడ ఇలా వున్నట్టు తెలిస్తే నీ దగ్గర అనకపోయేదాన్నా? పోనీలే! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు మీరాకి మంచి వుద్యోగం చూసి పెట్టన్నయ్యా! ఈ ఒక్క సహాయం చేసిపెట్టేవంటే—మీరా మాట ఎలా వున్నా నేను నీకు ఋణపడి వుంటాను" అరుణ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

శేఖరానికి చాలా బాధనిపించింది. "అదేం మాట అరుణా!" అన్నాడు.

అరుణ మాట్లాడలేదు.


మళ్ళీ శేఖరమే అన్నాడు. "ఆవిడకి ఇష్టమేనా ఉద్యోగం చెయ్యటం?"

"అంత చదువుకుని ఇలాగే వుండాలనుకుంటారా ఎవరయినా!"

అరుణ ఇంత తేలిగ్గా వదిలిపెడ్తుందనుకోలేదు శేఖరం.

అతను తేలిగ్గా నవ్వేస్తూ అన్నాడు "నీ ఫ్రెండుకి ఎలాంటి వుద్యోగం కావాలో కనుక్కో."

అరుణకి కోపం వచ్చింది. "అన్నయ్యా! ఇప్పుడే చెప్తున్నా. మీరా గురించి నువ్వు హేళనగా మాట్లాడావంటే నేనూరుకోను. అమ్మకి నీకూ కోపం వచ్చినా సరే—నేను ఒక్క క్షణం ఇక్కడుండను. తనకి కూడా మనతో మల్లేనే పేరుంది. "ఆవిడగారూ— నీ ఫ్రెండూ" అంటూ హేళన చేస్తేమాత్రం అదివరకులా వూరుకోను."



శేఖరం దృఢస్వరంతో అన్నాడు "మీరా గురించి—నా నోటి వెంట ఒక్కటంటే ఒక్కటి—హేళనగా-వ్యంగ్యంగా చిన్నమాట వచ్చినా నా నాలిక చీరేయి—సరేనా? ఆవిడ మీద నాకేం కోపంలేదు. చెప్తే నువ్వు నమ్మవు...." క్షణం ఆగి, నవ్వుతూ అన్నాడు. "కోపం యెందుకొస్తుందో చెప్పనా! ఆవిడ—అదే మీరా సమక్షంలో నువ్వందర్నీ మర్చిపోతావు—అందుకే."

వెంటనే అంది అరుణ "రాఘవరెడ్డి వస్తే నువ్వు అన్నం నీళ్ళమాటే మర్చిపోతావు. అమ్మ యెంత మొత్తుకుంటుందీ, ఒక్కొక్కసారి!"

శేఖరానికి మరోసారి మీరాకి మంచి ఉద్యోగం తొందరలో చూడమని చెప్పి వచ్చేసింది అరుణ.

అరుణ వంటగదిలోకి వచ్చింది.

మీరా ప్రసాదం దేవుడి గదిలోకి తీసుకెళ్తోంది. అరుణకేమిటో గుండె పట్టుకున్నట్టయింది. రెండు మూడు క్షణాలు అలాగే నిలబడిపోయింది.

తర్వాత మెల్లగా దేవుడి గదిముందు కొచ్చి ఇవతలే ఆగిపోయింది.

శాంతమ్మ అగరువత్తులు వెలిగిస్తోంది.

ఆవిడ నైవేద్యం కూడా పెట్టి హారతి ఇచ్చింది.

హారతి మీరాకి చూపించి, "అమ్మాయిని పిలువు" అంది.

మీరా తలెత్తి అరుణకేసి చూసింది.

అరుణ మీరాకేసి నిశితంగా చూసి—లోపలకొచ్చి హారతి కళ్ళకద్దుకుంది.

శాంతమ్మగారు ప్రసాదం అరుణకీ మీరాకీ యిచ్చి "అన్నయ్య యింట్లో వున్నాడా!" అని అడిగింది.

"ఇంట్లోనే వున్నాడు", అంది అరుణ.

మీరా అక్కడనించి యివతలకి వచ్చేసింది.

శాంతమ్మగారు కూడా యివతలకి వచ్చింది.

శాంతమ్మగారు శేఖరానికి ప్రసాదం యివ్వటానికి వెడతోంటే అతనే అక్కడికి వస్తున్నాడు. అరుణ అడగటం—ఆ గాలిదుమారం భయపడ్డంత దూకుడుగా రాకపోయినా వచ్చి వెలిసిపోయింది. ఇప్పుడు అతను మామూలుగానే వున్నాడు.

తల్లి యిచ్చిన ప్రసాదం తీసుకుంటు, "ఒట్టి ప్రసాదమేనా!" అన్నాడు.

"పెందలాడే భోజనం చేస్తావేమోనని టిఫిను చేయించలేదురా" అంది.

"పొద్దున్న ఒక్క కప్పుకాఫీ ఎక్కువ తాగిన నేరానికా టీ లేదూ?"

"టీ తాగలేదా?" అని అడిగిందావిడ.

"ఎక్కడా! ఇంకా వస్తుంది ఇంకా వస్తుందని ఎదురు చూస్తోంటే."

"మీరా టీ పెట్టు" అందావిడ.

అప్పటికే శేఖరం "ఒట్టి ప్రసాదమేనా" అన్నప్పుడే టీకి నీళ్ళు పడేసింది. ఇది శేఖరం గహించేడు.

"పాపా! నువ్వు కాఫీ తాగుతావా? హార్లిక్స్ వుంది."

"నాకేం వద్దమ్మా!" అంది అరుణ.

"అదేమిటమ్మా! ఏదో ఒకటి తీసుకో!"

"ఊఁహూఁ, వద్దు"

"నా మీద కోపం వచ్చింది అరుణకి. అలాంటప్పుడు నేను తాగడం బాగుండదు. నేను వెళ్తున్నానమ్మా" అని వెనుదిరిగాడు శేఖరం.

శాంతమ్మగారికి ఇదేం అర్థం కాలేదు "టీ అయిపోయింది తాగి వెళ్ళు" అంది.

"వద్దమ్మా! ఇంటి ఆడపడుచు అంత కోపంగా వుంటే—తప్పు తాగకూడదు" అన్నాడు. అయినా అరుణేం మాట్లాడలేదు. అన్నయ్య ఏదో మంచి ఉద్యోగం చూస్తాడు మీరాకి ఫరవాలేదు అనుకుంది. వంటగదిలో మీరాని చూసేసరికి మళ్ళీ మనసులో దిగులు నిండిపోయింది.

"ఆడబడుచుకి కోపం వచ్చిందని రేపొద్దున్న నీ పెళ్ళాం భయపడాలిగానీ, నువ్వేం భయపడక్కర్లేదు" అంది శాంతమ్మగారు.

ఇంక శేఖరం ఏం మాట్లాడలేదు.

"ఏం? అబ్బాయిగారి నోటికి తాళం పడిందా?" అంది అరుణ.

శేఖరం అరుణకేసి చూసి చూపులు మళ్ళించుకున్నాడు.

"మరేమిటనుకున్నావ్! పెళ్ళిమాట ఎత్తితే మరి మాట్లాడ్డు. అక్కడనించి వెళ్ళిపోతాడు" అంది శాంతమ్మగారు వంటగదిలోకి వెళ్తూ.

మీరా టీ కలిపింది. కానీ తీసుకురాలేదు. మామూలుగా ఎప్పుడూ అతనున్న చోట—శాంతమ్మగారు అక్కడ వున్నా లేకపోయినా అక్కడ పెట్టి వెళ్ళిపోతుంది. ఇప్పుడేమిటో వెళ్ళాలనిపించలేదు. అలాగే నిలబడిపోయింది. మీరా అలా నిలబడ్డం చూసి, "అయిందా?" అంది శాంతమ్మగారు.

'ఆవిడ పట్టుకెళ్తే బాగుణ్ను' అనుకుంటూ "అయిందమ్మా" అంది.

"మరి ఇచ్చేయి" అని ఆవిడ దేవుడు గదిలోకి వెళ్ళిపోయింది.   (సశేషం)

మినీకథ

"సారీ భానూ"

ఋషిశ్రీ కోరా

"క్రొత్త సినిమాలంతగా బాగోటంలేదు, ఏదైనా పాత సినిమా కెళ్దాం భానూ?" అంది సరోజ. పాతసినిమా కావటాన జనం అంతగా లేరు. ఆట మొదలవట్టానికింకా పది నిమిషాల టైముంది. హాలు లోపల సిగరెట్ కాల్చటం నిషేధం — అందుచేత సరోజను హాలులోపల కూర్చోమని చెప్పి బయటకు నడిచాడు భానుమూర్తి.


న్యూస్‌రీలు మొదలవటంతో హాలులోపల ప్రవేశించాడు భానుమూర్తి. సరోజ భుజం మీద చెయ్యివేస్తూ కూర్చున్నాడు. వెంటనే సరోజ వణుకుతూ "ఏయ్ మిస్టర్! ఇదేమిటి? నా ప్రక్కన వచ్చి కూర్చున్నావ్? లే, ముందు నీకేమైనా మేనర్సుందా?" అని అరచింది. సరోజకు ఆవలిప్రక్కనున్న స్త్రీ "అన్ని సీట్లు ఖాళీలుండగా ఆడవాళ్ళ ప్రక్కకొచ్చి కూర్చోడానికెంత ధైర్యం?" అని అంది. పది మంది దాకా జనం ప్రోగయ్యారు. ఒకరు "స్కూప్రిలూ జేమో"నసీ, మరొకరు "వెధవ! బాగా త్రాగొచ్చినట్టున్నాడండీ!" అనీ, వేరొకరు "పోలీసుల్ని పిలవండనీ" ఎవరి నోటికొచ్చింది వారంటున్నారు.

భానుమూర్తికి నోటివెంట మాట రాలేదు. అసలు తను కూర్చుంది సరోజ ప్రక్కనేనా? అని అనిపించి సరోజవైపు చూశాడు. సందేహం లేదు సరోజే! మరి....మరి ఇదేమిటి? పరుగులాంటి నడకతో హాలునుంచి బయటికొచ్చేడు భానుమూర్తి.

సరోజమీద బాగా కోపమొచ్చింది. కాలేజీలో నిలదీసి అడగాలని అనుకున్నాడు. మరురోజుదయం సరోజే భానుమూర్తి రూమ్ కొచ్చింది.

"సారీ! భానూ!! రాత్రి నా పక్కన కూర్చుంది మా అత్తయ్య. ఆమె కూడా యీ సినిమాకే వస్తుందని నేనూహించ లేదు. మన విషయం కూడా ఇంట్లో తెలియదు కదా! అందుకని అలా ప్రవర్తించాను. నన్ను క్షమించు భానూ!" అంటూ అతని వళ్ళో వాలిపోయింది సరోజ. □

అగ్నిశిఖ



ప్రఫుల్లచంద్ర

గుణశేఖర్ డిగ్రీ కాగితాన్ని చూచి నవ్వుకున్నాడు! కానీ....ఆ డిగ్రీకోసం ఒకప్పుడు ఎంత ఆరాటం! ఎంత అప్పు? దాన్ని మొదటి సారి చేతుల్లోకి తీసుకున్నప్పుడు ఎంత గర్వం! స్వర్గాన్ని తెరిచే తాళంచెవి చేతిలో పడినట్టు!

కానీ....యిప్పుడు అది కాఫీ కాచుకోడానికి కూడా పనికిరాని కాగితపుముక్క! స్వర్గాన్ని కాదుకదా, ఆఫీసు తలుపులైనా తెరవడం చేత కాని ఉత్తి కాగితపు ముక్క! ఈ విషయం తెలియడానిక్కి అతనికి నాలుగేళ్ళు పట్టింది!

తల్లిదండ్రులకు తనపై ఎన్ని ఆశలు! తమ్ముడికి ఎంత గౌరవం! చెల్లికి ఎంత అభిమానం! వారి ఆశల్నితీర్చి, వెలిగే వారి కళ్లలో తన నీడ చూచుకోవాలని ఎన్ని కలలు కన్నాడు తను!

కాని....ఉద్యోగం! ఉద్యోగం దొరికితే వారి ఆశల్లో కొన్ని అయినా తీర్చవచ్చు.

అమ్మ! కుటుంబానికి ఎంత సేవ చేస్తోంది! ఎంత కష్టపడుతోంది. కట్టుకోడానికి మంచి చీర అయినా లేదామెకు. ఆమెను సుఖపెట్టడం తన బాధ్యత! నాన్న మాత్రం? తమ సుఖం కోసం గొడ్డులా చాకిరీ చేయడం లేదూ? తన కుద్యోగం దొరకగానే — నాన్నగారూ! మీరు విశ్రాంతి తీసుకోండి—అని చెప్పేయాలి. తమ్ముడు—ఎంతవరకు చదువుతానంటే—అంతవరకూ చెప్పించాలి! చెల్లికి మంచి వరుడు....

కానీ....ఉద్యోగం?....ఈ జన్మలో దొరుకుతుందా?....

శ్రీ శ్రీ శ్రీ

నెత్తిన పిడుగుపడినట్టు దిగ్భ్రాంతు డయాడు రామ్మూర్తి పంతులు. 'నేను చచ్చినా బాగుండిపోను' అనుకున్నాడు. అలాంటి కొడుకను కన్నందుకు—తన బాధ్యత ఏమీ లేనట్టు—భార్యను ఛాం, ఛూం అన్నాడు. ఇల్లు పీకి పందిరి వేసాడు! రెండో కొడుకు—విద్యాశేఖర్ కూడా—తన స్థాయిలో చిరచిరలాడి పోయాడు. కోపతాపాలకు అతీతురాలుగా కనిపించే అమ్మ కూడా ముక్కుతూ, మూలుతూ, పెద్దన్నయ్యను తిట్టుకోవడం — చోద్యంగా చూస్తూ వూరకున్నది సుమిత్ర ఒక్కతే!

అరగంట చిందులేసాక, టేబుల్ మీద ఫ్రేములో వున్న కొడుకు ఫోటోని నేలకేసి కొట్టి—అప్పటికీ కసితీరక రుసరుస లాడుతూ బయటకు పోయాడు రామ్మూర్తి. గాజు ముక్కలు ఏరి ఫోటోను భద్ర పరిచింది సుమిత్ర.

శ్రీ శ్రీ శ్రీ

మొగం కడుక్కొని తువ్వాలుకోసం వెదుక్కుంటున్నాడు శేఖరం. తువ్వాలు దాచేసిన పద్మ ఎదురుగా కనిపించింది, నవ్వుతూ.

"ఏమి జేతురా రంగా!" పాట అందుకున్నాడు.

"నీ ఎదుట నే నుండ వేరే టవలెందుకూ?" కూనిరాగం తీస్తూ చెంగుతో అతని మొగం తుడిచింది పద్మ. సరాగా లాడుకుంటూ, టిఫినూ, టీ ముగించి పార్కుకి బయలుదేరారు దంపతులు. పార్కులో కూర్చున్నంతసేపూ దీర్ఘాలోచనలోనే వున్నాడు శేఖర్. అతని గాంభీర్యాన్ని గమనించి మౌనం వహించింది పద్మ.


అతడు ఆలోచిస్తున్నాడు....ఏడాది క్రితం జీవితానికీ, యిప్పటికీ ఎంత తేడా! తాను ధైర్యంగా ముందడుగు వేయకపోతే యింకా తాను నిరుద్యోగిగానే వుండేవాడు. పెళ్ళికాని అమ్మాయి,ఉద్యోగంలేని అబ్బాయీ—ఇద్దరూ ఒకలాంటివారే; తలిదండ్రుల గుండెలమీద కుంపట్లు!....తాను కుటుంబానికి దూరం అయినందుకు—తలిదండ్రులు మొదట్లో కోపగించినా....యిప్పుడు....యిప్పుడు?......ఏమో! అయినా పద్మకేం తక్కువ? భార్య కుండవలసిన అన్ని సద్గుణాలూ ఆమెలో వున్నాయి. ఆమె వల్లనే తనకు బ్యాంక్ ఉద్యోగం దొరికింది! కాపురం అన్యోన్యంగా హాయిగా సాగిపోతున్నది....అంతా బాగానే వుంద....మరి అమ్మా....నాన్నా....పద్మని కోడలుగా అంగీకరిస్తారా? కాలమే అన్ని సమస్యలకూ మందు! వీలుచూచుకొని వాళ్ళకు కాస్త ధన సహాయం చేస్తే....

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? అమ్మా....నాన్నా గురించా?"

తల ఆడించాడు శేఖర్.

"నావల్ల కదా మీ కీ బాధ?"

"అలా అనకు పద్మా! నేను యీ మాత్రం అయినా హాయిగా వున్నానంటే—అది నీ



వల్లనే....వాళ్ళకూడా ఏదైనా సాయం చేద్దామా....అప్పుడైనా వాళ్ళు మారుతారేమోనని...."

కాసేపు మౌనం వహించి, "లంచంతో, హృదయ పరివర్తన సాధించలేం" అంది. జీతంలో మిగిల్చి పంపడం ఎటూ కుదరదు. బోనస్ వచ్చినప్పుడు భార్యను ఒప్పించాలి—అని అప్పటికి మౌనం వహించాడు శేఖర్.

"కోపం వచ్చిందా? సారీ సర్!" నవ్వేసింది పద్మ. "డబ్బు పంపడంవల్ల వారు మారి, మనల్ని స్వీకరిస్తే మంచిదే. మన కుటుంబాలు ఒకటి కావడంకన్నా నేను కోరేదేముంది?.... అసలు మిమ్మల్ని యిక్కడకు లాక్కు రాడానికి ఒక కారణం వుంది....శుభవార్త"అంటూ బెల్లించి, లాలించి, సస్పెన్స్‌లో ముంచి తేల్చి అసలు విషయం చెప్పింది పద్మ.

తమ ఊళ్ళోనే ఏదో కంపెనీ—టైపిస్టు కావాలని—ప్రకటించిందట. ఉన్న ఊళ్ళోనే కదాని పద్మ అప్లై చేసి, ఇంటర్వ్యూకి వెళ్ళిందట. జాయిన్ అవమని యివాళే అర్డరు పంపారట వాళ్ళు. ఒక్కసారిగా చెప్పి ఆశ్చర్యంలో ముంచివేద్దామని భర్తకు అప్లై చేసినట్టు ముందుగా చెప్పలేదు పద్మ.

"నా జీతంతో కుటుంబం జరుపుకుందాం. మీ జీతంలోంచి నెలనెలా మూడొందలు పంపి, మిగిలినది దాచుకుందాం! సరేనా?"ఉత్సాహంగా అంది పద్మ.

మరో సందర్భంలో అయితే—తనతో చెప్పకుండా ఉద్యోగం సంపాదించుకున్నందుకు ఆమెమీద కోపం వచ్చేదే! కాని యిప్పుడు సంతోషించాడు శేఖర్.

తను కూడా ఆఫీసుకు వెళ్ళాలి కాబట్టి—యిల్లు చూచుకోడానికి పద్మ, ఆంటీని పిలిపించుకొంది. వంట, శుచి, శుభ్రతా, అణకువా—అన్నిటా ఆంటీ వాళ్ల మెప్పు పొందింది, అచిరకాలంలోనే.

జీతాలు వచ్చాక, ఎమ్. ఓ. చేశాడు శేఖర్. ఎమ్. ఓ. తిరిగివస్తుందని పందెం కట్టింది పద్మ. ఆమె అన్నట్టుగా వారం రోజుల్లో తిరిగివచ్చింది, ఎం. ఓ. కాదు! రసీదు!!

రాబోయే శుభదినాలకు సూచనగా భావించాడు శేఖర్.

"డబ్బుకి కులం లేదు!" నవ్వేసింది పద్మ; ఓడినందుకు ముద్దు చెల్లించి.

తమని ఆహ్వానిస్తూ తండ్రినుండి ఉత్తరం వస్తుందని వారం ఎదురు చూచాడు శేఖర్. కాని సుమిత్ర వ్రాసింది.

ఎమ్. ఓ. వచ్చినప్పుడు తండ్రి యింట్లో లేడట. రాత్రి వచ్చి, విషయం తెలిసి,—"వీడి డబ్బు ఎవడి క్కావాలి? పెళ్ళాం ముండ తంతోంది కాబోలు. రాజీకి లంచం పంపాడు. భ్రాష్టుడు! గుమ్మంలో అడుగుపెడితే కాళ్ళు విరగ్గొడతా!"—అని చిందులేసాడట. ఎమ్.ఓ. తిరగ్గొట్టేద్దాం—అంటూ అగ్నిలో ఆజ్యం పోసాట్ట తమ్ముడు. కాని మర్నాడు పోస్ట్ మాన్ రాగానే గుట్టు చప్పుడు కాకుండా డబ్బు తీసుకున్నాట్ట! "నిన్న చిందులేసి యివాళ డబ్బు ఎందుకు తీసుకున్నారని" సుమిత్ర అడిగితే "పితృ ఋణం తీర్చుకోకుండా వాడు వచ్చే జన్మలో ఏ పందిగానో కుక్కగానో పుట్టాలనా నీ ఉద్దేశం? వచ్చే జన్మలో అయినా వాడికి సద్గతి కలగడానికి అవకాశం యిస్తున్నా! అంతే!" అన్నాట్ట.

తన అడ్రస్ యిన్నాళ్లకు తెలిసినందుకు సంతోషిస్తూ "వదినకు నా నమస్కారాలు అందజేయి. మీ రుభయులూ నా కాలేజీ అడ్రస్‌కు ఉత్తరాలు వ్రాస్తూ ఉండండి" అని ముగించింది సుమిత్ర.

ఉత్తరం చింపివేసాడు శేఖర్!

* * *

"ఈ ప్యాకెట్ మీద రేటు 6-38 వుంటే 7-50 చెబుతున్నారేం?"

"రేటు క్రింద స్థానిక పన్నులు అదనం అని వుంది చూడండి" వెటకారంగా నవ్వాడు షాపువాడు.

"పన్ను ఎంత?"

అందరిలా—చెప్పినంతకు కొని వెళ్లక ఈ ప్రశ్నలన్నీ ఏమిటని చిరాకుగా చూచి "15 శాతం!" గొణిగాడు షాపువాడు.

"నిత్యావసర వస్తువులమీద అంత పన్ను ఉండదు."

"వెళ్ళి ప్రభుత్వాన్ని అడగండి!" ఈసడింపుగా అన్నాడు.

"ఈ వీధి చివరి స్థలం యింకో ప్రభుత్వానిదా? అక్కడ యిదే ప్యాకెట్టు 7 రూ. కిస్తున్నారు. 15 శాతం పన్ను లెక్కించినా దీని వెల 7-35 మించదు!"

"అమ్మా! తల్లీ!! వెళ్ళి అక్కడే కొనుక్కోండి!" వేళాకోళంగా చేతులు జోడించి నమస్కరించాడు షాపువాడు. ఇంత పెద్ద షాపుకి వచ్చి అర్ధరూపాయికోసం తగవుపడుతున్న ఆమెను చూచి చుట్టూ చేరిన వారంతా గొల్లున నవ్వారు. సర్రున వెనక్కి తిరిగింది పద్మ.

"ఎందుకు నవ్వుతారు? ఈ పెద్దమనిషి పట్టపగలు మన కష్టార్జితాన్ని దోచుకు తింటూ వుంటే నవ్వు వస్తోందా మీకు? మీలాంటి ఒక కష్టమర్ని యితగాడు అవమానిస్తోంటే నవ్వులాటగా వుందా మీకు? ఈ దోపిడీని కిక్కురుమనకుండా ప్రోత్సహించే మీరే—ప్రభుత్వం అధిక ధరలను అరికట్టాలని గొంతులు చించుకుని అరుస్తారు! సమ్మెలు చేస్తారు! మీరు ప్రభుత్వంలో ఒక భాగం కాదా? ఈ దోపిడీని అరికట్టడంలో మీ బాధ్యతే లేదా. ఇంకా నవ్వుతున్నారు! సిగ్గు లేకుండా!!" ఆమె రుసరుసలాడిపోతున్నది. తలలు వంచుకున్నా రందరూ!

"సరే. 7-50 కు బిల్లు యివ్వండి."


షాపువాడు తటపటాయించాడు. "సారీ! ఆ వస్తువుని అమ్మదలచుకోలేదు" సాధ్యమైనంత వినమ్రంగా అన్నాడు.

అంతవరకూ ఓ మూల వున్న విద్యార్థులు కౌంటర్ వద్దకు వచ్చారు.

"ఏయ్ మిస్టర్! మేం యింజనీరింగ్ విద్యార్థులం! తెలుసుగా మా సంగతి! ఆమె అన్నదాంట్లో తప్పేముంది? అమ్మడానికి కాకపోతే ఎందుకు పెట్టినట్టు ఈ షాపు? అసలు ధరలపట్టీ వేలాడగట్టాలి కదా? ఏదీ?....ఒరేయ్ లంబూ! మన హాస్టల్ వాళ్ళందర్నీ రమ్మని ఫోన్ చెయ్!"

అంతే. 7 రూ.కు బిల్లు రాసి, ప్యాకెట్ పద్మ చేతిలో పెట్టి—నమస్కారం పెట్టేసాడు అతడు.

"థాంక్యూ బ్రదర్స్ అండ్ సిస్టర్స్!" గాలిలో చేయి ఊపి అందరికీ కృతజ్ఞతలు చెప్పి ఠీవిగా బయటకు నడిచింది పద్మ. తల వంచుకొని అనుసరించాడు శేఖర్.



ముష్టి అర్ధరూపాయకోసం భార్య పబ్లిగ్గా యింత రగడ చేయడం అతనికి బాధగా వుంది. అవమానంగా తోచింది!

పద్మ తత్వం అంతే. ఒక్క పంకాయ తక్కువైతే కూరగాయలవాటితో జగడం ఆడుతుంది. పాలలో ఒక చుక్క నీళ్ళుంటే—వాణ్ణి కొట్టినంత పని చేస్తుంది. అయితే భార్య చాల కరెక్ట్ మనిషని—మొదట్లో మురిసిపోయాడు శేఖర్. కాని యిప్పుడిప్పుడే అతనికి భార్య "ఉత్తి పీనాసి. కక్కుర్తి మని"షని పిస్తోంది. ఆమెతో షాపింగ్ వెళ్లడానికి భయం వేస్తోంది. ఈ మనిషిని భరించగలనా—అని పిస్తోంది!

ఆ రాత్రి వెన్నెల్లో ఉలుకూ పలుకూ లేకుండా మంచంమీద దొర్లుతున్న భర్తని చూచి ఆశ్చర్యపోయింది పద్మ. ఇంతకు ముందు యిలాంటి వెన్నెల రాత్రులు వృధాగా పోయేవి కావు!

ఏమిటో గత ఆరు నెలలుగా—తాను ఉద్యోగంలో చేరిన లగాయితూ—భర్తలో మార్పు కన్పిస్తోంది. ఉత్సాహంలేదు. సరదా లేదు. మనోవ్యాధితో బాధపడుతున్నట్టు. తన ఉద్యోగం ఆయన కిష్టం లేదేమో!

మంచంమీద అతని ప్రక్కనే కూర్చుని మృదువుగా వీపు నిమిరి, "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది. "మనసుని ఏదో దొలచివేస్తున్నది. చెప్పరూ?" అంది ముందుకు వంగి, గోముగా.

మల్లె సువాసనలో ఉక్కిరి బిక్కిరి అయి, ఆమెను హృదయంమీదకు లాక్కున్నాడు. కాని యింతలోనే దిగులు అతనిని మింగేసింది. పది నిమిషాలు బ్రతిమాలించుకొని—"ఎల్లుండి తమ్ముడి పెళ్ళట" అన్నాడు ఎటో చూస్తూ. "మీకెలా తెలిసింది?" అని ఆమె అడగలేదు. "రక్షించింది" అనుకొని నిట్టూర్చాడు శేఖర్.

ఆమె ఏమీ అనలేదు. ఆమె మొగంలో దరహాసం తొలగిపోలేదు. మరికొంత ధైర్యం తెచ్చుకున్నాడు శేఖర్.

"నువ్వు అన్నట్టు లంచంతో హృదయ పరివర్తన సాధించలేకపోయాం. డబ్బు ఓడిన చోట ప్రేమ గెలువవచ్చు...." అన్నాడు నమ్మకంగా.

అతని మనస్తాపం గ్రహించిందామె. "అంటే—పిలువని పేరంటానికి వెళ్తానంటారు! ప్రేమతో వాళ్ళని మార్చగలమన్న

నమ్మకం మీకుంటే యింత ఆలోచన దేనికి? వెళ్ళండి. కాని నాకు దక్షయజ్ఞం కథ జ్ఞాపకం వస్తోంది" అంది స్నేహ మధురస్వరంతో.

ఆమె అంత సులభంగా ఒప్పుకుంటుంది—అనుకోలేదు శేఖర్. చిన్న పిల్లాడిలా తొందర పడిపోయాడు. "ఇప్పుడు వెళ్తున్నది మగవాడు!" అన్నాడు ధీమాగా.

"పార్వతి స్త్రీ గనుకనే భర్తకు జరిగిన అవమానాన్ని సహించలేక తండ్రిని ఎదిరించింది. మరి మీ రేం చేసుకువస్తారో చూస్తానుగా" నవ్వేసింది పద్మ.

ఆమెను హత్తుకొని "మై స్వీట్ గాళ్" అన్నాడు శేఖర్.

* * *

"ఏ ముఖం పెట్టుకు వచ్చా డీ భ్రష్టుడు? పొమ్మను" భార్యను హుంకరించాడు రామ్మూర్తి. గుమ్మంలోనే ఆగిపోయాడు శేఖర్.

ఇంట్లో—పెళ్ళికి వచ్చిన చాలా కొత్త మొగాలు కనిపించాయి. అందరూ వింతగా చూస్తున్నారు. కొందరు గుసగుస లాడుతున్నారు.

"వెళ్ళు నాయనా! రసాభాసు చేయకు" కన్నీళ్ళతో వేడుకొంది కన్నతల్లి!

గలాభా విని గదిలోనుండి బయటకు వచ్చిన పెళ్ళికొడుకు గుమ్మంలో అన్నను చూచి, పాముని చూచినట్టు హడావుడిగా లోనికి పోయాడు....కన్నీళ్ళు బలవంతంగా అపుకొని, గుండె చేతో నొక్కుకుంటూ భారంగా కదిలాడు శేఖర్.

దొడ్డి గుమ్మంలోంచి బయటపడి, అన్నను వెంబడించి వీధి మలుపు తిరిగాక అతనిని ఆపింది సుమిత్ర. ఆమె బలవంతంమీద అతడు అక్కడే వున్న లాడ్జిలో మకాం పెట్టాడు. వీలున్నప్పుడల్లా సుమిత్ర అతనిని కలుసుకొని విశేషాలు చెప్పేది.

వివాహం అయ్యాక స్వీట్లు తీసుకొని వచ్చింది సుమిత్ర.

మూడు రోజులుగా కుక్కిన పేనులా, తేలుకుట్టిన దొంగలా, లాడ్జిలో వుంటున్న శేఖర్‌కి చెల్లి చెప్పిన విషయాలు మరింత క్లేశాన్ని కలిగించాయి. ఇంట్లో అందరూ అతనిని తిడుతున్నారట. ఈ అనాచారపు కొంపలోనికి తమ పిల్లను పంపమనీ, అల్లుడు యిల్లరికం వస్తేగాని వివాహానికి అంగీకరించమనీ, అప్పుడైనా సగం కట్నమే యిస్తామనీ వియ్యాలవారు నానా భీభత్సం చేసారట. తమ్ముడు పూర్తిగా వాళ్ళ పక్షమే మాట్లాడడం మొదలుపెట్టాడట.

"ఇల్లరికం వస్తే ఉద్యోగం ఇప్పిస్తానని మామగారు చిన్నన్నను వశపరచుకున్నారులే.... ఛీఛీ....ఏం మనుష్యులో" ఆవేశంగా అంది సుమిత్ర.

"నా వల్లనే కదా మన కుటుంబాని కింత అవమానం!" కుమిలిపోయాడు శేఖర్.

"ఛీ! ఆడదానిలా ఏడుస్తావేం అన్నయ్యా! నీకు నచ్చిన పిల్లను నువ్వు చేసుకున్నావ్. నీ తప్పేం వుంది. వివాహం అయిపోయింది. బంధువులంతా వెళ్ళిపోయారు. కనుక ఇప్పుడు నువ్వు యింటికి వచ్చేయ్! నాన్నని కడిగేయ్! పరాయివాళ్ళతో చేరి మానవత్వం మరిచి తాను కూడా నీ నెత్తిన రాళ్ళు రువ్వుతున్నాడు! చిన్నన్నకు ఎంత నిక్కు పెరిగిందను కున్నావ్?" ఉక్రోషం అంతా ఒలకబోసింది సుమిత్ర.

నోట్లో నాలుక లేని తన చెల్లి సుమిత్రేనా యీమె? అని ఆశ్చర్యపోయాడు శేఖర్.

"ఒదిన మంచిదేనా అన్నయ్యా? ఒకసారి ఆమెను చూడాలని ఉంది."

"మీ వదిన దేవతమ్మా! ఆమెను చూస్తే—మనవాళ్ళే—అనుకుంటావ్. నా కోసం శాఖాహారిగా మారిపోయింది. నా కోసం ఏదైనా చేస్తుంది....నిన్ను తప్పక ఆదరిస్తుంది.... సెలవుల్లో ఒకసారి రా. కాని నాన్నకు తెలిస్తే ....అన్నట్టు నాన్న మరో రెండు నెల్లలో రిటైర్ అవుతారు కాబోలు. తమ్ముడు యిల్లరికం వెళ్ళిపోతే కుటుంబం ఎలా గడుస్తుంది?...." అతని కళ్ళు మళ్ళీ నిండిపోయాయి.

"నీతో తెగతెంపులు చేసుకున్న కుటుంబం గురించి నీ కెందు కన్నయ్యా యీ దిగులు!"

"పైకి కరకుగా వున్నారు గాని నాన్నకు మాత్రం బాధ లేదా?"

"ఆపాటి సహృదయత నాన్నకుంటే ఎంత బాగుండును! నాన్నకు నువ్వు అక్కర్లేదుగాని, నెల నెలా నీవు పంపే డబ్బు మాత్రం కావాలి!"

శేఖర్—సుమిత్ర కోరినట్టు — యింటికి వెళ్లనూ లేదు. నాన్నను కటిగివేయనూ లేదు. ....ఆ రాత్రే ఊరికి వెళ్ళిపోయాడు.

* * *

6 నెలలు గడిచాయి.

బ్యాంక్‌లో పని పూర్తి చేసి బయటకు వస్తున్న శేఖర్ ఎదురుగా పద్మను చూచి తొట్రుపడ్డాడు. మొగం మాడిపోయింది. లేని నవ్వు తెచ్చుకొని "ఏమిటిలా హఠాత్తుగా వూడిపడ్డావ్! ఆరోగ్యం బాగుందా?.... ఒక్కదానివే వచ్చావా?...."

హఠాత్తుగా మాట పడిపోయినట్టు ఆగిపోయాడు శేఖర్, ఇక ప్రశ్నలు లేక! అన్ని ప్రశ్నలకూ ఒకే సమాధానం. "పార్కుకు పదండి."

పార్కులో కూర్చున్నారు. ఆమె ఏమీ మాట్లాడలేదు. అతడు నిశ్శబ్దాన్ని భరించలేకపోతున్నాడు. తలవంచుకొని "రెండు నెలలుగా మీకు డబ్బు పంపలేక పోయాను" అన్నాడు.

"డబ్బుకోసం వచ్చాననుకున్నారా?"

ఆమె మొగం చూసాడు. తడబడ్డాడు. తల వంచుకున్నాడు. ఆమె మరి మాట్లాడలేదు. "ఎందుకు వచ్చావ్?" అని అడగలేక పోతున్నాడు. ఉత్కంఠ భరించనూ లేకపోతున్నాడు. "మాట్లాడు...." అన్నాడు పిరికిగా.

"మీరు కావాలనే బదిలీ చేయించుకున్నారు కదూ?" మొదటి బాణం!

"మనకోసం అద్దెయిల్లు చూడకుండా, మీ వాళ్ళ యింట్లోనే వుంటున్నారు కదూ!" రెండో బాణం!

"నన్ను .... ఒదిలేసారా? ...." మూడో బాణం!

ఇక తట్టుకోలేకపోయాడు. శేఖర్.

"ఛీ! ఏడవకండి అసహ్యంగా....ధైర్యంగా చెప్పండి....నన్నేం చేస్తారు?—నన్నేం చేయమంటారు?"

అది పార్కు కాబట్టి భోరున ఏడ్వలేకపోయాడు శేఖర్! చేతిరుమాలు అందించింది ఆమె. నిశ్శబ్దంగా జారుతున్న కన్నీళ్లు ఒత్తుకున్నాడు.

"రేపు....రేపు....చెబుతా...." అన్నాడు తడుముకుంటూ.

"సరే! రేపు బ్యాంకి సెలవు కదా! 10 గం॥కు ఈ యింటికి రండి" ఎడ్రస్ వ్రాసి వున్న కాగితం అతని చేతిలో పెట్టి లేచిందామె. విస విస నడిచిపోతున్న ఆమెను భీత హరిణంలా చూస్తూ నిట్టూర్చాడు శేఖర్.

* * *

వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న రామ్మూర్తి పంతులు—తమ యిల్లు వెదుక్కుంటూ వచ్చిన మహాలక్ష్మిలా గుమ్మం వద్ద నిలచిన ఆమెను చూచి—"ఎవరమ్మా? ఏం కావాలి?....లోపలికి రా!" అన్నాడు ఆప్యాయంగా.

వంటగదిలో నడుము వాల్చిన కామాక్షమ్మ "ఎవరూ?" అంటూ ముందు గదిలోనికి వచ్చింది. చేతిలోని నవల కుర్చీలో పడేసి సుమిత్ర కూడా లోనికి వచ్చింది.

ఆమె సంకయిస్తూ లోనికి వచ్చి అందర్నీ పరిశీలనగా చూస్తూ ఉండిపోయింది.

"అలా కుర్చీలో కూర్చో అమ్మాయీ! ఎవరు కావాలి?"

ఆమె పొందికగా కూర్చుంది. ఆ వినయమూ, వందనమూ కామాక్షమ్మకు నచ్చాయి.

"నేను మీ పెద్దబ్బాయి కోసం వచ్చాను" అంది దిక్కులు చూస్తూ.

"అయ్యో! వాడీ ఉదయమే పని ఉందంటూ ఊరెళ్ళాడు....ఇంతకూ నీవు వాళ్ళ బ్యాంకిలో పని చేస్తున్నావా?"

"మాది ఈ ఊరు కాదు లెండి."

"ఎవరు నువ్వు? వాడితో ఏమిటి పని?"

"నేను...."

"నీవు!"

"మీ పెద్దకోడల్ని!"

అదిరిపడి లేచాడు రామ్మూర్తి. ఆమె కూడా లేచి నిలబడింది.

ఒక క్షణం నోట మాట రాలేదు రామ్మూర్తికి.

తరువాత "ఛో బయటికి!" గర్జించాడు.

ఆమె కదలలేదు. అదర లేదు, బెదర లేదు. "మా వారు నాతో మాట్లాడడానికి వస్తానని రాలేదు" అంది నిశ్చలంగా.

"మంచిపని చేసాడు....వాడింట్లో లేడంటున్నాను కదా. ఛో! సుమిత్రా! ఆ కుర్చీ అక్కడ నుండి తీసేసి, శుద్ధి చేసి, ఎండలో పెట్టు.... తరువాత స్నానం చెయ్" ఆర్భాటంగా అన్నాడు.

అతని అరుపులు విని దారిన పోతున్న వాళ్ళు కూడా ఆగి చోద్యం చూస్తున్నారు. జనాలు గుమ్మంలో గుమిగూడడం చూచి ఢదేల్‌మని తలుపులు మూసేసాడు, రామ్మూర్తి.

తలుపులు మూసేస్తే పరువు నిలబడుతుంది కాబోలు—నవ్వుకుంది సుమిత్ర. గుండెలో మంట రేపినట్టుంది అతనికి.

"ఏమేయ్! కుర్చీ తీసేయమంటూంటే నీ క్కాదూ?" మళ్ళా అరిచాడు.

అంతవరకూ నిలచివున్న పద్మ తాపీగా కుర్చీలో కూర్చుంది!

"ఒసేవ్....ఒసేవ్... పొమ్మంటూంటే నీక్కాదూ?" ఉధృతంగా ఆమె మీదకు వెళ్ళబోయి హఠాత్తుగా ఆగిపోయాడు రామ్మూర్తి.

"చూడండీ! నాగరిక లక్షణం కాదు.... మీరు కాసేపు నిదానిస్తే సమస్యను సౌమ్యంగా పరిష్కరించుకుందాం!"

"అఘోరించు!"

"నిన్న మీ అబ్బాయిని అడిగిన ప్రశ్నలే అడుగుతున్నా....నన్ను ఏం చేయదలుచుకున్నారు?"

గది ఆ మూల నుండి ఈ మూలకు పచార్లు చేస్తున్న రామ్మూర్తి ఆగి "వాడు నిన్ను ఒదిలేసాడు. సమాధానం దొరికింది కదా. ఇక ఛో" అన్నాడు....పిడుగు లాంటిది—అనుకున్న ఆ వార్త ఆమెమీద ఏ ప్రభావమూ చూపలేదు. ఆశ్చర్యపోయాడు రామ్మూర్తి. బొనులే! వీళ్ళకు ఒక మొగుడయితే కదా! అని ఈసడించుకున్నాడు.

ఆమె నవ్వింది!

కళ్ళు నులుముకొని మరీ చూచాడు రామ్మూర్తి. అవును ఆమె నవ్వుతోంది. "మొగుడు వదిలేస్తే నవ్వు వస్తోందా?" అని రుసరుసలాడిపోయాడు రామ్మూర్తి!

"మీరు ఏమీ తెలియని అమాయకులో, అన్నీ తెలిసిన మోసగాళ్ళో అర్థం కావడం లేదు!" అంది నవ్వుతూ.

ఉగ్రుడైపోయాడు రామ్మూర్తి. తాను మోసగాడా!!

పట్టరాని దురాగ్రహంతో "ఏం కూసావ్?" గర్జిస్తూ వెళ్ళి ఆమె జుత్తు దొరక బుచ్చుకున్నాడు.

సుమిత్ర వద్దు వద్దని వారిస్తూనే వుంది. కామాక్షమ్మకు భర్త ఆగడం తెలిసిందే. ఇలాంటి సందర్భాలలో ఆమెకు మౌనమే శరణ్యం! అయితే ఈసారి భర్త సాహసం ఆమెకు దిగ్భ్రమ కలిగించింది.

"ఒదలండి!" సింగిలా గర్జించింది పద్మ.

అప్పటికి.కాస్త స్పృహ కలిగింది అతనికి. షాక్ తిన్నట్టు ఆమెను ఒదిలేసి కాస్త దూరంగా నిలచి మైలపడిపోయిన చేతుల్ని విదుపుకోవడం మొదలుపెట్టాడు. చేతుల్ని నరుక్కుందామా అన్నంత ఆవేశం కలిగింది అతనిలో. కాని స్వంత చేతులు కదా! "ఛీఛీ వెధవ రొష్టు వెధవ సంత!" అంటూ నోటికి లైసెన్సు యిచ్చేసి యధాలాపంగా ఆమెవైపు చూచాడు. అంతే!

నిప్పులు చెరుగుతున్న ఆ కళ్లను చూడలేక—అంత ఉగ్ర నరసింహమూర్తి తల వంచి, కుర్చీలో కూలబడ్డాడు!

"రామ్మూర్తిగారూ! మీ ఆర్భాటానికి అదిరిపోడానికి నేను మీ అబ్బాయిని కాను! కోడల్ని!

ఈ క్షణంలో మిమ్మల్ని అరెస్టు చేయించ గలను! తలుపు తెరిచి చూడండి. బయట పోలీస్ ఇన్‌స్పెక్టర్ వున్నాడు—అంతా గమ నిస్తూ! కాని పశువుల పట్ల కూడా మానవత్వం ప్రదర్శించడం నా తత్వం. మిమ్మల్ని అరెస్టు చేయించను లెండి. ఇక నోరు మూసుకొని నేను చెప్పేది వినండి...." అపర చండికలా గర్జించిం దామె.

నోరు తెరచి ఊరుకున్నాడు రామ్మూర్తి, బోనులో సింహంలా! అతని అవస్త చూచి కామాక్షమ్మ నోరు నొక్కుకుంటే వెంటనే వదినకు థాంక్స్ చెప్పా లనిపించింది సుమిత్రకు!

కోపాన్ని అదుపులో పెట్టుకొని, సాధ్యమై నంత సౌమ్యంగా "మాది గుళ్ళో పెళ్ళి అయితే, మాంగల్యాన్ని తెంపివేసి—నీ వెవరో నాకు తెలియదు. పో—అనగల సమ ర్ధులే మీరు! కాని మాది రిజిస్టర్ పెళ్ళి! 'వది లేసాడు'—అన్నంత తేలికగా ఈ బంధం పోదు. అర్ధరూపాయి మోసాన్నే సహించని నేను—నా జీవితాన్నే దోపిడీ చేసిన వ్యక్తిని తేలికగా వదిలిపెడతానని ఎలా అనుకున్నారో ఆయన! నేను కూర్చుంటేనే మీ కుర్చీ మైల పడినట్టు ఆర్భాటం చేస్తున్నారే! మీ అబ్బాయి నా కులంవల్ల సంపాదించుకున్న ఉద్యోగం మైలపడిపోలేదా? ఆ ఉద్యోగం యిచ్చే జీతం అంటరానిది కాదా? జీతంమీద యిన్ని పసుపు నీళ్ళు చల్లి శుద్ధిచేసి వాడుకుంటున్నారు కాబోలు! నా మీద కూడా అట్లానే పసుపునీళ్ళు చల్లి నన్ను మీలో చేర్చుకోరేం? మాలో మలినం లేదు రామ్మూర్తిగారూ! మీ మనసులోనే వుంది మలినం అంతా! ముందు మీ బుద్ధిని శుద్ధి చేసు కోండి...."

ఆగి కాసేపు సుమిత్రమీద దృష్టి నిలి పింది పద్మ. కళ్ళతోనే నవ్వి థాంక్స్ చెప్పింది సుమిత్ర.

దృష్టి మరల్చుకొని "పొమ్మంటే, చూరు పట్టుకొని వేలాడేదాన్ని కాను! నిన్ననే ఆయన ఆలా చెప్పి వున్నట్టయితే యిప్పుడు మీ యింటికి వచ్చేదాన్నే కాను. అలా చెప్పడానికి ఆయనకి ధైర్యం చాలలేదు. ఇప్పుడుకూడా ఇంట్లో లేకుండా పారిపోయారు. సరే. ఆయన వచ్చాక ఒక విషయం చెప్పండి. వదిలేసాను—అని నోటి మాటగా అంటే కుదరదు. కోర్టుద్వారా విడాకులు యివ్వాలి. ఆయన అందుకు సుముఖంగా లేకపోతే—మోసం చేసారని నేనే కోర్టుకెక్కి విడాకులు పొందుతా. విడిపోయాక నేను చేయబోయే పని కూడా చెబుతున్నా. ఖాయమైంది కాబట్టి తన ఉద్యోగం ఎవరూ పీకేయలేరు—అని ఆయనా, మీరూ అనుకుంటున్నారు కాబోలు. నా కులంతో వచ్చిన ఉద్యోగం నా కులంతోనే పోవాలి. అది న్యాయం. ఆ న్యాయం సాధించడానికి నే నెంత దూరం అయినా వెళ్తా. ఆ విషయం గుర్తుం చుకోమని ఆయనతో చెప్పండి. ఆకలి కడుపు లతో—కులాలన్నీ ఒకటే అని ఆదర్శాలు వల్లించి, ఆకలి తీరగానే—మీరు వేరు; అసింటా....అసింటా....—అనే శుంఠలకూ, తల్లిదండ్రులకు భయపడి భార్యల్ని వదిలేసే పిరికిపందలకూ, కుహనా సంస్కారులకూ తగిన పాఠం నేర్పుతా....ఈ ప్రయత్నంలో నేను నాశనం అయినా సరే....ఊబిలో దిగబడి పోకుండా వేలాది నా సోదరీమణులను రక్షిస్తా...." సర్వ మాలిన్యాలనూ శుద్ధిచేసే అగ్నిశిఖలా జ్వలిస్తూ—తలుపులు తెరచుకొని ధీర లలితంగా ముందడుగు వేసింది పద్మ.

రామ్మూర్తి పంతులు యింకా చేతులు విదుపుకుంటూనే వున్నాడు!

తూరుపుదారి



కొసారపు సంజీవ్

ఠంగ్! ఠంగ్! ఠంగ్!!

ఎక్కడో మూడు గంటలు కొట్టిన శబ్దం.

వరండాలోంచి వస్తోన్న లైట్ వెలుగు సన్నగా ప్రసరిస్తోంది, సెల్‌లోకి.

టక్! టక్! టక్! టక్!

సెంట్రీ బూట్ల చప్పుడు, ఆగి ఆగి లయ బద్ధంగా.

ఆ గదిముందే ఆగాడు సెంట్రీ. గదిలోకి చూశాడు.

చువ్వల వెనుక....

గోడ నానుకొని కూర్చున్నాడతను, వేమన శంగిమలో.

"ఏంవిటి రాంబాబూ! ఇంకా నిద్రపోలేదా!!" జాలిగా అంటున్నాడు సెంట్రీ అతడ్నే నిశితంగా

చూస్తూ.

మౌనం! మందహాసం!! (అది సమాధానం) ముందుకు సాగిపోయాడు సెంట్రీ ఏదో గొణుగుతూ.

లేచి నిలబడ్డాడతను, నిదరలో అలసిన మృగరాజు మేల్కొని చురుకుగా జూలు విదిల్చినట్టు.

చువ్వల్ని పట్టుకొని బైటకు చూశాడు.

దూరంగా సాగిన అతడి దృష్టిలో....

నిర్మలంగా ఆకాశం నల్లపైట కప్పుకున్న పుని స్త్రీలా!!

నిశిధంలో నక్షత్రాలు ఆమె సిగలో పెట్టిన మల్లెపూల్లా!!!

హుం! (భారంగా ఒక నిట్టూర్పు.)

రేపటినుంచి

ఈ ఆకాశం తనకి కనిపించదు!

ఈ చుక్కల సంగీతం వినిపించదు!!

ఈ చువ్వల చప్పుడు ధ్వనియించదు!!!

అవును.

తను రేపు ఈ జైలు గదిలోంచి బైటకు వెళ్తాడు.

తన్ను రేపు ఈ ఖైదునుంచి శాశ్వతంగా విడుదల చేస్తారు.

వ్వి—డు—ద—ల (ఖని)+(ఒక నిర్వికార నవ్వు.)

....రేపు!

ప్రభాత సమయం!

ఉషస్సు తొంగిచూసే వేళ!

ఉరికంబం ముందు తాను....

ఉరిత్రాడులో బిగిసిన తాను....

పైకి—క్రిందకీ— చేదబడీ—లాగబడీ—గుంజబడీ—

ఊపిరి అరుదై

శ్వాస కరువై....తర్వాత క్షణంలో

తను ఛస్తాడు.

తాను మరణిస్తాడు.

(తననిఉరి తీసినట్టు పత్రికల్లో వస్తుందా? ఏమో?)

ళ ళ ళ

తెల్లని మల్లెపూవులా

కదిలే పావురంలా

వచ్చినవాడు క్రైస్తవ ఫాదర్!

భూలోకంలో దేవుని ఏజంట్!!

రాంబాబు అతడి వంక చూశాడు, తీక్షణంగా, అసహ్యంగా.

"............" ఏదో చెబ్తూనే ఉన్నాడు ఫాదర్.

బోర్! బోర్!! బోర్‌బోర్!!!

చూపుడు వ్రేలుతో దారి చూపిస్తూ

"గెటవుట్!

నాకు ఏ దేవుడి గోలా వద్దు. ఊ! నీవు త్వరగా వెళ్తేనే నా ఆత్మ శాంతిస్తుంది. అయ్ సె గెట్టవుట్!"—రాంబాబు గొంతులో కాఠిన్యం.

పాపం!

తెల్లపావురం తెల్లబోయింది.

బయటకు వెళ్ళబోయింది.

మళ్ళీ, "బిడ్డా! చావు ఎప్పుడో తెలుసు నీకు: అందుకే బ్రతుకుపై మమకారం చావక క్షోభిస్తున్నావు. నీ కెలాగూ చావు తప్పదు గనక ఆ దేవదేవుడిని మన ప్రభువుని స్మరించుకో. నీకు 'శాంతి' లభి...."

రాంబాబు పళ్ళు పటపట మన్న చప్పుడు, స్పష్టంగా, గట్టిగా.

ఫాదర్ హడలిపోయాడు.

హడావిడిగ వెడలిపోయాడు....

రాంబాబు తృప్తిగ నవ్వుకున్నాడు.

('శాంతిని' పారద్రోలినందుకు)

అతడి నిళ్ళతో క్షణమాత్రపు సంతృప్తి.

కాని

ఆ కళ్ళ రెప్పల క్రింద....

గత స్మృతుల వేదన!

మరపురాని జ్ఞాపకాల రోదన

అసంకల్పితంగా అతడి మనసు గతాన్ని చూస్తోంది.

(గతం అతడి ముందు నిలిచి పరిహాసం చేస్తున్నట్టు కణతలు రుద్దుకుంటున్నాడు, బాధగా....)

ళ ళ ళ



అహా! మీరిపుడు రాస్తున్న సీరియల్ నవల్లో ఆఖరుకి హీరోయిన్ చచ్చిపోదా.. రచయిత్రిగారూ!!

"దొరా!"

జీరవోయిన కంఠాన్ని పెగుల్చుకొని భయం భయంగా. అతడు పాలేరు వెంకన్న. ఎంకటిగాడు.

(ఫాదర్ ఆఫ్ రాంబాబు)

విలాసంగా చుట్ట (సిగార్) పీలుస్తున్నాడు దొరగారు, కులాసాగ పేపర్ తిరగేస్తూ. పాలేరు పిలుపు విని కాస్త ఓరగా చూశాడు. ఎముకలు కూర్చిన శరీరాన్ని, అవతారాన్ని చూడలేక, తల త్రిప్పి పేపర్ పైపు దృష్టి సారించాడు.

ఎంకన్న గొంతు తడారినట్లయ్యింది. క్షణ కాలం ఎటూ పాలుపోలేదు. ఎలాగో వాల్యూం పెంచి మళ్ళీ పిల్చాడు—"దొరా!"

దొర ఇటు చూడకుండానే "ఊఁ!" అన్నాడు దర్పంగా. (అమ్మయ్య! దొర వింటున్నాడని తెలిసింది, ఎంకన్నకి.)

మొదలెట్టాడు.

"నీ బాంచెన్ దొర! కాల్మొక్త!! మా రాముడుగాడు, అదే నా కొడుకుండ్రి! మీ దయవలన (?) పదోకళాసు (పదవ తరగతి) కామ్యాప్ (పాస్) అయినాడుండ్రి—" తర్వాత ఎలా చెప్పాలో తోచక ఆగాడు.

"అచ్ఛా" కొంచం చిత్రంగా అన్నాడు దొర.

"మరి....మరండ్రి....సో ఫాల పంతుల్లు (స్కూల్ టీచర్స్) 'మీ రాములుగాడు భగ్గ (చాలా) తెల్విగల్లోడు, ఎట్లగయినా అన్ని పెద్ద సదువుల పెట్టాలె' అని చెపుతున్నారుండ్రి! మా కులపోల్లకి సదువుకుందుక్కు- బట్ట, పొట్ట అన్ని గూడ సర్కారోళ్ళు జూత్తరు. 'నువు తోలితె జాలు, గంతె' అంటున్నారుండ్రి మా కున్న పెద్ద దిక్కు మీరే గదండ్రి బాంచన్....గందుకనే...." గొణిగాడేదో!

దొరగారు చూస్తున్న పేపర్‌ని పక్కనే ఉన్న 'టపాయ్' మీద పెట్టారు. అది కాస్త గాలికి లేస్తూ క్రింద పడటానికి తయారుగా వుంది—ఎంకన్న ప్రాణం అచ్చం అలాగే వుంది.

"ఎంకటిగా!" దర్పం.

"బాంఛెన్" అణకువ.

"పదో తరగతంటె ఎట్లనో గెంటిచ్చుండు గాని, పై చదువులంటే మాటలట్రా!? అయినా చదువుకున్నోళ్ళు ఏం జేస్తున్నర్రా! నౌఖర్లు దొరక్క రోడ్లపొంట తిరుగుతున్నరు! చదువు గిదువు బంద్ చేసి ఏన్నో లెక్కలు చూసే పనిలో పెట్టు. ఎరికైందా!?" అది సలహా కాదు—

అక్షరాలా ఆజ్ఞ.

మాట పూర్తి చేసి లోపలికెళ్ళాడు దొర.

నిరాశగా వెనక్కి తిరిగాడు ఎంకన్న "ఆని నసీబ్ (ఖర్మ) ఎట్ల ఉన్నదో!?" అను కొంటూ.

క క క

"అయ్యా! రాములన్న కారటు (కార్డు) రాసిండె" పదిహేనేళ్ళ లక్ష్మి పరిగెత్తుతూ వచ్చింది చేతిలో ఉత్తరంతో, సంబరంగా.

అన్నదగ్గర నేర్చుకొన్న అక్షరపుముక్కలు పేర్చి, లక్ష్మి ఆ ఉత్తరాన్ని చదువుతుంటె ఏనుగెక్కినట్లు ఫీలయ్యాడు ఎంకన్న.

తాను బస్తీలో ఎలా గడుపుతున్నదీ, కాలేజి ఎలా ఉందీ, పంతుల్ల గురించీ, అన్నీ వివరంగా రాశాడు రాంబాబు (రాములు). (అతడి గుండెలో అనురాగ విపంచిక, తృప్తి భావ వీచిక.)

ఎంకన్న తృప్తిగా 'తాగాడు', ఆ రోజు.

క క క

"ఎంఖటిగా!"

అది దొరగారి 'పిలుపు'

"బాంచెన్ దొరా!"

ఎంకన్నకి అలవాటైన 'పదం'.

(పరుగున వెళ్ళి దొరముందు నిల్చున్నాడు, చేతులు కట్టుకొని).

"ఊఁ! ఏందిరో!? మీ రాములుగాన్ని చదువుకు తోల్నవట?"

(దొరగారి కంఠంలో ఆపుకొంటున్న ఆవేశం, స్పష్టంగా) ఎంకన్నకి మాట పెగల్లేదు. తలొంచుకొని అన్నాడు, మెల్లిగా

"బాంచన్."

"ఊఁ! నీ యిష్టం, నీ కొడుకూ, నీ యవ్వారం."

క క క

రాజు తల్చుకొంటె కొదవుండదు, దెబ్బలకి!

దొర తల్చుకొంటె కొరవుండదు, తప్పులకి!

చేయని నేరాలకి శిక్ష అనుభవించడం ఈ వ్యవస్థలో అత్యంత సర్వసాధారణ విషయం. అందులో న్యాయం అంటేనే 'తానైన' దొరగారి దృష్టిలో అతడికి నచ్చనిది ఏదైనా అది అన్యాయమే! శిక్షార్హమే!!

ఏ కాన్స్టిట్యూషన్ అడుగెట్టని ఆ దివాణంలో—

ఏ న్యాయశాస్త్రం తలకెక్కని ఆ భూస్వామ్యంలో

ఏ పీనల్‌కోడూ ప్రవేశించని ఆ గ్రామ రాజ్యంలో

కట్టలు తెంచుకొన్న ఆవేశం

హద్దులు పెంచుకొన్న దొరతనం

ఎంకన్నని కట్టెలేపి మరీ కొట్టింది.

ఫలితం!

అతడి పుర్రె పగిలింది. నెత్తురు చిమ్మింది.

కాని

అది 'ఎంకన్నలాంటి' వారికి తరతరాలుగా వాలవాటె

అందుకే అతడు ఎదురు మాట్లాడలేదు(డు).

దివాణంకి పోకుండా ఉండలేదు (డు).

క క క


అది ప్రొద్దుటివేళ. సూర్యుడింకా రాలేదు. కాని అతడి తొలి కిరణాల వర్చస్సు ఆ ఉదయానికి శోభ నిస్తోంది.

ఒక మూల పశువులపేడ తీస్తూ అంటోంది సుంకరిరాజి "అయినా ఈ ఎంకటిగానికి పొగరు గాకపోతె, దొరగారు అదనంగా సుత (సైతం) రాములుగాన్ని సదువుల పెడ్తాడు? దొరంటె గంత ఫికర్ (భయం) లేకుండ వాయిరాది?"

పోశన్న గేదెల్ని విడుస్తున్నవాడల్లా, అటు ఇటు చూసి "ఒసే రాజీ! అసలు సంగతి అది గాదె! ఇంగో మన చిన్నదొర ఏడో తరగతే మూడుసార్లు ఫేలయిండాయె. మరి ఆ రాములు గాడు పదోకిలాసు ఫస్టున కామ్యాప్ అయి పట్నంలో పెద్ద చదువుకోతే దొరకు నామరా కదా? గందుకే ఎంకుమావని దొరగారు....?"

పోశన్న ప్రాణాలు ఒక్కసారి ఆకాశంలోకి వెళ్ళి మళ్ళొచ్చినంత పనైంది, ఎదురుగా వెదురుకర్ర పట్టుకు నిల్చున్న 'చినదొర'ను చూసి.

"లమ్డికొడుక! నువ్విక్కడ ఏం జేతున్నవా? బాత్కాని కొడ్తున్నావా?....చెప్పవేంరా గాడ్దికొడుకా!"



'చినదొర అచ్చంగా దొర కొడుకే' అనుకొంది దూరంగా నిల్చుని వణకిపోతున్న సుంకరిరాజి.

'వెదురుకర్ర' పైకి క్రిందకు లేస్తోంది.

క క క

దొడ్డిలో ఎవరో ఎవర్నో కొడ్తున్న శబ్దం విని అటువైపు తొంగి చూసిన దొరగారు తన కొడుకు (చినదొర) చేతిలో చావు దెబ్బలు తింటోన్న 'పోశిగాన్ని' చూసి చూడనట్టే ముందుకు సాగిపోయాడు.

క క క

"లక్ష్మి"

ఎంకన్న కూతురు.

రాంబాబు చెల్లెలు.

పోశిగాని కాబోయే పెళ్ళాం.

అంతకు మించి 'అందరి దృష్టి'లో

'చక్కని చుక్క!

వెన్నెల ముక్క!!'

(అలాంటి అందం కొందరికే ఉంటుంది. అయితే ఉన్నవారికి అన్నీ అందమే. అందమూ అందమే. కాని ఈ పేదపిల్లకు ఆ అందం శాపమేనేమో?)

తండ్రికి జ్వరం.

బావకి దెబ్బల బాధ.

అయినా సరే, దివాణం పని తప్పకూడదు. అందుకే ఆ 'డ్యూటి' లక్ష్మి చేయడానికి దివాణంలోకి రాక తప్పలేదు.

బితుకు బితుకుమంటున్న గుండెతో

దడ దడ లాడుతోన్న మనసుతో

సన సన్నగ వణుకుతున్న శరీరంతో

అటు ఇటు బెరుకు చూపులతో

దివాణంలోకి....

మెల్లగ మెల్ల మెల్లగా....

"ఎవతివే?" చినదొర గొంతు! లక్ష్మికి ఝల్లుమంది.

"నేను........ఎంకన్న........బిడ్డన్ దొరా!" భయంగా.

"ఊఁ! ఏం సంగతి, మీ అయ్య రాలేదా?" కరుగ్గా.

"మా అయ్యకు ప్రాణం మంచిగ లేదుండ్రి. గందుకె నన్ను తోలిండు, పని చేయటానికి...."

"అహఁ! అట్లనా? అదుగో ఆ దొడ్డిలో కెళ్ళు!" గబ గబ గబా నడిచింది లక్ష్మి అటు వైపు.

"బంఫత్! పోరి మా సక్కగుంది" చిన్న దొర కళ్ళలో కోరిక ఇంతై....ఇంతింతై....

అయి....అయి....

ఇటు ఇటూ చూశాడు

సంధ్య వాలిపోతున్న

....సూర్యుడు "అక్రమాన్ని" చూసి

ఆవేశం పట్టలేక

ఎర్రగా....

మండే అగ్నిలా

తర్వాత ?

(ఏం చేయలేక, అక్కడి ఘోరం చూడ లేక కొండల చాటుకి దాక్కున్నాడు. సూర్యుడు పిరికిగా పారిపోవటంతో చీకటి లోకాన్ని ఆదర బాదరగా ఆక్రమించుకొంది.)

రా రా రా

"అందుకే, నీ లాంటి అహింసావాదులు తొలగిపోతేగాని ఈ లోకంలో మార్పు రాదు" మిత్రుని గుర్రుగా చూస్తూ, సత్యం.

రాంబాబు నవ్వాడు.

"నీ పిచ్చిగాని సత్యం! కేవలం భూస్వాముల్ని ఖతం చేసినంత మాత్రాన ఈ వ్యవస్థ మారుతుందా? అధికార, ధన మదంతో వాళ్ళు అక్రమాలు చేస్తే, మనం కూడా అదే దారిన నడిచి, వాళ్ళని హతమారిస్తే వాళ్ళకీ మనకీ తేడా ఏమిటి? తుపాకితో కాదోయ్, వాళ్ళను సంస్కరించడంతో సమ సమాజం రావాలి. అప్పుడే జాతి పురోగమిస్తుంది."

"బావ్‌రె! సంస్కరణం, సమ సమాజం, శాంతి, జాతి, హుఁ! నీలాటి మితవాదులు ఉండబట్టి ఈ వ్యవస్థ ఇలా ఏడ్చింది ప్చ్! నువ్వింకా చాలా నేర్చుకోవాలోయ్ రాంబాబూ!"

అంతలోనే—"రాములూ" అనే పిలుపు!

రాంబాబు ఛటుక్కున లేచాడు, ఆత్రంగా. అలా పిల్చేవారు తన ఊరివాళ్లై వుంటారు గనుక.

తలుపు దగ్గర దిగులుగా పోశిగాడు!

(పోశన్న. పాలేరు పోశన్న. తన బావ. కాబోయే లక్ష్మి భర్త.)

"నువ్వా పోశం బావా?" రాంబాబులో ఆశ్చర్యం.

"అవున్రా రాములూ! నేను దొర దగ్గరుండలేక దేశం పోతున్నా. దొర క్కాళ్ళకాడ కుక్క బతుకు బతికేకంటే, అక్కడ అడుక్కుతిన్నది నొక్కం."

పోశన్న గుండెలో నైరాశ్యం—కళ్ళలో కన్నీరు.

రాంబాబు పోశన్ననే విస్తుపోయి చూస్తున్నాడు.

"అప్టరాల్ పాలేరు పోశం బావకు, దొరకాన్నుంచి పారిపొయ్యే ధైర్యం ఎక్కన్నించి వచ్చింది? చదువుకొంటున్న తనే దొరంటే వణకిపోతాడే?"

"పోతాన్రా" దిగులుగా వెనక్కి తిరిగాడు పోశన్న.

"ఏడికి బోతావ్ బావా? అసలు ఇంటికాడ చెప్పే-ఈడికి వచ్చినవా? అయ్య ఏమన్నడు" రాంబాబులో ఆత్రం.

"చెప్పే వచ్చిన్రా! మీ అయ్య నిన్నోసారి అర్జంట్‌గ రమ్మనడు. అది చెప్పోదమనే వచ్చిన" ఆగకుండా గబ గబ వెళ్ళిపోయాడు పోశన్న.

రాంబాబు ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది.

రా రా రా

దుమ్ము రేపుకొంటూ ఆగింది బస్సు.

గబ గబా దిగి....

అడ్డ దారిన....

తన పల్లె వైపు....

చక చకా, ఎంతో ఉత్సాహంగా, మరెంతో ఆత్రంగా....ఎడతెగని ఆలోచనలతో—

"ఏమైంది? పోశంబావ ఎందు కెళ్ళిపోయాడు? అసలు తన్ని అయ్య ఎందుకంత అర్జెంటుగా రమ్మన్నాడు?"

ప్రశ్నలు! ఆలోచనలు!!

ఎక్స్‌ప్రెస్‌లా ఆగకుండా!

ఎలాస్టిక్‌లా తెగకుండా!!

చీకటి ముసురుకుంది.


ఏడుగంటలకే నిద్రపోయింది పల్లె.

(ఏం చేస్తుంది. చలికాలం మహత్యం.)

గబ గబా ఇంటిదారి.

గుడిసెలో చీకటి

ఇంకా దీపం వెలిగించలేమిటబ్బా!?



ఇంత త్వరగా నిద్రపోయుంటారా!

గుడిసె తలుపులు తోసి లోపలి కెళ్ళాడు, చీకట్లో తడుముకుంటూ.

"లక్ష్మి" పిల్చాడు.

సమాధానం రాలేదు.

అగ్గిపెట్టె ఎక్కడ!? తెలిసిన జాగాలో, చీకట్లోనే వెదికాయి చేతులు.

అమ్మయ్య దొరికింది.

అగ్గిపుల్ల వెలిగింది

ఛుప్! ఛుప్!!

అగ్గిపుల్ల వెలుగుని లాంతరు అందుకొంది.

చీకటి విచ్చింది!

వెలుగు వచ్చింది!!

కళ్ళు వెలుగుకి అలవాటు పడ్డాయి!

చుట్టూ చూశాడు....

గుండె గుభిల్లుమని....

ఒళ్ళు జల్లుమని....

మెరుపులు మెరిసినట్లై....

పిడుగులు ఉరిమినట్లై....

ఉప్పెన ఉబికినట్లై

—"లక్ష్మి!"

అది పిలుపు కాదు.

గుండెల్ని చీల్చుకొచ్చిన అరుపు.

పల్లెని నిద్ర లేపిన భీకర శంఖానాదం.

సందడి. కోలాహలం. అయోమయం. గంద్రగోళం.

అక్కడికి ఉరికి వచ్చిన పల్లె ఉలిక్కి పడింది, కన్పించిన ఘోరదృశ్యం చూసి.

....దూలానికి వ్రేలాడ్తూ

జీవితాన్ని వదిలేసి

లక్ష్మి!

....గుండె పగిలి

ఆగి....

ఎంకన్న!!

ఆ రెండు చావులకి అర్థం, పల్లెలో అందరికి తెల్సిన సత్యం!

* * *

చితి మంటలు

ప్రక్క ప్రక్కనే చిటపట మంటున్నాయి!

గుండె మంటలు

గుప్పు గుప్పున భగ భగమంటున్నాయి!!

జ్వాలలు రాంబాబు మొఖంపై పారాడుతున్నాయి. ఎండిన కన్నీటి దారలు ప్రజ్వరిల్లే మంటలకి అడ్డం పడుతున్నాయ్!

అర్ధరాత్రి!!!

రెండు చావుల్ని కళ్ళారా చూసిన ఊరు అంత త్వరగా నిద్రపోలేక—చలిమంటల ప్రక్కన గుసగుస లాడుతోంది.

రాంబాబు ఒంటరిగా కదిలాడు స్మశానం లోంచి. అతడి కళ్ళలో ఇప్పుడు 'ఏదో' నిశ్చయం కనిపిస్తోంది.

ముందుకు....

ముందు ముందుకు....

మును ముందుకు....

(దొరగారి దివాణంవైపు)

పగ పాములా బుసలు కొడుతోంది.

ఆవేశం ఆరని జ్వాలై రగులుకొంటోంది.

కసి కత్తిని చేతబట్టి ఉరికింది.

ఫలితం!?

ప్రతీకారం తీరింది.

(దొరగా రింట్లో ఆరోజు 'కొన్ని ప్రాణాలు' రాంబాబు కత్తికి ఆకాశానికి ఎగిరాయి)

అప్పుడు, రాంబాబు 'వి చి త్ర ం' గా నవ్వాడు(ట!) కత్తికి ఎర్రగా అంటుకొన్న 'ఎర్రని' రక్తాన్ని చూసి!

గ గ గ

మన దేశంలో ఒకా నొక న్యాయ స్థానంలో....

వినిపిస్తోంది—"కాబట్టీ....రాంబాబు అనే ఈ ముద్దాయికి సాక్ష్యాధారాలు విచారించి, అతడ్ని హంతకుడిగా నిర్ణయించి....చట్టం ప్రకారం (?) ఉరిశిక్ష (ఇది హత్య కాదుట) విధించడమైనది....!"

ఇది జడ్జీ 'న్యాయమూర్తి'గారి తీర్పు!

"అమ్మయ్య! ఊహించిన తీర్పు!" కొందరు పెద్దమనుషులు హాయిగా ఊపిరి పీల్చు కొన్నారు.

(కొందరు కుర్రాళ్ళు పాపం! ఏవో కేకలు వేసి, పోలీసులతో తన్నులు తిన్నట్టు తెలిసింది. పిచ్చోళ్ళు!)

టక్! టక్! టక్! ట్టక్!

బూట్ల చప్పుడికి తృళ్ళిపడి చూశాడు రాంబాబు.

తెల తెల్లవారుతోంది. జ్ఞాపకాలు వదిలిపెట్టి పోయాయి.

ప్రారంభమైంది, హడావిడి.

మరో గంటలో చట్టప్రకారం 'హత్య' చేస్తారు.

పదిమంది 'పెద్దల' సమక్షంలో 'ఉరి' తీసి, చంపుతారు.

నవ్వుకొన్నాడు రాంబాబు.

తతంగమంతా పూర్తయింది.

గద్దె....

వేదిక....

బలిపీఠం....

ఉరికంబం....

ముఖంపై నిండుగ నల్లగుడ్డ.

చీకటి.

కళ్ళు తెరిచినా—మూసినా

చీకటే!

కళ్ళముందు నల్లటి బట్ట, వెలుగు చూడనీ కుండా....

"దేవుణ్ని నమ్మడట. దైవ ప్రార్థనకు ఒప్పుకోలేదు...." ఎవరో ఎవర్తోనో అంటు న్నారు.

చీకటి! చీకటి!!

ఏమీ కన్పించడంలేదు.

బహుశః తల్లి గర్భం నుంచి వచ్చేప్పుడు కూడా ఇలాగే చీకటిగా ఉంటుందేమో? ఏమో!? హుఁ! (పెదవిపై ఓ మందహాసం.)

మరణానికి ముందు జననం గురించి ఆలోచన!

చావు పుట్టుకలకు ఎంతటి వ్యత్యాసం!

చావు పుట్టుకలకు ఎంతటి సామీప్యం!!

(అధికారులు చేస్తున్న హంగామా చెవులకి సోకుతోంది.)

మెడలో 'ఉరితాడు' బిగించారు. ఎవరో అధికారి ఏమో ఆర్డర్స్ జారీ చేస్తున్నాడు. బహుశః రెడీ వన్ టూ త్రీ అంటున్నాడేమో? ఏమో కావచ్చు!!

ఉరితాడు కంఠానికి కరుకుగా తగుల్తుంటే రాంబాబు అనుకొంటున్నాడు "మళ్ళీ జన్మంటూ ఉంటే.మళ్ళీ ఈ ఉరితాడు తప్పదు" అని. □

సరికొత్త సైంటిఫిక్, రొమాంటిక్ సీరియస్ సీరియల్



దేశం

ఆగస్టు ఆరవ తారీకు రాత్రి హాయిగా నిద్ర పోయింది అవినాష్ ఒక్కడే. హాయిగా నిశ్చిం తగా నిద్రపోయేడు.

చాలు....

ఈ చంద్రుడి గొడవతో ప్రజల దృష్టి అటు మళ్ళుతుంది. ప్రళయం పేరిట భయంలో—రాజకీయాలపట్ల అసక్తి తగ్గుతుంది. ప్రళయం వస్తుందా రాదా అన్నది వేరే సంగతి. వచ్చినా రాకపోయినా అంతపెద్ద ప్రమాదమేమీ లేదు. రాజకీయాల్లో ప్రతిక్షణమూ ప్రళయమే. ఎవడు ఏ క్షణం పార్టీ మార్చేస్తాడో తెలియదు. దక్షిణాదివాడు ప్రధాని కావాలని ఒకవైపు గొడవ. పార్టీ రెండుగా చీలిపోయే ప్రమాదం ఒకవైపు. అన్నిటికన్నా పెద్ద ప్రమాదం—

తమ పార్టీ పదవిలోకి వచ్చేక దేశపు కరెన్సీ విలువ ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రోజు రోజుకీ పడిపోతూంది; ఏదో అద్భుతం జరిగితే తప్ప దేశాన్ని ఎవరూ రక్షించలేరు. ఇప్పటి వరకూ దేశం నాశనమైపోతుందని బాధ. ఇప్పుడు మనతోపాటూ అందరూ పోతున్నారన్న తృప్తి.

ఇంతలో ఫోను.

సెక్రటరీ. ప్రధాని వస్తున్నారని వార్త.

మరుసటి నిముషంలో జగదీష్ హడావుడిగా ప్రవేశించేడు. "రండి మనం అర్జంటుగా ప్రెసిడెంట్ దగ్గరికి వెళ్ళాలి."

"ఎందుకు?"

"దార్లో మాట్లాడుకుందాం."

ఆతడి మొహం చూసి ఏదో ఉపద్రవం జరిగి వుంటుందనుకొన్నాడు అవినాష్.

ఇద్దరూ కార్లో కూర్చొన్నాక కారు కదిలింది. లోపల ట్రాన్సిస్టర్ వినిపిస్తూంది.

—ఒక ముఖ్యప్రకటన. ఆగస్టు పదిహేడున జరగబోయే ప్రమాదాన్ని వూహించుకొని ఇప్పట్నుంచే భీతి చెందవద్దని ప్రజల్ని ప్రధాన మంత్రి కోరేరు. తమతమ పనని విడిచి పెట్టి, ఈ ఆలోచనతో మరింత కల్లోలాన్ని సృష్టించవద్దని హెచ్చరిస్తున్నారు బి. బీ. సీ.

రేడియో కేంద్రం. ఇప్పట్నుంచీ ప్రతి మూడు గంటల కొకసారి....

టప్‌మన్న చప్పుడుతో ఆగిపోయింది రేడియో.

ఇద్దరూ మొహమొహాలు చూసుకొన్నారు.

"ఏమైంది?"

ఏమవుతుంది?

చాలా చిన్నవిషయం.

రేడియో స్టేషన్‌లో డ్యూటీ ఆఫీసర్‌కి ఆరుగురు పిల్లలు. అతడు గోవాకి చెందినవాడు. రేడియోలో ఈ వార్త వస్తూండగా అతడికి అకస్మాత్తుగా తన పిల్లల్ని చూడాలని బుద్ధిపుట్టింది. క్షణాల్లో ఆ కోర్కె బలీయమైంది.

దేనికోసం ఈ విధినిర్వాహణని నమ్ముకొని వుండాలి? వెళ్ళిపోతే?

....ఉద్యోగం పోతుంది. అంతేగా.

ప్రాణమే పోయేటప్పుడు ఉద్యోగం పోతే మాత్రమేం? అతడి కళ్ళముందు ఆరేళ్ళ చిన్న కూతురు జాలిగా మొహంపెట్టి 'రావా నాన్నా' అంటున్నట్టు అనిపించింది.

వెంటనే అతడో నిర్ణయానికొచ్చినట్టు రిసీవర్ మెయిన్ స్విచ్ ఆఫ్‌చేసి బైటకొచ్చేసేడు.

ఆ క్షణం నుంచీ రేడియో ప్రసారాలు ఆగిపోయాయి.

జగదీష్ ఆందోళనగా అవినాష్ వైపు చూసేడు. అతడు తల పంకించేడు.

ఇద్దరిమధ్యా మౌనం రాజ్యమేలింది.

జరుగుతున్నది చూస్తూ జరగబోయేది వూహించుకోగలరు వాళ్ళు.

నిజానికి జగదీష్ భార్య కూడా ఈ చివరి రోజుల్లో తమవాళ్ళతో పల్లెలో గడపాలని కోరింది. కానీ 'ఏమీ జరక్కపోతే' ఆ తర్వాత ప్రతిపక్షాల హేళనకు గురి కావల్సి వస్తుందని భయపడ్డాడు.

"ప్రాణమే పోతున్నప్పుడు ఎందుకీ పదవి?" అని అడిగిందామె.

నిజమే. పేరుకి ప్రధానమంత్రి. కానీ బ్యాంకులో ఐదువేలకన్నా ఎక్కువలేదు. నెల రోజుల క్రితం తన భార్య దక్షిణభారతదేశపు కంచిపట్టుచీర అడిగితే, తను పొదుపు గురించి ఉపన్యాసం ఇవ్వడం జ్ఞాపకం వచ్చింది. ప్రధానమంత్రిగా రిటైరయ్యాక వచ్చే నెలసరి ఆదాయం కూడా పెద్ద ఎక్కువేమీ కాదు.

ఏ బ్యాంకైనా ప్రధానమంత్రికి పెర్సనల్ లోన్ యివ్వటానికి వెనుదీయదు. ఉవ్విళ్ళూరుతుంది కూడా. కానీ తీర్చటం? (కావాలనుకుంటే తీర్చనక్కర్లేదు కూడా. అది వేరే సంగతి) చచ్చినా తను అలా చేయలేడు.

ఆలోచన మళ్ళీ చావు దగ్గరకి వచ్చేసరికి అతడు కొద్దిగా కదిలేడు.

చేతికి పక్కనేవున్న పేపర్లు తగిలినయ్.

కారు వెళ్తూనే వుంది.

అతడు చదవసాగేడు.

పేపర్లు రకరకాలుగా వార్తల్ని ప్రచురించినయ్. రేపట్నుంచి ఆ పేపర్లు కూడా రావేమో. ప్రపంచం స్తంభించిపోవటం అంటే అదే.

"ఆయుర్దాయం ఇక ఐదు రోజులే" అన్న హెడ్డింగ్‌తో వార్త పెద్దపెద్ద అక్షరాల్లో పడింది. దానిక్రింద "ఢిల్లీలో అధికారుల సమావేశం" అని వుంది.

అతడికి నవ్వొచ్చింది.

ప్రపంచ ప్రళయాన్ని ఆపటానికి ఢిల్లీలో అధికారులు ఏం చెయ్యగలరు?

ప్రతీ చిన్న విషయాన్నీ గోరాంతలు కొండంతలు చేసి సర్క్యులేషన్ పెంచుకొనే ఒక తెలుగు దినపత్రిక ప్రళయం గురించి రకరకాల వార్తలతో పేపరంతా నింపింది. విచిత్రమైన హెడ్డింగులు....దానికింద చిత్రమైన వార్తలు.

భగవంతుడే శరణ్యం

—రోజులు గడిచేకొద్దీ మృత్యువు ముంచుకొస్తున్నదని ప్రజలు గజగజ వణికిపోతున్నారు. అయోమయస్థితి పెరుగుతున్నది. గుండెబలం లేనివాళ్ళు రోజూ చస్తూ బ్రతుకుతున్నారు.

ఇంకోచోట ఇంకో వార్త.



రామనామ తారకం

—ఈ రోజునుంచీ అయిదు రోజులపాటూ రామనామాన్ని జపించిన వాళ్ళని ఆ నక్షత్రం ఏమీ చేయదని భగవతార్ చెప్పారు. పూనాకు చెందిన ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త ఎ.యు.ఐ.యస్. అన్న అక్షరాలు తమ పేర్లో వుంటే మరణం తప్పదని పేర్కొన్నారు.

ప్రధానికి నవ్వొచ్చింది. పైన్నాల్గు అక్షరాలో యేదో ఒకటి లేకుండా ఎలా వుంటుంది? అయినా ఈ పత్రికలకి బుద్ధిలేదు. ప్రజలు అసలే భయభ్రాంతుల్తో వుంటే ఈ వార్తలేమిటి?

వీళ్ళ మొరాలిటీ ఏమైంది?

అసలు తనే తప్పుచేసేడు. పదిరోజుల క్రితమే ఆర్డినెన్సుద్వారా ఈ పత్రికల్ని కంట్రోలు చెయ్యవలసింది.

ఇప్పుడనుకొని ఏం లాభం?

జగదీష్ చాలా వర్రీడ్‌గా—ఆందోళనగా కనిపిస్తున్నాడు.

వాళ్ళు ప్రెసిడెంట్ నివాస స్థలానికి చేరుకొనేసరికి ఎనిమిదయింది. అప్పటికే అక్కడ మిగతావాళ్ళున్నారు. అయిదు ఏరియాల లెఫ్టినెంట్ జనరల్స్ (ఆర్మీ), చీఫ్ ఆఫ్ ది నావల్ స్టాఫ్, మార్షల్ ఆఫ్‌ది ఎయిర్‌ఫోర్స్—అందరికంటె పైన—సుప్రీమ్ కమేండర్ ఆఫ్ ది ఆర్మ్‌డ్ ఫోర్సెస్ — ది ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా. వీళ్ళు చేరుకోగానే సమావేశం మొదలైంది. సమస్య చాలా చిన్నది. కానీ ఫలితాలు ఊహించలేనటువంటివి.

సైన్యంలో చాలామంది తమతమ ఇళ్ళకు వెళ్ళిపోవాలనుకుంటున్నారు. అదీ సమస్య.

ఈ పదిరోజులూ తమ తమ భార్యా పిల్లల్తో గడిపి—చావును సకుటుంబంగా ఆహ్వానించాలనుకుంటున్నారు.

ఆ హాల్లోవున్న వారందరి మొహాలూ గంభీరంగా వున్నాయి. చాలాసేపు ఎవరి ఆలోచనలో వాళ్ళుండి ఎవరూ మాట్లాడలేదు. సైనికులు క్రమశిక్షణకి అలవాటు పడినవారు కాబట్టి, దేశంపట్ల భక్తి వున్నవారు కాబట్టి—తమ కోర్కెని పై అధికారులకి విన్నవించుకున్నారు. కొన్ని దేశాల్లో అప్పుడే సైన్యంలో అలజడి మొదలవటం—చాలా మంది 'కనబడకుండా' పోవటం జరిగింది.

చర్చ చాలాసేపు జరిగింది.

ఈ ముందు పదిరోజులూ ఎలా వుంటుందో తెలీదు. ఎప్పుడు ఎవరి అవసరం వస్తుందో తెలీదు. అలా అని సైన్యాన్ని 'బలవంతంగా' ఆపలేం.... మొత్తానికి ఓ నిర్ణయం జరిగింది.

క్లాస్ వన్ లెవెల్ నుంచీ పైనవున్న అధికారులు మాత్రం వుండాలి-మిగతావారు ఆగస్టు పన్నెండు నుంచీ వెళ్ళిపోవచ్చు.

రాత్రి పదింటికి సమావేశం ముగిసింది.

ఇక్కడ ఇది ముగుస్తున్న సమయంలో....

ప్రపంచం

లిబియా రాజధాని ట్రిపోలీలో ఒక రహస్య, సమావేశం జరిగింది. ఇరాన్, సిరియా యమెన్, సూడాన్, జోర్డాన్ ప్రధానమంత్రులు అందులో పాల్గొన్నారు.

ఇంతమంది ఒకచోట కూడేరంటే, దానికి గమ్యం ఒక్కటే. ఇస్రేల్.

"జెరూసలేం" అంటే "శాంతి నిలయం" అని అర్థం. కానీ అదేం చిత్రమో? ఆ నగరంలో 'శాంతి' అన్న పేరే వినబడదు. క్రీస్తుశకం డెభ్భైలో రోమను దానిని సర్వనాశనం చేసేరు. దాదాపు పదిలక్షలమంది యూదుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేరు. మూడంతస్తుల భవనాల మీదనుంచి పసిపిల్లల్ని రోడ్లమీదకు విసిరేసేరు. జెరూసలేంలోకి యూదుల ప్రవేశం నిషేధించబడింది.

ఇది జరిగిన పంతొమ్మిదివందల సంవత్సరాల తర్వాత ఇస్రేల్‌కి విముక్తి లభించింది. ఈ మధ్యకాలంలో ఆ నగరం నలభై ఆరు దండయాత్రలకి గురి అయింది.

ప్రవక్త మహమ్మద్ స్వర్గానికి వెళ్ళింది ఇక్కణ్నుంచేనని మహమ్మదీయుల నమ్మకం. మక్కామదీనాల తర్వాత ముస్లిమ్‌లకు ఇదే పవిత్రస్థలం. అయితే క్రీస్తుని శిలువ వేసింది కూడా ఇక్కడే. అందుకు క్రైస్తవులకి యిది "దేవుడు తన పేరు వ్రాసిన నగరం" అయింది.

1948 లో బ్రిటీషు వలస రాజ్యం నుంచి ఇస్రేల్ స్వాతంత్ర్యాన్ని పొందిన కొన్ని గంటల్లోనే చుట్టూవున్న ఎనిమిది అరబ్బు రాజ్యాలు మూకుమ్మడిగా దండెత్తి దాన్ని నామరూపాలు లేకుండా చెయ్యాలని చూసి, ఓడిపోయాయి.

యూదుల గుడి-ముస్లిమ్‌ల మసీదూవున్న 'డూమ్ ఆఫ్ ది రాక్' భూమ్మీద మనుష్యులున్నంతవరకూ సమస్యగానే వుంటుందని మేధావుల అంచనా....

* * *

కమేండర్ ఇన్ చీఫ్—సూడాన్ "ఈ ఆఖరి రోజుల్లో జెరూసలేంని జయించకపోతే దేవుడు క్షమించడ"ని అన్నాడు. ఈజిప్ట్ ప్రెసిడెంట్ ఒకే ఒక మాట అన్నాడు. "ఇస్రేల్‌ని సముద్రంలోకి తోసెయ్యాలి. త్రో ఇట్ ఇన్ టు ది సీ...."

అందరూ హర్షధ్వానాలు చేసేరు.

అయిదునిముషాల అనంతరం ఒక తీర్మానం చెయ్యబడింది.


"ప్రపంచపు ఆఖరిరోజుని 'సెలబ్రేట్' చేసుకోవటానికి మేమంతా జెరూసలేంలో కల్సుకొంటాం—అని ప్రతిజ్ఞ చేస్తున్నాం. జెరూసలేంని దక్కించుకోవటానికీ, మా పవిత్ర స్థలాన్ని ఆఖరి రోజుల్లో మా అధీనంలో ఉంచుకోవటానికి ప్రాణాలైనా అర్పిస్తాం. యుద్ధాన్ని ప్రకటిస్తున్నాం."

ప్రతి ఒక్కరూ ప్రమాణం చేసేరు.

ప్రపంచపు రాజకీయాలు ఇలా మారుతూ వుంటే, ఇంకోవైపు సాంఘికమైన మార్పు యింకోలా వుంది. మత్తుమందు మనిషిని మానసికంగా బలహీనుణ్ణి చేస్తుంది. అమెరికాలో దాదాపు కోటిన్నర జనాభా, ముందు అలవాటు పడినవారున్నారని అంచనా. ప్రపంచం అంతమవబోతూందనగానే అది మూడుకోట్లకి పెరిగింది. మార్జువానా, హెరాయిన్‌ల ధర రెండంతలైంత.

చావుభయాన్ని మత్తులో పోగొట్టుకోవటం మనిషికి సులభంగా కనిపించింది.

భూమి పేలిపోయినా, పర్వతాల ఉపరిభాగం సురక్షితం అనే నమ్మకాన్ని కొంత



మంది శాస్త్రజ్ఞులు వ్యక్తం చేసేరు. ఆ మాటల మీద నమ్మకం వున్నవాళ్ళు పదిరోజులకి సరిపడా ఆహారపదార్థాల్ని మూటకట్టుకొని కాంచనగంగ, మకాలూ, మౌంట్‌బ్లాంక్, ఆల్ప్స్ పర్వతాల మీదకు వెళ్ళిపోయేరు. అయితే, ప్రపంచంతో ఎత్తయిన ఈ పర్వతాలు ఆ తర్వాత రెండురోజుల్లోనే పేలిపోయేయి. వెళ్ళినవాళ్ళు సజీవసమాధి అయిపోయేరు.... నిశ్శబ్దంగా—మిగతా ప్రపంచానికి గుర్తులు కూడా మిగల్చకుండా....

ఆగస్టు పన్నెండు

ప్రొఫెసర్ ఆనందమార్గం తన యింట్లో-గదిలో కూర్చుని వున్నాడు. అతడి ముందు కప్పులో టీ డికాషన్ వుంది. అది చల్లారిపోయి రెండు గంటలయింది. దాన్ని గురించి పట్టించుకోకుండా ఆలోచిస్తున్నాడు. దాదాపు డెభ్భైరెండు గంటల్నుంచీ ఒకటే ఆలోచన.

పదిహేడో తారీఖు పదకొండు గంటలా పన్నెండు నిముషాలకు మూడు సెకన్లపాటు భూమిని ఆ నక్షత్ర ఆకర్షణ నుంచి తప్పించటం ఎలా?

ప్రొఫెసర్ ముందో కాగితం వుంది. దాన్నే చాలాసేపటినుంచీ పరీక్షిస్తున్నాడు.

ఇంతలో తలుపు చప్పుడైంది.

రమణ!

"ఆఫీసు కెళ్ళలేదా?" అడిగేడు.

రమణ క్షణం విస్తుపోయి సర్దుకొన్నాడు. మతిలేని ప్రొఫెసరు తన పేరుని మాటిమాటికీ సార్థకం చేసుకొంటూ వుంటాడు.

"మీరు బైటకొచ్చి ఎన్ని రోజులైంది?"

"నాల్గు రోజులు. ఇప్పుడే బైటకి వెళ్దామనుకొంటున్నాను. ఇంట్లో ఏమీ లేవు."

"బైట కూడా ఏమీ దొరకవు" అన్నాడు రమణ. "ఒకసారి బయిటకొచ్చి చూడండి. అంతా స్మశానం—స్మశానంలా వుంది."

ప్రొఫెసర్ ఒక్క క్షణం మాట్లాడలేదు. రమణే అన్నాడు "మా నాన్న చివరి రోజులు కాశీలో గడపాలన్నాడు. ప్రయత్నిస్తే రైళ్ళు నడవటం మానేసి రెండ్రోజు లయిందని తెలిసింది."

"మొత్తం అంతా స్థంభించిపోయిందన్నమాట!"

"అంతా కాదు—" రమణ కంఠంలో

గంభీరత చోటు చేసుకుంది. "మనిషిలో రాక్షసత్వం పురులు విప్పుకొంటూంది."

"అంటే—"

"అందమైన ఆడవాళ్ళున్న ఇళ్ళలోకి జొరబడి గూండాలు మానభంగాలు చేస్తున్నారు. ఆహారపదార్థాల్ని దోచుకొంటున్నారు. అడ్డుకొనేవారు లేకపోవటంతో పైశాచికత్వం విజృంభించింది. చావెలాగూ తప్పదని తెలిసిన మనిషి అన్నిటికీ తెగించేడు. ఈ చీకట్లో చిన్న వెలుగు రేఖ ఒకటే. పాపభీతితో డబ్బున్నవాళ్ళు చేస్తున్న సంతర్పణలు—"

"పాప భీతా?"

"అవును" అన్నాడు రమణ. "చాలా విషయాల్ని బైటపెడుతుందది. పాపం ఒక శ్రేష్ఠిగారు, ఎన్ని తరాల్నుంచి సంపాదించిన పాపపు డబ్బుని బంగారంగా మార్చుకొని దాచుకున్నాడో—తన మూడో అంతస్తు మీదకి ఎక్కి నాణేల్ని వెదజల్లి పిచ్చివాడై పోయేడు."

"ప్రళయం తప్పదనే నమ్మకం అంత బలంగా ఏర్పడిందా అందరికీ?"

"మామూలుగా అయితే నమ్మకమూ, అపనమ్మకాల మధ్య కొట్టుమిట్టాడేవారు. కానీ యిప్పుడు ప్రత్యక్షంగా భూమి బీటలువారటం కనిపిస్తూనే వుంటే—ఇంక తమ నెవరూ రక్షించలేరనే నమ్మకం ప్రబలుతోంది."

ప్రొఫెసరు వులిక్కిపడి, "భూమి బీటలు వారుతోందా?" అని అడిగేడు.

రమణకి విసుగేసింది. "ఒకసారి బైటకు రాకూడదూ?" అన్నాడు. "జరుగుతున్న విధ్వంసకాండ కళ్ళారా చూడొచ్చు."

"లేదు లేదు. ఇక్కడే వుండాలి. ఏదయినా చెయ్యాలి. ఏదయినా ఆలోచించాలి. ఏదయినా చేసి ప్రపంచాన్ని రక్షించాలి."

రమణ జాలిగా ఆ మతిలేని ప్రొఫెసర్‌కేసి చూసేడు. ప్రళయకాలపు ఝంఝామారుతంలా దూసుకు వస్తున్న నక్షత్రాల్ని ఈ అల్పజీవి ఎలా ఆపుతాడు?

లేచి "వెళ్ళొస్తాను" అన్నాడు.

"అప్పుడేనా?" అన్నాడు.

"వంతుల ప్రకారం కాపలా కాస్తున్నాం."

ప్రొఫెసర్ ఆశ్చర్యంగా "ఎందుకు?" అన్నాడు.

"ఎందుకా—" పేలవంగా నవ్వేడు రమణ. "ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా స్తంభించి పోయినందుకు. ప్రజల్ని ప్రజలే రక్షించుకోవలసి వచ్చినందుకు."

ప్రొఫెసర్ లేచి, "ఇక్కడే ఇలా వుంటే మిగతా దేశాల్లో ఎలా వుంది? దౌర్జన్య ప్రవృత్తి ఎక్కువ వున్న పాశ్చాత్య దేశాల్లో ఎలా వుంది?"

"తెలీదు."

"ఏం?"

"రేడియో స్టేషన్లు పనిచెయ్యటం మానేసి రెండ్రోజులయింది."

ప్రొఫెసరు నిశ్చేష్టుడయ్యాడు.

"వెళ్ళొస్తాను" అన్నాడు రమణ.

ప్రొఫెసర్ మాట్లాడలేదు.

రమణ లేచి బైటకొస్తూ తలుపు బలంగా వేసి, ముందుకు నడిచేడు. లోపల ప్రొఫెసర్ తిరిగి కాగితాలు పరిశీలించసాగేడు.

తలుపు బలంగా వేసినప్పుడు ఆటోమేటిక్ లాక్ పడిపోయిందని బైట రమణకిగానీ, లోపలున్న ప్రొఫెసర్‌కిగానీ తెలీదు.

II

ఆ రోజు బాగా చీకటి పడ్డాక పెద్ద పెద్ద చప్పుళ్ళు వినబడ్డాయి. ఇళ్ళల్లో తలుపులు బిగించుకొని కూర్చున్న వాళ్ళంతా హాహాకారాలు చేస్తూ బైటకొచ్చేరు. అంతకుముందు కన్నా ఎక్కువగా భూమి బీటలు వారుతోంది. ఫెళ ఫెళా చప్పుళ్ళు చేస్తూ, రెండుగా విడిపోతూంది. ఆ ప్రదేశంలో వున్న ఇళ్ళూ, చెట్లూ భూస్థాపితం అయిపోతున్నాయి. రోదనలు....అరుపులు....ఇంకా అయిదు రోజుల తర్వాత రావల్సిన ప్రళయం ఆరోజే వచ్చినట్లుంది.

దాదాపు పది సెకండ్ల తరువాత అంతా సద్దుమణిగింది.

పదకొండు గంటలా రెండు నిమిషాలైంది.

నిన్నటి రోజూ అదే సమయానికి.

అగస్టు పదిహేడు అదే సమయానికి.

ఈ రోజునుంచీ ప్రతిరోజూ అదే సమయానికి.

అయితే బీభత్సానికి చెదరనివాళ్ళు ఆ పల్లె ప్రజలే. స్వామివారు ఆ ఒక్క పల్లెనీ రక్షిస్తానని మాట యిచ్చేరు. ప్రార్థనలు నిర్విరామంగా జరుగుతున్నాయి.

రాజయ్య కూడా వెళ్ళి తృణమో పణమో అర్పించుకొన్నాడు.

వస్తూంటే చీకట్లో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకొంటూ వుండటం కనిపించింది. ఒకడు భూషణం, ఇంకొకరు ప్రెసిడెంటు. మాటల్లో తన పేరు వినపించటం చూసి అతడు చీకట్లో ఆగేడు. చెట్టుచాటున వున్న అతణ్ని గమనించనివాళ్ళు అతడి గురించి మాట్లాడుకొంటున్నారు.

"రంగారావు ఆపుచేస్తడంట - రాజయ్య పొలం మన స్వాధీనమవకుండా."

"అంత పెద్దోడయిండా రంగరావు?"

"ఎట్టయినా మనమీద దెబ్బ కొట్టాలని సూస్తున్నాడు" అన్నాడు భూషణం.

"అణ్ణి జూసుకొనేనా యీ రాజయ్యగాడు ఇన్ని కబుళ్లు చెప్తున్నడు?"

భూషణం మాట్లాడలేదు.

"సరె-అయితే ఆడేం సేస్తడో-ఏం సెయ్యగలడో సూద్దాం. ఆడి కళ్ళముందరే ఆ రాజయ్యగాణ్ని సెట్టుకట్టి నిప్పెడ్తే....? ఆడేం సేస్తాడో...."

వింటూన్న రాజయ్య వణికిపోయేడు. రెండు ఏనుగులు ఢీకొంటే మధ్య నలిగిన కుందేలులా వణికిపోయేడు.

పరుగెత్తేడు. ఆక్కుండా పరుగెత్తి పరుగెత్తి రంగారావు దగ్గరకు చేరుకొన్నాడు. వగరుస్తూ విషయం అంతా చెప్పేడు. అంతా విని మీసం తిప్పుతూ, "అంత ధైర్యం వుందటరా వాళ్ళకి" అన్నాడు రంగారావు.

రాజయ్యకి భయంతో మాట రావటంలేదు.

"సరే-నేను చూసుకుంటాలే ఆళ్ళ సంగతి"

దూరం నుంచి "మముబ్రోవరా" అని భక్తులు ముక్తకంఠంతో పాడుతున్నారు.

అక్కడ స్వామివారు శేషశయనం మీద విష్ణుమూర్తిలా పడుకొని వున్నారు. అక్కడున్నవారి చేతులకు తాయెత్తులు కట్టబడి వున్నాయి: పూజలు జరుగుతున్నాయి.

డాక్టరు మెట్లుదిగి వస్తూంటే రంగారావు కనపడి నమస్కారం చేశాడు.

"ఎక్కడికో వెళుతున్నట్టున్నారే" అని అడిగేడు ఇంటిముందున్న స్కూటర్‌ని చూస్తూ.

"వెళ్ళిపోతున్నాను రంగయ్యా. ఈ ఆఖరి అయిదు రోజులూ పట్నంలో గడుపుదామని" అన్నాడు డాక్టర్.

"అదేమిటి బాబూ-ఈ పల్లెలో వుండాలనీ ఈ పల్లెకు రావాలనీ అందరూ కోరుకొంటూ వుంటే మీరు వెళ్ళిపోతున్నారే"

"ఈ పల్లెకా?" అర్థంకాక అడిగేడు.

"మొత్తం ప్రపంచం అంతా నాశనం అయిపోద్ది. ఈ పల్లె ఒక్కటే మిగులుద్ది. ఈ తాయెత్తు కట్టుకున్నోళ్ళే బతుకుతారు."

డాక్టరుకి అతణ్ణి చూస్తే జాలేసింది.

పల్లెని వదిలెళ్తున్న డాక్టర్ని చూస్తే రంగయ్యకి జాలేసింది. అమాయకుణ్ణి చూసి వేదాంతి ఎంత జాలిపడ్తాడో—వేదాంతిని చూసి అమాయకుడూ అంతే జాలిపడ్తాడు. డాక్టర్ మౌనంగా స్కూటర్ స్టార్టు చేశాడు. ఆఖరిసారి. తనింతకాలం వున్న యింటి వయిపు చూసుకున్నాడు. ముందుకు సాగిపోయేడు.

ఊరు దాటుతూంటే గుడి కనిపించింది. స్కూటర్ ఇంజన్ ఆపు చెయ్యకుండానే అలా ఆగి అటు చూసేడు.

బాబావారి చుట్టూచేరి భక్తులు భజనలు చేస్తున్నారు. భక్తిపారవశ్యంతో ఊగిపోతున్నారు. ప్రపంచాన్నీ, ప్రళయాన్నీ జయించిన ఆనందం వాళ్ళ మొహాల్లో కనిపిస్తూంది. అసలు మృత్యువు వాళ్ళ దరి చేరలేదనే నమ్మకంతో—ఆనందంతో వూగిపోతున్నారు.

అతడికో విషయం అర్థమైంది.

అక్కడ బాబా కాదు ముఖ్యం.

నమ్మకం!

అదే వాళ్ళని కోటలా కాపాడుతూంది.

ఐదు రోజులపాటూ వాళ్ళు ఆ నమ్మకంతోనే బ్రతుకుతారు. తరువాత చచ్చిపోతారు. అది వేరే సంగతి. ఈ ఐదు రోజుల సంగతి? తనకున్న మానసిక వ్యథ వాళ్ళకి లేదు. చావు దగ్గరవుతూందన్న చింతలేదు. భక్తి మత్తు వాళ్ళని కాపాడుతూంది. ఆ గొడుగు కింద వాళ్ళు రక్షణ తీసుకొంటున్నారు.

అజ్ఞానం మనిషిని రక్షిస్తుంది.

తను దాన్ని నమ్మలేడు.

నమ్మలేకపోవటం తన కర్మ. నమ్మితే ఎంత బావుణ్ను. నమ్మగలిగితే చాలు. ఇంక ఏ ఘర్షణా వుండదు.

వాళ్ళెంత ఆనందంగా వున్నారు?

తన వాస్తవికతా వాదనతో వాళ్ళ ఆనం దాన్ని ఎందుక్కాదనాలి? అసలు అనటానికి తనకేం హక్కుంది?

అతడు స్కూటర్ మీద సాగిపోయేడు.

ఇంక అయిదు రోజులు....తన ఆనం దాన్నీ విషాదాన్నీ పంచుకోవటానికి తన కెవరూ లేరు. ఈ అయిదు రోజులూ హాయిగా నిశ్చింతగా గడపాలి. ఎలా వస్తుంది నిశ్చింత? ఎలా దొరుకుతుంది ఆనందం? వాటీజ్ ది బెస్ట్ వే ఆఫ్ స్పెండింగ్ ది లాస్ట్ ఫైవ్ డేస్ ఆఫ్ హ్యూమన్ లైఫ్?

అతడు నగరంలో ప్రవేశించేడు. ఆ నగరం నగరంలా లేదు. పాడుపడిన స్మశానంలా వుంది. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. కొన్ని ఇళ్ళు రాత్రి జరిగిన బీభత్సానికి కూలి పోయి వున్నాయి.

అతడొక పెద్ద హోటల్ ముందు ఆగి, లోపలికి ప్రవేశించేడు. కౌంటర్ దగ్గర ఎవరూ లేరు. సర్వర్లూ వెయిటర్లూ కూడా లేరు. తిను బండారాలన్నీ నేలమీద చల్లినట్లున్నాయి. బాగా తిని వదిలేసినట్టున్నారు.

రిసెప్షన్ పక్కనుంచి మెట్లెక్కి రూమ్స్ వైపు వచ్చేడు.

స్టార్ హోటల్ అది.

మొదటి అంతస్తులో ఎయిర్ కండిషను గదులున్నాయి. కరెంట్ పోయినా, ఎవరో జనరేటర్ 'ఆన్' చేసినట్టున్నారు. సన్నగా చప్పుడు వినిపిస్తూంది.

కారిడార్ నిర్మానుష్యంగా వుంది.

రూమ్ నంబర్ నూట ఒకటి దగ్గర నిల బడ్డాడు. నెమ్మదిగా డోర్ నాబ్ తిప్పి తోసేడు: లోపల ఎయిర్ కండిషనర్ పనిచేస్తున్న శబ్దం వినిపిస్తూంది. తలుపు తియ్యగానే చల్లటిగాలి మొహం మీదకు కొట్టింది. సన్నగా వణికేడు. అయితే ఆ వణుకు చల్లగాలివల్ల వచ్చింది కాదు. లోపలి దృశ్యం చూసి.

లోపల డబుల్ కాట్ మీద ఇద్దరు బిచ్చ గాళ్ళు పిల్లల్నేసుకుని కూర్చొనివున్నారు. ఇంకో మూల ఒక కుష్టురోగి భోజనం చేస్తున్నాడు.

అతడు తలుపు తెరవటం చూస్తూనే పక్క మీద కూర్చొన్నవాడు చప్పున లేచి బిగ్గరగా "మేం వెళ్ళం. మేం వెళ్ళం" అని అరిచేడు. యుద్ధానికి సిద్ధపడినవాడిలా వున్నాడు.

డాక్టర్ క్షణంపాటు అలానే నిలబడ్డాడు. నెమ్మదిగా అతడి పెదవుల మీద చిరునవ్వు వెలిసింది. "ఎంజాయ్ ఫ్రెండ్స్. ఎంజాయ్" అని తలుపు దగ్గరగా వేసేడు.


హోటల్ అంతా వెతగ్గా అతనికి అయిదో అంతస్తులో ఒక రూమ్ ఖాళీగా దొరికింది. మళ్ళీ క్రిందకొచ్చేడు. కౌంటర్‌లో వెతికితే ఫ్రిజ్ తాళాలు దొరికినయ్. కిచెన్‌లోకి వెళ్ళి ఫ్రిజ్ డోర్ తెరిచేడు.

పై వరుసలో వుడకబెట్టిన కోడిగుడ్లూ, కోళ్ళూ వున్నాయి. క్రింద వరుసలో బీరు బాటిల్స్ వున్నాయి. అల్మైరా తెరిచేడు. స్కాచ్ దొరికింది.

రెండు స్కాచ్‌లూ, అరడైను బీర్లూ, ఆరు కోళ్ళూ, యాభై గుడ్లూ తీసుకెళ్ళి తన రూమ్ ఫ్రిజ్‌లో పెట్టుకొన్నాడు. తలుపు లోపల తాళం వేసుకొన్నాడు.

కుర్చీలో కూర్చొని ఎదుటి బల్లమీదకు కాళ్ళు తన్నిపెట్టి, బాటిల్ తెరుస్తూ అనుకొ న్నాడు "వెధవ ప్రపంచం—పోనీ .... ఇంకే మయినా అయిపోనీ. కేరేపిన్."

ర ర ర



త్రిపోలీలో అరబ్ దేశాలు ఇజ్రాయెల్ మీద దండెత్తటానికి తీసుకొన్న నిర్ణయం బగ్గింగ్ చేయబడింది.

ఆగస్టు 14 రాత్రి అన్ని వైపుల్నుంచీ ఇజ్రాయెల్‌ని హఠాత్తుగా చుట్టుముట్టాలన్న అరబ్బుల ప్రయత్నం ధారుణంగా ఫెయిలైంది. అంతకు ముందురోజే ఇజ్రేల్ ఎయిర్ ఫోర్సంతా సమీకరింపబడింది. రహస్యంగా సంపాదించిన న్యూక్లియర్ ఆయుధాలు సిద్ధం చెయ్యబడ్డాయి.

అరబ్ దేశాల చేతిలో వున్న నూనె ఆయు ధాన్ని చూసి అంతకాలం ఓపికపట్టిన అమె రికా-ఇంక ఆ అయిదు రోజులకోసం ఇజ్రే యిల్ మీద జరుగుతున్న పోరాటాన్ని సహించ లేక పోయింది.

అమెరికా అకస్మాత్తుగా దండెత్తితే తమ నూనె గనులను పేల్చెయ్యటానికి అరబ్ దేశాలు కొన్ని సంవత్సరాల క్రితమే బాంబు లను తమ గనుల పక్కే అమర్చి వుంచాయి.

మూడు మిలియన్ల ఇజ్రాయేల్ జనాభా యుద్ధానికి ఆయత్తమయింది. మూడు లక్షల మంది సుశిక్షితులైన సైనికులు "క్రీస్తు వస్తూన్న ప్రదేశాన్ని" రక్షించటానికి కంకణం కట్టుకున్నారు:

ఇజ్రాయేల్ స్వంతంగా తయారుచేసుకొన్న "జెరికో" మిస్సైల్స్ మోహరింపబడ్డాయి. కొత్తగా కనుక్కొన్న ఆయుధం "యం. డి. 660-సర్ఫేస్ - టు-సర్ఫేస్ మిస్సైల్స్" సిద్ధ మయ్యేయి. ఐదువేల టాంకులూ, ఆరువందల ఎయిర్ క్రాఫ్టూ సరిహద్దుల్ని రక్షిస్తున్నాయి.

ఈలోపుగా అమెరికన్ ఇంటర్ కాంటి నెంటల్ మిస్సైల్స్ అరబ్ దేశాలవైపుదూసుకు రాసాగేయి. అరబ్ దేశాధినేతలు నూనెగనుల్ని పేల్చి వెయ్యమని ఆర్డర్ ఇచ్చేరు.

ప్రేలుళ్ళు.... పెద్ద పెద్ద ప్రేలుళ్ళు. ఆకా శానికి అంటిన మంటలు. ప్రళయం అప్పుడే వచ్చిందేమో అన్నంతగా మంటలు.

మండిపోతున్న నూనె గనులు.

ఎర్రగా నాలుకలు సాచిన మంటలు.

క్షణంలో ప్రపంచపు నూనె సముద్రం అంతా దగ్ధమైపోయింది. ప్రపంచంలో లభ్య మయ్యే పెట్రోలియంలో డెబ్భై శాతం, ప్రపంచం ఆఖరవటానికి నాలుగు రోజులు ముందుగానే నాశనమయిపోయింది.

ఆగస్టు పధ్నాలుగు

తనగదిలో కూర్చొని వున్నాడు ప్రొఫెసర్. అతడు గుక్కెడు టీ నీళ్ళు త్రాగి అప్పటికి రెండు రోజులయింది. అతడు ఆలోచిస్తున్నది కూడా ఏమీ లేదు. మెదడు ఆలోచించీ ఆలోచించీ శూన్యమైంది.

అతడి గెడ్డం బాగా పెరిగిపోయింది.

తైల సంస్కారం లేక జుట్టు పీచులా తయారయింది. చెంపలు పీక్కుపోయేయి.

కుర్చీలో కూర్చొని, అరచేతుల్లో గెడ్డం వుంచుకొని శూన్యంలోకి చూస్తున్నాడు.

ఒక ఎలుక అతడి కాలిమీదనుంచి దూకి వెళ్ళిపోయింది. పట్టించుకో లేదు. ఇంకో ఎలుక కొద్దిగా ధైర్యంచేసి అతడి బల్ల యెక్కి, ఆర్రోజులక్రితం తిని వదిలేసిన బ్రెడ్ ముక్క అందుకొని పారిపోయింది.

ప్రొఫెసర్ కదల్లేదు.

ఎలా?

—ఆ ప్రాక్సిమా సాంక్చువరీ అయస్కాంత శక్తినుంచి భూమిని ఎలా రక్షించటం?

అత డాలోచిస్తున్నాడు.

నాలుగు రోజుల్నుంచీ ఒకటే ఆలోచన.

ఎలా రక్షించటం?

తిండీ తిప్పలూ లేక శుష్కించిపోయిన ఆ వృద్ధుడి శరీరం, ఆలోచించటానికి కావల్సిన శక్తిని మెదడుకి యివ్వలేకపోతూంది. ఐనా ఆలోచిస్తూనే వున్నాడు. అనుభవం నేర్పిందీ-పుస్తకాల్లో చదువుకున్నది అంతా రంగరించి ఆలోచిస్తున్నాడు. కంప్యూటర్ కన్నా వేగంగా అతడు లెక్కలు కడుతున్నాడు. అయినా సమస్య పరిష్కారం కావటం లేదు.

ఎలుక ఒకటి అడుగు దూరంలో రెండు కాళ్ళమీద నిలబడి, రెండు చేతుల్తో బ్రెడ్‌కి అంటిన మట్టిని విడదీయటానికి ప్రయత్నిస్తూంది.

ప్రొఫెసర్ కాగితం మీద భూమి బొమ్మ వేసేడు. రింగులు రింగులుగా దాని చుట్టూ సర్కిల్స్ గీచి, ఒక్కొక్క రింగులోనూ వాతావరణపు పొరల పేరు వ్రాసేడు. దాని వైపే గంట సేపట్నుంచీ చూస్తున్నాడు. మాగ్నటోస్ఫియర్ అవతల్నుంచీ ఒక బాణం గుర్తు—ఆ నక్షత్రం ఏ దిశలో వెళుతుందో, ఆ దిశలో గీచేడు. ఆగస్టు పదిహేడు రాత్రి పదకొండు గంటలా పన్నెండు సెకన్లకి....

ఎలుక అతడివైపే చూస్తూంది. అతడూ దానివైపే చూస్తున్నాడు. 'హల్లో!' అన్నట్టు మీసాల్ని కదిపింది. ప్రొఫెసర్ కదల్లేదు. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా వుండే ప్రొఫెసర్ ఈసారి తన ఆలోచనలతో గంభీరంగా వున్నాడు.

ఎలుక తనపనిలో మళ్ళీ నిమగ్నమయింది.

ప్రొఫెసరు తన కాగితాల వైపు చూసేడు.

భూమిపై వరుసగా వాతావరణపు పొరలు ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, అయినోస్ఫియర్....ప్రొఫెసర్ ఆగేడు.

....అయినోస్ఫియర్-మూడు పరమాణువుల ఆక్సిజన్.

ఎలుక బ్రెడ్ మీద దుమ్ముని దులుపుతోంది. దుమ్ముతోపాటు బ్రెడ్ పొడుం పొడుంగా రాలుతోంది! క్రిందపడిన పొడుంతో దుమ్ము మళ్ళీ కలుస్తోంది.

మూడు పరమాణువుల 'ఓ' జోన్‌ని ఆక్సిజన్‌గా విడగొడ్తే....మిగిలిన ఒక పరమాణువు దాని చుట్టూ తిరుగుతూ దాంట్లో కల్సిపోవటానికి ప్రయత్నిస్తుంది. ఈ ఘర్షణలో భూమి చుట్టూ "యాంటీ మేగ్నటిక్ ఫీల్డ్" తాత్కాలికంగా ఏర్పడుతుంది.

చాలు. ఆ స్వల్పకాలం ఆకర్షణని నిరోధించగలిగితే చాలు! చేయవలసిందల్లా 'ఓ' జోన్స్‌ని సూపర్‌సానిక్ వైబ్రేషన్స్ ద్వారా ఆక్సిజన్‌గా విడగొట్టడమే....వచ్చేసింది! సమస్యకి పరిష్కారం దొరికింది!!

ప్రొఫెసర్ కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి "యురేకా" అని బిగ్గరగా అరిచేడు. తన వయసు కూడా మర్చిపోయి చేతులు గాలిలోకి విసిరి నాట్యం చేసేడు. భయపడి పరుగెడుతూన్న ఎలుకని చూసి గట్టిగా నవ్వేడు.—

కుర్చీని వెనక్కి తోసి గుమ్మం దగ్గరకి వచ్చి తలుపు తోసేడు.

పది అడుగుల ఎత్తున్న తలుపు హుందాగా నిలబడి వుంది-బైట తాళం వేయబడి. ఆటో మేటిక్ లాక్.

ప్రొఫెసర్ మొహం మీద నవ్వు మాయ మయింది. తలుపు దబ దబా బాదసాగేడు.

* * *

దాదాపు నాలుగు రోజుల్నుంచీ ప్రతిరోజూ రాత్రి పదకొండు గంటలకి భూమి కంపించటం, బీటలు వారటం సంభవించటంతో పల్లె ప్రజల్లో కొంతమందికి బాబావారిమీద విశ్వాసం సన్నగిల్లింది. చాలా కొద్దిమందికి. అందులో భూషణం ఒకడు.

అంతకు క్రితం రోజు రాత్రి వచ్చిన భూకంపంలో బాబావారు శయనించివున్న ఇంటి కప్పు కూలి, మీదపడి, ఆయన కుడికాలు విరిగింది. అందరికీ తాయెత్తులు కట్టటంలో నిమగ్నమై తన చేతికి కట్టుకోవటం మర్చిపోయినందువల్లే ఈ అనర్థం జరిగిందని భక్తులు ఏకగ్రీవంగా నిర్ణయించేరు.

పెద్ద కామందు భూషణం దగ్గర కొచ్చేడు.

"ఏమనుకుంటున్నారయ్యా ప్రజలు?" చుట్ట నుసి రాలుస్తూ అడిగేడు భూషణం.

"మన పల్లెకి పర్లేదంటున్నారు."

"ఎందుకంట?"

"ఊరి చుట్టూ మన బాబావారు నిమ్మ కాయలు కోసి రసం పిండుతారంట."

"నాకు నమ్మకం లేదయ్యా. సావు తప్పదేమో అనిపిస్తూంది."

ఆ విషయం నమ్మటానికి ఇష్టపడని కామందు విషయం మారుస్తూ, "రాజయ్యా గాణ్ణి ఏం సేద్దాం?" అన్నాడు.

"ఒకేపున మదిసి పేణాలే పోతావుంటే ఇక రాజయ్య సంగతంటావేమిటి?" అన్నాడు భూషణం చుట్టముక్క తుపుక్కున వూస్తూ.

"దేన్దారి దాన్దే. అయినా మన పేణాలు పోతాయనే అపనమ్మకం యెందుకు? బాబాగారు వున్నంతవరకూ పర్లేదు."

"సూద్దాంలే. ఆ పదిహేడో తారీకేదో దాటనీ—"

"అంత కాలం సేతులు ముడుసుక్కూసుంటే అవతలోళ్ళు నవ్వుకుంటారు. ఆణ్ని ఎట్టాగయినా కాల్సెయ్యాల. లేకుంటే, అన్న మాట నిలబెట్టుకోలేనోళ్ళమని రేపణ్నుంచి సిన్న కుర్రోడు కూడా మనని లెక్కచెయ్యడు."

"ఆణ్ణి కాల్సెయ్యటమే కదా కావల్సింది! ఇదో ఈ పదిహేడో తారీఖు కానివ్వు. ఆ తర్వాత సూసుకుందాంలే—"

"ఆ తర్వాతంటే...."

"సూద్దాంలేవయ్యా. తొందరేముంది?"

లేచిపోయేడు భూషణం.

అర గంటలో ఈ వార్త రంగారావుకి పాకింది. రాజయ్యకీ తెలిసింది. అతడు సంతోషించాడు. పాలం పో....తే....పల్లే....దు.... ప్రాణా....లు.... పో....క.... పో....తే.... చా....లు....!

(ఇంకా వుంది)

వచ్చే సంచికలో

మూడు దశాబ్దాల క్రితం 'భారతి' పేజీలలో మెరిసి, మాయమై ఇటీవలే

'కనక ప్రవాసి'కి దొరికిన

కీ. శే. బాలగంగాధర తిలక్ కథ

'జీవితం!'

జ్ఞానోదయం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

"అబ్బో! ఏవిటండోయ్ యివి!" అంది సుమిత్ర శనివారం మధ్యాహ్నం తలంటుకున్న తలకి నూనె రాస్తూ.

"ఏవీ?" అన్నాను చుట్టూరా చూస్తూ.

"చుట్టూ చూస్తారేం? మీ తల్లోనే వున్నాయి నాలుకల్లా" అంది.

"పేలే! వెధవది. మూడ్రోజుల నుండీ ఒకటే దురద. ఏవిటో అనుకున్నా. ఆ పిల్ల ముండ స్కూల్లోవన్నీ పట్టించుకొస్తోందిలా వుంది. దాన్నిమారు నా దగ్గర పడుకోనీకు" అన్నాను కోపంగా.

"బాగుందండీ వరస - అసలు సంగతి వినరేం? పేలు కాదు. పేలాల్లా మెరిసిపోతున్నాయి వెండి వెంట్రుకలు."

"అంతేనా? ఈ రోజే చూశావు గావును! ఎప్పట్నించో వున్నాయవి" అన్నాను చల్లబడి.

"ఎప్పట్నుంచో ఏవిటండీ-నేను చూట్టంలా. మరీ విడ్డూరంగా వుందీ రోజు. కావలిస్తే చూడండి" అంటూ చిన్నద్దం తెచ్చి నా చేతి కందించబోయింది.

"నాకు తెల్సులే నా తల్లో వున్నాయని-నీకు తెలియడమే విడ్డూరం; విశేషమూను. ఎప్పుడేనా తలకి నూనె రాసిన పాపాన పోతేగా తెలియడానికి" అన్నాను కావాలనే చురక అంటిస్తూ.

"నా ముందు తలొంచడం అవమానంగా భావిస్తే నేనెలా రాయనూ? ఏ కళనున్నారో నూనె రాసేందుకయినా యీ రోజు తలొంచేరు" అంటూ మరో మాటకు దొరక్కుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

నిజానికి నెల్లాళ్ళయి నా తలలో మెరుపు తీగలు కన్పిస్తున్నాయి. మొదట్లో ఆశ్చర్యమేసింది. తర్వాత బాధనిపించింది. ఆ తర్వాత బెంగ పట్టుకుంది. తెల్సిన డాక్టరు ఫ్రెండొకాయన వుంటే సలహా అడిగాను అప్పట్లోనే.

"షాంపూలూ హెయిరాయిల్సూ బాగా వాడి వుంటావ్. అయినా వాటి గురించి బాధెందుకోయ్? ఆవెలా వుంటే నీ కద్దొచ్చాయి. నువ్వు ఆరోగ్యంగా వుండు. అంతే చాలు" అన్నాడే తప్ప తెల్లవెంట్రుకలు ఎలాపోతాయో చెప్పలేదు.

అంతే! యిక ఆ ప్రయత్నానికి స్వస్తి చెప్పి నుబ్బరంగా రెండు పూటలా నూనె రాసి ఆ నాలుగు వెంట్రుకలూ బయట పడకుండా జాగ్రత్తపడసాగేను, కానీ ఆవేనా తక్కువ తిన్నది? ఆ నాలుగూ పది రోజుల్లో నలభై అయి కూర్చున్నాయి. ఆ నలభయ్యీ నాలుగు వందలో నాలుగు వేలో అవటానికి ఆట్టే రోజులు పట్టేట్టు లేదు అని నిర్ధారించుకున్నాక ఎదిరించలేక, వదిలేశాను. నేనంటే అంత నిర్లక్ష్యంగా వదిలేశానుగాని సుమిత్ర వూరుకుందా?

"మీకు తెలీదుగానీ రోజూ అపదం రాస్తే ఎంచక్కా నల్లబడుతాయి" అంటూ రోజూ తలకి మర్దనా చేయడం మొదలుపెట్టింది—

వారం పది రోజులు ఓపిక పట్టేను—జుట్టంతా అంటుకుపోయి ముఖమంతా జిడ్డవడమే తప్ప గుణం కన్పించలేదు నాకు. పొద్దున్నే పచ్చిపాలు జుట్టుకు పట్టించి సీకాయతో స్నానం చేస్తే త్వరగా గుణం కన్పిస్తుందని మహిళా మండలిలో ఎవరో చెబితే అదీ నా మీద ప్రమోగించింది—

అప్పే! అప్పటికే శ్వేతజాతిబలం పెరిగి పోయి వందల సంఖ్యలో కొచ్చేసింది—

"ఏవండీ, అయితే యివి పోవంటారా" అని అడిగిందోరోజు రాత్రి సుమిత్ర.

"ఏం? పోకపోతే విడాకులిచ్చేస్తావా ఏవిఁటి?" అన్నాను విసుగొచ్చి—

అంతే! ఆ తర్వాత ఆ సంగతే ఎత్తలేదు.

ఇది జరిగిన నెల్లాళ్ళకు కాబోలు ఓ ఆది వారం షేవ్ చేసుకుంటుంటూంఢే పేపరు పట్టు కొచ్చింది సుమిత్ర 'ఏవండీ ఇది చూశారా' అంటూ.

"చూశ్చేదు. చెప్పు" అన్నాను.

"మీరే చూడండి" అంటూ పేజీతీసి, పేపరు నా ముందుంచింది.

"తెల్లవెంట్రుకలుండవ్" అనే టైటిల్ క్రింద బాక్సుకట్టి ఏదోవుంది-అది చదివి ఓ జోక్ గుర్తొచ్చి నవ్వేను.

"ఎందుకా నవ్వు? అందులో జోక్ లేదే" అంది సుమిత్ర సీరియస్‌గా.

"ఇంతకీ ఈ వైద్యవిద్వాన్ ఎవడంటావ్. తెల్లవెంట్రుక లుండవని గ్యారంటీ ఇస్తున్నాడు. స్వయంగా వచ్చి సంప్రదించి . చికిత్స పొందండంటున్నాడు. కొంపదీసి కూచోబెట్టి పీకేస్తాడా ఏమిటి?" అన్నాను నవ్వుతూ—

"ఛా. పోనిస్తురూ. మీ జోకులూ మీరూను, ఎవరేం చెప్పినా వినరు. ఎవర్నీ సంప్రదించరు. చూడగామాడగా యీ తెల్లజుట్టే మీకు బాగు న్నట్టుంది" అంటూ వెళ్ళిపోయింది.

* * *

మనం మర్చిపోదామనుకున్న బాధల్నీ బాధ్యతల్నీ మన చుట్టూవున్న ప్రపంచం మనని మర్చిపోనివ్వదు-ఎప్పటికప్పుడు ఎవరో ఒకరు కన్పించి వేలెత్తి చూపుతూనేవుంటారు. అంకుశంపెట్టి పొడుస్తూనేవుంటారు.

"అర్జంటుగా మద్రాసు వెళ్ళాల్సిన పని తగి లింది - ఫలానారోజు — స్టేషన్‌లో వచ్చి కలువ్" అంటూ కాన్పూరునించి శివరాం యిచ్చిన టెలిగ్రాం పట్టుకుని స్టేషన్‌కి బయ ల్దేరాను — ఆ రోజు కోరమండల్‌కే అత నొస్తున్నది-సిటీ బస్‌కోసం బస్టాపులో నించొని అప్పటికే అరగంట దాటింది-కనీసం అప్పుడు బస్సొచ్చినా మరో అరగంటలో స్టేషన్‌లో వుండొచ్చు.

సరిగ్గా అప్పుడే నా ముందో స్కూటర్ ఆగింది. పరాగ్గా వున్నానేమో ఎక్కడో చూసిన ముఖంలా వుందనుకుంటూండగానే అతనే పలకరించాడు 'ఏమిటి సార్, బహుకాల దర్శనం. ఎందాకా బయల్దేరారు' అంటూ.

గొంతు విన్నాక గుర్తొచ్చింది. అతను సంతోష్—నేను పాటలు రాసే కొత్తలో నా పాటలు ఆకాశవాణిలో కొన్ని పాడేడతను—

"స్టేషన్‌కండీ" అంటూ సంగతి చెప్పి 'మీరెందాకా' అన్నాను ఆశగా.

"కె.జి.హెచ్.కి. మా బంధువు ఒకాయనకి ఏక్సిడెంటయితే జాయిన్ చేశాం. చూసి పోదామనీ" అన్నాడు—

చెప్పకేం! చాల నిరాశ కలిగింది నాకు.

"ఈ మధ్య మీరు బాగా పికప్ చేశా రండోయ్. వారానికి రెండైనా మీ పాటలు రేడియోలో వస్తున్నాయి. చాల సంతోషం" అన్నాడు సంతోష్ నన్ను సంతోష పెట్టడానికే అన్నట్టు—

"ఏవో....పాత పాటలే—అప్పట్లో రాసి పంపినవే యిప్పుడు తీసుకుంటున్నారు ఒకటీ ఒకటీ...." అన్నాను అతిమామూలుగా.

"మనం కల్సుకుని చాల రోజులై పోయింది" అన్నాడు—

ఔనన్నట్లు తలూపాను.

"మీలో బాగా మార్పు కన్పిస్తోంది-మనిషి కాస్త పుష్టిగా కన్పిస్తున్నారు-కాని...." ఇంకా ఏదో అనబోయాడు.

"ఔనౌను. నా పాటలు తరచు వస్తున్నా యిగా. ఆ సంతోషంతో కాస్త ఉబ్బేనంతే" అన్నాను జోగ్గా.

"ఆనందమూ, తనివీ మనిషిని ఆరోగ్యంగా వుంచుతాయి, కాదన్ను-కానీ మీ జుట్టేమిటండీ. బొత్తిగా పండిపోయిందీ—ఏదైనా వాడక పోయారా" అన్నాడు.

అది మాటకాదు, నా పాలిట బాణం.

నేనింక అతనికెదురుగా నిల్చోలేక రిక్షా



పిల్చి ఎక్కేశాను.

ప్లాట్‌ఫాం టికెట్టు కొనుక్కుని లోపలి కెళ్ళేసరికి బండి రానేవచ్చింది-నన్నాట్టే శ్రమ పెట్టకుండానే ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోంచి చెయ్యూపి పిలిచాడు శివరాం.

"ఫర్వాలేదు. పోల్చుకున్నాడు" అను

కున్నాను.

కేంటీన్ దగ్గర టీ తాగుతూనే మిగిలిన ఫ్రెండ్స్ గురించీ, కాన్పూర్‌లో అతని చదువు గురించీ, నా ఉద్యోగమూ రచనల గురించీ మాట్లాడుకున్నాం—

"నీ పాటలీమధ్య ఒకటి రెండు విన్నాను" అన్నాడు శివరాం.

నేనేం మాట్లాడలేదు.

ఈ లోగా పచ్చజెండా చూపించాడు గార్డు.

కంపార్టుమెంట్లోకెక్కి తలుపు దగ్గర నిల్చున్నాడు శివరాం.

బండి కదిలింది.

"నువ్వు కాస్త ఆలోచన్లు మానెయ్యాలి" అన్నాడు—

దేన్ని గురించి అంటున్నాడో అర్థంకానట్టు చూశాను—

"అదే—నీ ఉద్యోగం గురించీ యితర సమస్యల గురించీ కాదు. రచనల గురించి అంతకంటే కాదు."

నేనాలోచించి రచనలు చేయనని అతని భావమా?

"ఆలోచించి బెంగెట్టుకున్నకొద్దీ యింకా పండిపోతాయ్.... నే చెప్పేది నీ జుట్టు గురించి" అన్నాడు—

బండితోపాటు నాలుగడుగులు వేయాలనుకున్న వాడినల్లా ఎర్రజెండా చూపించనట్టు అక్కడే ఆగిపోయాను.

§ § §

"నమస్కారమండీ."

రామారావుగారు నా వంక అనుమానంగా చూశారు. 'నువ్వెవరోయ్' అన్నట్టు—ఆయన బావమరిది శంకరం నాకు స్నేహితుడు—ఆ సంగతే గుర్తుచేశాను. అతిప్రయత్నం మీద గుర్తు తెచ్చుకుని కూర్చోమన్నాడు. శంకరం ట్రాన్స్‌ఫర్ విషయం, తదితర కుశలప్రశ్నలూ అయ్యాక.

"వీడు మా మేనల్లుడండీ—టౌను ప్లానింగ్ ట్రస్ట్‌లో ఓ చిన్న ప్లాటు కొన్నాడు-అర్బన్ సీలింగ్ క్లియరెన్స్ సర్టిఫికేటేదో అవసరమైంది — దానికి మీ సహాయం కావాలి" అన్నాను మా వాడిని చూపిస్తూ.

"ఓ యస్ దానికేముంది" అంటూ వెంటనే ఫారాలు తెప్పించి మా వాడిచేత నింపించి, నాలుగు రోజులు పోయాక రమ్మన్నాడు.

"అలాగే" అంటూ లేచాను.

"అవునూ-మీరూ యిల్లు కట్టే సందర్భంలోనే రెండేళ్ళ క్రితం నన్ను కలిసారుగదూ" అన్నాడు.

"అవును. ఆ పరిచయం మీదే మిమ్మల్నిప్పుడు కలిశాను" అన్నాను.

"సొంతింట్లోనే వుంటున్నారా?" ఆ ప్రశ్న.

"పూర్తయిందా యిల్లు?" అన్నట్లు వినిపించింది—

"ఇంకా పూర్తికాలేదు సార్" అన్నాను నెమ్మదిగా.

"అదేం? లోనుకూడా తీసుకున్నట్లున్నారు" అన్నాడు ఆ పూర్తి కాకపోవడానికి దబ్బే యిబ్బందయినట్లు—

"తీసుకున్నాను. కానీ ఏం లాభం! డబ్బుతో సంసారాన్ని ఎలాగూ నిలబెట్టలేం. కనీసం కొంపైనా నిలబెట్టుకోగలమని అందులోకి దిగాను. ఇప్పుడు నిండా కూరుకుపోయాను."

"అదేమిటలా!"

"అంతే మరి! నీటికీ సిమెంటుకీ కరువు పోలేదుగా ఈ దేశంలో. కార్డుమీద సిమెంటు అయిదేసి బస్తాలిస్తున్నారు-నీళ్ళు కూడా బిందెల లెక్కన కొనుక్కోవల్సి వస్తోంది. ఆ పరిస్థితుల్లో మా యిల్లు త్రిశంకు స్వర్గమైంది" అన్నాను.


"కష్టమే మరి! మిమ్మల్ని చూస్తేనే తెలుస్తోంది మీ పరిస్థితి. జుట్టుకూడా పండిపోయి వున్నట్టుండి పెద్దవారైపోయారు" అంటూ నవ్వడం మొదలెట్టి.

"మొత్తానికి యిల్లు కట్టకుండానే పండిపోయారు" అంటూ పూర్తి చేశాడు—

నేను గుమ్మందాంటి మెట్లు దిగేసేను.

§ § §

"పోనీ అందరూ అంటున్నారని అనుకోకపోతే జుట్టుకు రంగేసుకోరాదుటండీ" అంది సుమిత్ర ఓ రోజు.



అంతకుపూర్వం. ఆ ముక్క ఏ వంక సార్లందో!

"ఛస్తే యిలానే ఛస్తాగాని నేనా 'డై'తో చావలేను" అన్నాను మొండిగా—

రేడియో ఆపేసినట్లు ఆగిపోయింది సుమిత్ర.

§ § §

లీవ్ ట్రావెల్ కన్సెషన్ మీద బెనారస్ వెళ్తూ నన్ను కూడా రమ్మని బలవంతం చేశారు మామయ్య. అతగాడికి హిందీ రాదు. కాస్తో కూస్తో నాకు హిందీ వచ్చుననీ, మాటసాయం వుంటుందనీ నా ఖర్చులు తనే భరించాడు.

కాశీ విశ్వనాథ్‌జీని దర్శించి, తులసీ మానస మందిర్ మొదలైనవాట్ని సందర్శించి, చివరగా బెనారస్ విశ్వవిద్యాలయం, బిర్లామందిరం కూడ చూడాలని బయల్దేరం. శివాలయం చూసి బయటకొస్తూంటే ఓ వార్త మా చెవిన బడింది. ఎవరో సాములారు అక్కడే బసచేసి వున్నారనీ, ఆయనగారు భూతభవిష్యత్ వర్తమానాల్ని అద్భుతంగా చెబుతున్నారనీనూ—

'వెళ్దాం పదరా' అన్నాడు మామయ్య. ఆయన జాతకాల పిచ్చి అటువంటిది! ట్రాన్స్‌లేటర్‌గా నాకు తప్పలేదు.

పాతిక రూపాయల ఫీజుకోసం శిష్యుడు చేయిజాపిన అనంతరం మామయ్య ఆయన ముందు చేయి చాచేడు—నిగనిగలాడే నల్లని కురులూ, అందంగా పెంచబడ్డ మీసాలూ, గడ్డాలూ, ఖరీదైన పట్టుపీతాంబరాలూ, వెండి చెంబూ — సాములారు అట్టహాసంగానే వున్నారు.

"మీ కురులు అంత నల్లగా వుండట్నానికి ఏమి వాడతారు స్వామీజీ" అని అడగాలనిపించీ కూడ నోరు కట్టేసుకుని మామయ్య పక్కనే చతికిలబడ్డాలు.

స్వాములవారు మెదట నాలుగు ప్రశ్నలు హిందీలో వేసి ఆ తర్వాత తెలుగు వారిమని గుర్తించి తెలుగులోనే మాట్లాడ్డం మొదలుపెట్టేరు—

మామయ్య జీవితచక్రం మీద స్వాములారు విహరిస్తున్నంతసేపూ నన్నెక్కడ చెయ్యి జాపమంటారో అని భయంతో చేతులు వెనక్కు కట్టేసుకూర్చున్నాను. జాతకం మాటెలావున్నా పాతికరూపాయలు గోవిందా.

అంతా అయ్యేక, "ఆయనెవరూ? మీ అన్నగారా?" నా వేపు చూపించి బాణాన్ని సంధించారు స్వామీజీ—మామయ్య ముందు ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత ఫొక్కున నవ్వి, "అబ్బే-వాడు....మా మేనల్లుడండీ-నా కంటే వయసులో పదేళ్ళు చిన్నవాడు" అన్నాడు.

మానవజీవితంలోని భూతభవిష్యత్ వర్తమాన కాలాన్ని చెప్పగలిగే స్వాములారి మహిమకు తట్టుకోలేక లేచి పరుగెత్తాను-మామయ్య పిలుస్తున్నా వినిపించుకోకుండా.

§ § §

"ఇదిగోనమ్మాయ్. మీ వార్ని తెచ్చి నీ కప్పగిస్తున్నాను" అన్నాడు మామయ్య ఇంట్లో కాలు పెడుతూనే—

సుమిత్ర నా వంక అనుమానంగా చూసింది-

అవును మరి! పదిహేనేళ్ళనించీ సంసారం చేస్తూ పదిహేను రోజుల ఎడబాటుకే నన్ను పోల్చి పట్టలేని తెలివితక్కువదేం కాదు సుమిత్ర — కాకపోతే — మూడేళ్ళ నించీ చూస్తున్న ముఖం ఒక్కసారి మారినట్లు కన్పిస్తే అది ఆమె తప్పా.

"ఏంవిటీ....మీరు మీరే" అంది ఆశ్చర్యంగా మామయ్యనటు స్నానానికి వెళ్ళనిచ్చి-

"సందేహమేల యింతీ-అంతా ఆ స్వాములారీ కృప—"అన్నాను బేగ్‌లోంచి హెయిర్ డై బాటిల్‌ని తీసి టేబిల్ మీదుంచుతూ.



కొత్త శీర్షిక ప్రారంభం!

మనసు సంగతి

డా. శ్రీమతి జయానాగరాజ్

మనసున మనసై, బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యము, అదే స్వర్గము అని పలవరించాడు మహాకవి. తోడు లేని మనసు బీడువారిపోయింది. పని పాటా లేకుండా సోమరిగా వుండేవారి మనసు దయ్యాల కొంపలా వుంటుందని సామెత. మనిషితో పాటే మనసు పుట్టింది. మనిషితోపాటే అంత మవుతుంది. జరామరణాల మధ్య వున్న ఈ జీవనయానంలో మనిషిని నడిపించేది మనసే. జయాపజయాలు, సుఖదుఃఖాలు, సాముహిక సముత్సాహాలు, ఏకాంత రోదనలు అన్నీ మనసు నుంచే పుడతాయి. మనిషి ప్రేమించినా, కామించినా, వేదనతో కల్లోలిత సముద్రంలా అలమటించినా, గుండెలు బద్దలయ్యేలా యేడ్చినా, దిక్కులు పిక్కటిల్లేలా నినదించినా — అన్నింటికీ ప్రేరణం, కారణం మనసే.

చిన్నతనం నుంచి కూడ తీర్చిదిద్దబడే మనిషి వ్యక్తిత్వాన్ని (Personality) మనసు, దాని చుట్టూవున్న వాతావరణమే పునాది. మనిషి చుట్టూ ఆరోగ్యకరమైన కుటుంబ, సాంఘిక వాతావరణం వుంటే అతని మనసు సుక్షేత్రంగా పరిణామం చెందుతుంది. అనారోగ్య కరమయిన, అసహజమైన పరిస్థితుల మధ్య పెరిగిన మనిషి మనసు బీడై పగుళ్ళుబారుతుంది.

మన్మధభావం మనిషిలో యెటువంటి విచిత్రమైన, వికారమైన (అన్నికళలా, అందరిలోనూ కాదు) ఆలోచనలు కలిగిస్తుందో మనకు తెలుసు. మనసునుండి పుట్టినవాడు మన్మధుడు (మనసిజుడు) మనసు మధించబడినప్పుడు కోరిక (Desire) పుడుతుంది. ఈ కోరిక పరిధి చాలా పెద్దది. శరీరవాంఛ, ధనవాంఛ, సుఖవాంఛ, అధికారవాంఛ, ఆహారవాంఛ, జీవిత వాంఛ, మరణవాంఛ, యిలాగ ప్రతికోరికకీ, మనిషిచేసే ప్రతిచర్యకి ఆశ్రయం మనసే. వీటన్నిటిలోకీ తనని తాను బతికించుకోవాలనే వాంఛ (Self preservation) చాలా బలీయమైనది. ప్రేమ, కామం, ఆకలి, ఆత్మ సంరక్షణ, ఆగ్రహం, మొదలైన గుణాలు మానవుడి ప్రాథమిక లక్షణాలు (Basic Human Instincts) జీవిత గమనంలోని వేగాన్నిబట్టీ, మనసుమీద కలిగే ఒత్తిడినిబట్టీ వ్యక్తి నుంచి వ్యక్తికి ఈ గుణాల మోతాదు మారుతూవుంటుంద. ఆలోచన, (Thinking) విచక్షణ (Discrimination), జ్ఞాపకం (Remembrance) దీర్ఘ జ్ఞాపకశక్తి (Remote memory), జరిగిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుకునే శక్తి (recall) విజ్ఞానము (Knowledge) సంఘటనవలని పదిలపరుచుకునే శక్తి (Consolidation) యిలా, అనేకమైన పనులు ఒంటరిగానే మనసు నిర్వహిస్తుంది. ఇది శతావధానానికి తీసిపోయినదేమీ కాదు. ఈ దృష్టితో చూస్తే ప్రతి మనిషీ ఒక శతావధానే.

మనసు సాధారణంగా జాగృదావస్థలోనే (Conscious state) తన విధిని నిర్వహిస్తూ వుంటుంది, కొన్ని సందర్భాలలో, కొన్ని పరిస్థితులలో తన కిష్టంలేని పనుల్ని చేస్తుంది. ఇష్టంలేని విషయాలను, అవుసరం లేని విషయములను స్వీకరించి సేకరించి తన లోపలి మరొక గదిలోపెట్టి తాళం వేస్తుంది. ఈ అవస్థనే (Sub conscious state) అంటారు.

ఇన్ని శక్తియుక్తులున్నప్పటికీ, మనసు అప్పుడప్పుడు అలసిపోతుంది. ఓడిపోతుంది. చితికిపోయింది, అయినా చనిపోదు. బాధను అనుభవిస్తుంది. వేదనని పలవరిస్తుంది. భౌతిక స్థితిగతుల ప్రభావానికి లోనవుతుంది. గాయపడుతుంది. అనారోగ్యానికి గురవుతుంది. ఈ అనారోగ్యదశనే మానసిక రుగ్మత అంటారు. 'మనసు గతి యింతే'నవి కవి వాపోయింది, ఇటువంటి మానసిక క్షోభని చూసే. అలాగని మనసు పోరాడటం తెలియని పిరికిపంద కాదు. జీవితంలోని ఎత్తుపల్లాలను మనసు చదును చేయగలదు. జీవితంలో ఎదురైన పరిస్థితులను మనసు తనకు అనుకూలంగా మలుచుకోగలదు. దీనిని అంతర్గత సంరక్షక యంత్రాంగం (Inbuilt defence machanisms) అంటారు. ఆటలు బాగా ఆడలేని మనిషి పాటలు బ్రహ్మాండంగా పాడి రాణించే అవకాశం వుంది. రచనా వ్యాసంగంలో విఫలమైన మనిషి రసాయన శాస్త్రంలో నోబుల్ బహుమతి పొందవచ్చు. పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడమంటే యిదే.

వాస్తవ జీవితంలో సాధించలేని, అనుభవించలేని అంశాలను మనిషి అందుబాటులోకి వచ్చినట్లు అనిపించడానికి మనసు ఒక భ్రమావరణం, ఒక ఊహాలోకం సృష్టిస్తుంది. అక్కడ కొన్ని మనసులు హాయిగా సేద తీరతాయి. ఐతే Fantasy. ఇలా కాక జరిగే ప్రతి చర్యకీ తనే కారణమని గుర్తించిన మనసు పట్టుదలతో, అనుకున్నది అనుభవంలోకి తెచ్చుకోడానికి (Rationalisation) ప్రయత్నిస్తుంది. కొన్ని పనులు చేస్తున్నది తనే అయినా, వేరొకరి ప్రేరణమును చేస్తున్నాను, నాకేమీ బాధ్యతలు లేదని సరిపెట్టుకోవడం (Projection) తన వాతావరణానికీ, పద్ధతికీ సరిపడని ఆలోచనలు వచ్చినప్పుడు, అవి పైకి కనబడకుండా లోలోపల అణచి వేస్తుంది మనసు (Repression) కొన్ని కలవరపాటు కలిగించే విషయాలను గుప్తంగా దాచిపెడుతుంది. (Sublimation). అయితే బలవంతంగా అణచి వుంచిన ఆలోచనలు తలుపులు బద్దలు కొట్టుకుని బయటపడతాయి ఒక్కోసారి (Returned of the repressed.) ఈ బయట పెట్టకుండా వుండలేని విషయాలు యధాతథంగా బయట పడడం మంచిది కాదని కనుక మనసు భావిస్తే అవి వేరే రూపంలో బయటి కొస్తాయి (Conversion). మనసు ఎంత సున్నితమైందో అంత గోప్యమైంది. అది నల్లరంగు పూయబడిన గాజు ముక్క. లోపల అంతా స్వచ్ఛంగానే వుంటుంది. కానీ బయటినుంచి యేమీ కనిపించదు. కనుక మనసున్న మనిషీ, జాగ్రత్త నీ మనసు.

(వచ్చే సంచికలో
మరో మనసు కథ)

> గొప్ప విషయాలనీ, స్వల్ప విషయాలనీ కూడ సమానంగా స్వీకరించ గలిగేదే ఆరోగ్యవంతమైన శక్తివంతమైన అసలు సిసలైన మనసు
>
> —శామ్యూల్ జాన్సన్



ముక్కుపుడక • మెడికో శ్యామ్

ఆరేళ్ళ క్రితం అవిణ్ని చూసి వుంటే ఏమనుకునేవాడినోగాని యిప్పుడు మాత్రం ఏ మాత్రం చలించలేదు.

స్థూలంగా చెప్పాలంటే స్థూపంలా వుందామె.

గుండ్రంగా వుండే ఆడవాళ్ళలో అందచందా

లను అంతగా గుర్తించలేను నేను.

వార్డులో నాలుగో నెంబర్ బెడ్ దగ్గరికి వెళ్ళి చూసి వస్తూంటే ఆమె కనబడింది పద్దెనిమిదో నంబరో బెడ్ పక్కన.

చటుక్కున నా కళ్ళు నాకర్షించింది ఆమె ముక్కునున్న ముక్కుపుడక.

తెల్లని సన్నని ఆ ముక్కుపుడక!

మెరుపులా మెరిసిన ఆ ముక్కుపుడక వలన ఆమె ప్రెజెన్స్‌ని గుర్తించాను నేను.

విసురుగా వార్డులోంచి నడిచి వచ్చేసాను.

కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాను.

మనుషులెందుకు విచిత్రంగా వుంటారు? అని.

ఈ గుండ్రటి మనిషి, ఈ స్థూపాకారపు తెరవ. ఏమిటి ఈవిడలోని చొరవ.

చొచ్చుకొని పోగలదు.

చీల్చుకొని పోగలదు.

బొమ్మల మీద సరిగా వేయని రంగులా నాగరికత చీర తొడగిన అనాగరిక వనితలా అన్పిస్తుంది తనకి.

ఔను.

ఎందుకో ఆమెకంత అతిశయం?

వార్డులోకి వచ్చే చాలామంది పేషెంట్ల మగ అటెండెంట్‌లని ఆకర్షిస్తోంది ఆమె.

నన్ను ఆకర్షించలేదు.

అంటే ఆకర్షించేశక్తి ఆమెకి లేదు.

ఆడదానికి అణుకువే అందం అంటే కాదనే వాణ్ణి నేను.

బిర్రబిగిసి విర్రవీగే వనితల్లో అందచందాన్ని నేను చాలాసార్లు గుర్తించాను.

ఆవేశంలో ఎగబీల్చే ముక్కు....ఎర్రని కోపంలో ఎంత ఆకర్షణ....

అందరూ బ్రతిరుగుడు అనేది ఆత్మ గౌరవం అనేవాణ్ణి నేను.

అణుకువలేని ఆడది అత్యంత చిరాకు కలిగిస్తుంది అని మొదటిసారి గుర్తించాను.

అకస్మాత్తుగా ఏ ఆకర్షణా లేనివారిలో అతిశయం వారి ఆకర్షణ అనిపించింది.

మనుష్యులు చాలా విచిత్రమైన వాళ్ళు.

తమని కని పెంచి పెద్దచేసిన వారికంటే వున్నతంగా ఎదిగేవారుంటారు.

ఉన్నతంగా ఫీలయ్యేవారుంటారు.

ఉన్నత శిఖరాలను అందుకున్నవారు సరే.

ఉన్నతంగా తమని తాము భావించేవారు....వారు....

ఈ అమ్మాయి అనాలో ఆవిడ అనాలో తెలీడంలేదు....

ఈవిడ సంభాషణలో తల్లితో....తండ్రితో పక్కనున్నవారితో కూడా .... ఏదో వెగటు తొంగిచూస్తుంది.

ప్రతీ ఆడదాన్నీ, కాస్త కన్నూ, ముక్కూ తీరూ....అన్నీ బాగున్న ఆడదాన్నెవరినైనా, తండ్రి కాస్త ఖర్చుపెడితే ఎవడైనా చేసుకుంటాడు.

ఆ చేసుకున్నవాడు కాస్త గొప్పవాడో, మంచిస్థాయిలో వున్నవాడైతే, ఈ ఆడది తను మొన్నటి దాకా తిరిగిన ఇల్లూ, మెలిగిన తీరూ మర్చిపోయి తను ఆకాశంలోంచి వూడిపడినట్టు భావించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాదు అసహ్యం కలిగిస్తుంది.

లేత ఆకుపచ్చ రంగు చెట్ల చిగుర్లూ, నల్లటి కారుమేఘాలు, నీలంగా వెలిగే సాయంత్రాలూ మెత్తగా జీరాడే కుచ్చిళ్ళ లాంటి సాయంత్రం వీచే సన్నటిగాలీ....ఇవన్నీ సుకుమార సుందర సున్నితాంగుల కనురెప్పల నీడలలో కనిపించే కలిగించే ఆహ్లాదం....

....అతిశయంతో, అహంభావంతో, అర్థం లేని అర్థంగాని అహంకారంతో మెలిగే ఆడది తెరిచే నోట్లోంచి వచ్చే వాక్ప్రవాహంలో కొట్టుకుపోయి బతుకుమీద వెగటు కల్గిస్తుంది.

ఆశ్చర్యం వెయ్యవచ్చు.

ఒక వార్డులో పేషెంటుని చూడ్డానికి వచ్చే ఆడదాన్ని చూసి ఇంతగా అసహ్యించుకోవడం అవసరమా? అని.

కాదు. అవసరం కాదు.


అసలు ఈ ప్రపంచంలో అసహ్యంకోవలసింది ఒక్క విషయాన్నే.

అది అసహ్యాన్ని.

ద్వేషించవలసింది ఒక్కదాన్నే.

అది ద్వేషాన్ని.

ఎండాకాలం



మరి?

సృష్టిలో సమస్త స్త్రీజాతిలోని హేయ గుణాలన్నీ మేటవేసినట్టు నడుస్తుంది ఆ స్త్రీ మరి.

రోడ్డు మీద ఎందరు ఆడవాళ్ళని చూడటం లేదు. ఎందరు మూర్ఖురాళ్ళని, ఎందరు అజ్ఞాన స్వరూపాల్ని, ఎందరు రంపాలతలను (శంపాలత కాదు) చూడటంలేదు?

ఎందరు ఆడవాళ్ళు కొత్తకొత్త మూఢ టెక్నిక్‌లతో మగవాళ్ళతో పోటీ చెయ్యడం లేదు?

మరి వారందరి గురించీ ఆలోచిస్తున్నావా?

లేదు.

మరి ఈవిడ గురించి ఏల?

అనంతమైన సమయంలో రేఖామాత్రంగా మెరిసిపోయే మెరుపులాగా కన్పించిపోతారు కొందరు మనుష్యులు బిందుపరిమాణ సమయంలో.

అనేక బిందువులు కలిసి ఒక రేఖ ఏర్పడినట్లు, అనేక మారులు కనిపించి, పరిమిత పరిమాణాన్ని సాధిస్తుంది కొందరి పరిచయం.

అలా ఏర్పడిన పరిచయం వలన ఆ మనుషులపై మనకో అభిప్రాయం ఏర్పడుతుంది.

ఆ అభిప్రాయం చాలా సమయాల్లో సరియైనదే అవుతుంది మన ఆలోచనా ధోరణి సరిగావుంటే—

ƒ ƒ ƒ

వార్డులో పేషెంట్ల అందరి ప్రోగ్రెస్‌లూ నోట్ చేస్తున్నాను పల్సూ, బీపీ తీసి చూసి రాస్తూ.

18వ నెంబర్ బెడ్ దగ్గరికి వచ్చాను.

మామూలుగా పేషెంట్ చెయ్యికి బీపీ కఫ్ కట్టాను. బీపీ తియ్యబోయి యథాలాపంగా పక్కకి చూశాను.

స్టూలుమీద కూర్చున్నామె నిలబడింది.

"ఫరవాలేదు కూర్చోండి" అన్నాను.

"ఎంతైనా డాక్టరుగదా" అంది అదోలా నవ్వుతూ.

బీపీ ఏపరేటస్‌లో పాదరస మట్టం ఒక్కసారి కిందపడింది!

మళ్ళీ గాలికొట్టి బీపీ తీసి చూసి రాసి వచ్చేశాను.

కొందరు మనుషులకి మాట్లాడ్డం చేతకాదు

అనుకున్నాను.

ఓ రోజు ఇంజక్షన్లు యిస్తూవుంటే వచ్చింది దగ్గరికి——

"నాకు పెన్సిలిన్ కావాలి" అంది.

"ఎందుకు?" అన్నాను.

"నాకు గోరుచుట్టు అయింది. వేలు బాగా నొప్పెడుతోంది. ఇన్ఫెక్షను గదా" అంది బొటకన వేలు చూపిస్తూ.

గోరువైపు చూశాను.

అక్కడ నాకేం కనిపించలేదు.

"ఊరికే అలా మందులు వాడకూడదు" అన్నాను.

"ఊరికే అంటారేంటి? నాకు గోరునొప్పి పెడ్తుంటే" అంది.

"పెన్సిలిన్ కొందరికి పడదు. ఎందుకు వూరికే రిస్కు" అన్నాను యేమనాలో తెలీక.

"డాక్టరుగారి మిసెస్‌నైన నాకు తెలీదా?" అంది హఠాత్తుగా.

నాకు నవ్వాలో ఏడ్వాలో తెలీలేదు.

ఇంకా, డాక్టరుగారి భార్యగారు ఆవిడకి తెలిసిన వైద్యమంతా చెపుతోంది.

నేను వచ్చేశాను.

మనుషులు ఎందుకు వాళ్ళ తెలివితేటలు చూపాలని ప్రయత్నిస్తారు?

బ్రిలియన్సీ మస్ట్ బీ ఎపారెంట్. బట్ నాట్ టు బీ ఎక్జిబిటెడ్.

బ్రిలియన్సీ క్షణికం ఏ మహానుభావుడిలోనైనా. ఎందుకు బ్రిలియంట్‌గా కనిపించడానికి మనుషులు బాధపడతారో అర్థంగాదు.

వాళ్ళ ఆయన డాక్టరైతే ఈవిడకేం తెలిసిపోతుంది ప్రతీవిషయం?

ఎన్నో ఏళ్ళు శ్రమించి చదివిన వారికే ఏమీ తెలీదు అన్పిస్తోంది గదా ఏమిటో——

ఓ గంట పోయాక మళ్ళీ వచ్చింది,

"అయితే, డాక్టర్! ఇంజక్షన్ యివ్వరా?" అంటూ.

సరే పోనీ ఇద్దాంగదా అని కాగితం తీసి పెన్సిలిన్ రాసిచ్చి కొనుక్కు రమ్మన్నాను.

ఆవిడ కాగితంపై పోసారి చూసి....

* * *

రాత్రి సభ. నక్షత్రాలు సభికలు.

చందమామ అధ్యక్షుడు.

నిశ్శబ్దంగా జరుగుతోంది సభ.

దూరంగా సముద్రంమీంచి వస్తున్న గాలి విచిత్ర ధ్వనులను చేస్తోంది రాత్రి సభకి నేపథ్య సంగీతంలా.

నా పక్కనే కూర్చుంది గీత.

కాదు. గీత పక్కనే కూర్చున్నాను నేను.

ఆ మసక వెలుతుర్లో ఆమె ఎర్రని పెదవులు ఎర్రగా మెరవడం లేదు. కాని వాటి మెత్తదనం నా కళ్ళ జ్ఞాపకాల్లో మెత్తగా గుచ్చుకుంటోంది. ఎరుపు ఎర్రగా వెలుగుతోంది.

కోమలంగా వంగి వుంది ఆమె మృదువైన ముక్కు. ముక్కు చివర్న మెరుస్తోంది సన్నని ముక్కుపుడక.

అ ముక్కుపుడక పొడి తెల్లగా వుంది.

ముక్కుపుడకకి పెట్టుకునే పొడులన్నిటిలోకీ అత్యంత అందంగా కనిపించేది తెల్ల పొడి.

అస్సలు బాగులేనట్టు కన్పించేది ముత్యం ముక్కుపుడక.

గీసిన గీతల్లాటి, వంగిన విల్లులాటి కనుబొమ్మలలాగే ముక్కుపుడకలో కూడా లాగేసే ఆకర్షణ వుంది.

"ఏంటి అలా చూస్తున్నావ్?" అంది గీత.

"నిన్ను" అన్నాను.

"ఊఁ——" అంది.

"నా కవితల కంటే కూడా చాలా అందంగా వున్నావు."

గీత పడి పడి నవ్వింది.

"ఏం? ఎందుకంత నవ్వు?" అన్నాను.

ఆమె మాట్లాడలేదు.

మళ్ళీ అదే ప్రశ్న వేశాను.

"నీ కవితలకన్నా ఎవరైనా బాగుంటారేమో" అంది.

మగవాడి తెలివితేటలు ఆడదాని ముందు ఎందుకు తెల్లవారతాయో అర్థంకాదు.

నేను రెండు నిమిషాలు మాట్లాడలేదు.

దూరంగా సముద్రం మీద పడుతున్న వెన్నెల మీగడ తరకలా వుంది.

నా మనస్సులో 'మౌనం' జలతరంగిణిలా మోగుతోంది మాట్లాడమా మానడమా? అని.

జీవితంలో గొప్ప కవిత్వం వుంది. ఊహల్లో గొప్ప సంగీత ఝరి వుంది. అవి మాటల్లోకి ప్రవహించకపోవడం నిజానికి విషాదం.

కవిత్వాన్ని....చదివి....విని ....ఆనందించే మనుషులు నిత్యజీవితంలో యెందుకు ఒప్పలేరో!

నీ మృదువైన కుర్తులు నిజానికి నా మనసు మోయలేని బరువులు, అనుకుంటూ లేచాను, 'ఇక వెళదా'మంటూ.

ఆవిడ కాగితంవైపొకసారి చూసి....

"కొనమంటారా?" అంది.

"ఔను. కొనుక్కు తెచ్చుకుంటే ఇంజక్షన్ ఇస్తాను" అన్నాను.

"మీరు యివ్వలేరా?" అంది.

"ఎలా?"

"వార్డులో వుండవా హాస్పటల్‌వి?"

"అలా ఇవ్వకూడదు. వార్డులో మందులూ, హాస్పిటల్ మందులూ ఇన్ పేషెంట్సుకి. ఇక్కడ వున్నవాళ్ళకి, మీలాంటి పైవాళ్ళకి అవి ఇవ్వకూడదు" అన్నాను వీలయినంత మేరకి విసుగుని అదిమి.

"ఉహుఁ" అని వెళ్ళిపోయింది.

నిజం చెపుతున్నాను. ఇది జరిగి వారమైనా ఆమె ఇంజక్షన్ తీసుకోలేదు.

ఆమెకి అది అవసరం కాలేదు.

కాలికి లేక వేలికి ఇన్‌ఫెక్షన్ పెరిగిపోలేదు.

ఎవరితోనో అంటోంది, "డాక్టరుగారి మిసెస్ అన్న గౌరవమయినా లేకుండా...." అంటూ.

ఆపైన నేను రాయలేను.

ఊరకేవస్తే ఆరగిద్దామనుకునే వాళ్ళని నేను సహించలేను. భరించలేను.

నిజానికి ఆమె గురించి నేను ఆలోచించేవాణ్ని కాదు. కాని ఆమె పెట్టుకున్న ఆ ముక్కుపుడక నన్ను సన్నగ పొడుస్తోంది మరి.

సన్నని ముక్కుపుడక సున్నితమైన ఊహలాంటిది.

కాని కొందరు మనుషులు కొలిమిలాటివాళ్ళు. కొరకంచులాటివాళ్ళు. ఆ వేడికి ముక్కుపుడక కరిగిపోతుంది. ఊహ మాడిపోతుంది.

గాలి వీస్తే కందిపోయేలా కనిపించే సున్నితులు ధరించాలిగాని ముక్కుపుడక, గాలి విడిస్తే 'కలుషిత' వాతావరణం కలిగించే విషకన్యలు ధరించరాదు.

బెడ్ నెంబర్ 18 పేషెంటుకి రక్తంతీసి పరీక్షకి పంపవల్సి వచ్చింది.

నీడిలూ, సిరెంజ్ తీసుకుని దగ్గరికి వెళ్లాను, ఓ చిన్న సీసాలో ఆక్జలేటుక్రిస్టల్సు వేసి.

కొంతమందిని ఎంత పరికించి, పరిశీలించినా కదిలించి కరిగించినా వాళ్ళలో వీసమయినా జాలి కనబడదు.

అలాగే కొంతమంది ఆడవాళ్ళకి ఎంత బిగించి ప్రయత్నించినా వెయిన్లు కనబడవు.

బెడ్ నంబర్ 18 పేషెంటు కూతురినోట్లో మంచి మాటల్లా ఆమె తల్లి చేతిలో వెయిన్లు వెతికినా కనబడలేదు.

నా బాధల్లో నేను చెమటలు కక్కుతుంటే పక్కన నిలబడి ఆమె కూతురు అంటోంది.

"చాలామంది పెద్దపెద్ద డాక్టర్లు చూసారండీ లాభం లేదు" అని.

నేను వెళ్ళి బి. పి. ఏపరేటస్ తెచ్చి కఫ్ కట్టి గాలికొట్టి ఓ చిన్న నరం పొంగించి.... సూదితో రెండు మూడుసార్లు పొడిచి....

"మరీ అలా పొడిచేకండీ....కనబడుతోంది కదా" అంటోంది.

మరీ అంత చిన్న వెయిన్లోంచి బ్లడ్ తీయడం కష్టం. నా పాట్లు నావి. అనవసరమైన విషయాల్లో ఆవిడెందుకు పెట్టడం వేలు?

రెండు మూడుసార్లు పొడిచి.... చివరికి రక్తం లాగాను.

"హమ్మయ్య" అనుకున్నాను మనసులో.

"హమ్మయ్య" అంది ఆమె ప్రశాంతంగా.

నాకు బర్నింగ్ సెన్సేషన్ రావడం సహజం.

అదే జరిగింది.

§ § §

చీకటి పడని సాయం వేళ.

చిరుగాలికి ఆకుపచ్చని ఆకుల మధ్య వూగుతున్న తీగలావుంది ఆ చీరెలో గీత.

ఆకుపచ్చని అమాయకత్వం ఆకాశాన్ని కప్పినట్టుగా ప్రశాంతంగా చల్లగా వుంది ఆ సాయం సమయం నా కంటికి.

ఉత్సాహంగా జరిగింది అప్పటికి ఆమెతో ఓ అరగంట.

అరగంట వుత్సాహంవలననే నేను మగవాడికి సహజమైన ఆటోమేటిజంలో పడ్డాను బహుశా.

అంటే ఏం మాట్లాడుతున్నానో తెలీని స్థితి.

"నీ కి ప్రపంచంలో అన్నింటికంటే ఇష్టమైనది ఏది?" అన్నాను.

"నీకేది అత్యంతప్రియం? అంటే ఏం చెబుతాను? ఇష్టం రెకెటివ్ ఫినామెనన్. ఒక దానికంటే ఒకటి ఇష్టమైనవి వుంటూనే వుంటాయి. నా ఇష్టాలు మారిపోతూంటాయి" అంది.

స్త్రీ సహజమైన ప్రాక్టికల్ ఔట్ లుక్ తో అందో లేక కొటేషనో, డైలాగో చెబుదామనే వుత్సాహంలో అందో తెలీదు.

తెలుసుకునే స్థితిలో లేను నేను.

అవును. నా వుద్దేశం తనకిష్టమైనవి తెలుసుకుందామని గాదు. నాకిష్టమైనవి చెబుదామని.

కాని ఆమె అవేం అడగడం లేదు.

ఆప్యాయంగా నిమిరే చెయ్యిలా అపుడూ అపుడూ వీస్తోంది గాలి.

మధ్యకాలంలో వూగుతోంది నా మది.

ఓ గాలివాటుతో చెప్పేశాను.

"నాకీ ప్రపంచంలో అన్నింటికంటే అత్యంత ప్రియమైనది అందమైన నీ ముక్కుపుడక."

ఈసారి గీత నవ్వలేదు.

ఓ నిముషం మాట్లాడలేదు.

తర్వాత సన్నగా నవ్వుతూ అడిగింది: "అందమైనది ముక్కా? ముక్కు పుడకా? అని?"

నాకు మాటలు రాలేదు.

ఏమిటీ మనుషుల బలహీనత? అవసరమైనపుడే మాటలు రావు.

మనసులోని మాటలు బయటికి రానపుడే కళ్ళు వర్షిస్తాయేమో.

నా కళ్ళల్లో బయటికి రాని కన్నీళ్ళు.

ఆనందబాష్పాలా? దుఃఖాశ్రుబిందువులా?

§ §

ఆకాశం నల్లబడుతూంది.

తెల్లబడుతుంది.

రంగు రంగులు మెరుస్తాయి.

వెన్నెల కురుస్తుంది. వాన కురుస్తుంది.

వేకువ వస్తుంది. చలి వేస్తుంది.

రోడ్లు మారుతాయి. మనుష్యులు మారుతారు. రోడ్లు చీలుతాయి. మనుష్యులు విడిపోతారు. గోడలకి వేసిన ఘాటైన సున్నం.... వెల్ల.... వెలుస్తుంది.

సున్నితమైన మనసు పొరల్లోపల దాచిన జ్ఞాపకాల వర్ణచిత్రం వెలిసిపోదు. చిరిగిపోదు. తొలగిపోదు.

ఆ వర్ణచిత్రంలో.... అస్పష్టంగా వున్న ఓ ముఖం. దాని ముందు అందంగా వున్న ఓ ముక్కు.

దాని చివర అత్యంత అందంగా మెరుస్తున్న ముక్కుపుడక. ఆ ముక్కు పుడక నా ముక్కుపుడక.

* * *

జీవితంలో మలుపులు మరీ స్పష్టంగా కనిపించవు పరికించి చూస్తేగాని, గతాలని నెమరువేస్తేగాని.

ముఖ్యంగా వృత్తే జీవితమైపోయిన వాళ్ళకి. మార్పులు అంత స్పష్టంగా వుండవు.

వాళ్ళకి ఇష్టా ఇష్టాలనిబట్టి పనులు చేయడం కుదరదు.

వ్యక్తిగత, మానసిక అయిష్టతలనిబట్టిగాక, వర్తమాన పరిస్థితినిబట్టి నడవాలి.

అందుకే బెడ్ నంబర్ 18 పేషెంటు ఎటెండెంట్ అన్నా, తద్వారా బెడ్ నంబర్ 18 పేషెంటన్నా ,చిరాకుపడే నేను, వాళ్ళని చాలా జాగ్రత్తగా చూడవలసి వచ్చింది.

ఓ రోజు రాత్రంతా నిద్ర లేకుండా గడపవలసి వచ్చింది.

కష్టాలు గడవడానికే!

కన్నీళ్ళు తుడవడానికే!

భీకర చీకటి రాత్రుల్లో కూడా దూరంగా వినదలిస్తే ప్రభాతగీతం వినిపిస్తూంది.

ప్రపంచంలో అనేక నిజాల జాడలు ఎంత నిజం అనిపిస్తాయి ఒకో సమయంలో.

అవే మరో సమయంలో నీలి నీడలని-పిస్తాయి.

ఎంతో ఎండకాసి వెలిసిన సాయంత్రం ఒక్కసారి చల్లగాలి రివ్వున వీస్తే ప్రాణం లేచి వచ్చి గాల్లో తేలొచ్చు.

అదే చలిగాలి వెన్నులోంచి చలి పుట్టించి భయం కలిగించవచ్చు.

ఏమయితేనేం అప్పుడప్పుడూ మన మనుకున్నట్టు విజయం మనని వరిస్తుంది.

అలాగే జరిగింది.

18 వ నంబర్ పేషెంటు గండం గడిచి ఒడ్డున పడింది.

దూరంగా కొబ్బరిచెట్ల వెనక నీలంగా ఎండలో మెరుస్తున్న సముద్రంలా ప్రశాంతంగా వుంది వాతావరణం.

బెడ్ నంబర్ పేషెంటూ, ఆమె ఎటెండెంటూ నాపట్ల చాలా కృతజ్ఞతని కనబర్చేరు.

ప్రపంచంలో అందమయిన దృశ్యాల్లో కృతజ్ఞతాభరితమైన చూపు ఒకటి.

ఆ చూపును చూపుగానే చూడాలి.

ఆ మనిషికి అటూ యిటూ చూసి ఆ స్వచ్ఛతని శంకించకూడదు.

మనం సాధారణంగా క్షణమైనా మైమరుస్తాము ఆ చూపుకి. కాని కొందరు మనుషులు ఆ మైమరుపులోని ఆనందాన్ని కూడా మిగలనివ్వరు.

బెడ్ నంబర్ 18 పేషెంటు కూతురు నా దగ్గరికి వచ్చి, "డాక్టర్, మా అమ్మని ఎంతో శ్రద్ధతో ట్రీట్ చేశారు. మీ ఋణం తీర్చుకోలేము. కాని ఏదైనా...." అని ఆగింది.

"అది నా డ్యూటీ" అని ముక్తసరిగా అని, ఏ పనీ లేకపోయినా ఏదో పని వున్నట్లు మొహం పెట్టేను.

"మా సంతృప్తి కోసం" అంది.

కొందరు మనుషులు ప్రతీ మనిషినీ తక్కువగా అంచనా వేస్తారు. కారణం—అని లోలోపలే చిరాకు పడుతున్నాను.

"పోనీ మా జ్ఞాపక చిహ్నంగా ఏదో ఒకటి...." అంటోంది.

"నీ జ్ఞాపకం కూడానా?తల్లీ" అనుకున్నాను.

మరీ మరీ నొక్కి చెప్పడంవలన, ఓ క్షణం మనసులో ఆలోచించి పెదాలపై చిరునవ్వుతో పలికాను.

"నిజంగా నా కోరిక తీరుస్తారా?"

"ఊ తప్పకుండా" అంది.

"నిజంగా!" రెట్టించాను.

"తప్పకుండా."

"సీరియస్‌గానే అడుగుతున్నాను" అన్నాను.

"నేనూ సీరియస్‌గానే చెబుతున్నాను" అంది.

"అయితే మీరు ఆ ముక్కుపుడక తీసేస్తారా? దయచేసి పెట్టుకోవడం మానేస్తారా?" అన్నాను గంభీరంగా.

ఆమె నిరుత్తరే అయింది!

కొత్త పుస్తకంతో కొంతసేపు

అగ్నిహోత్రావధాన్లు "మీ దొర్ల దంతా అదో తరహా....అండీ" అంటాడు గిరీశంతో. సందర్భం: వెంకటేశాన్ని జామిచెట్టు ఎక్క మని తనే చెప్పాననీ....జామిచెట్టో మరో చెట్టో....ఎక్కడం దొరతనంలో అవసరమైన అనుభవమనీ (పులీ గిలీ వస్తే....). గిరీశం చెప్పగా — అట్లాగే....ఈ కవులందరిదీ.... తలకోదారి....ఇస్మాయిల్, నగ్నముని: రెండూ బాగా తెలిసిన పేర్లే. ఇద్దరూ కవులుగా ప్రముఖులే. బహుశా ఇద్దరూ వ్యక్తిగతంగా స్నేహితులుకూడా (దాఖలా: "చిలకలు వాలిన చెట్టు"లో 12 వ పేజీలో "Wein" అనే కవిత). అయితే "చిలకలు వాలిన చెట్టు"కూ "కొయ్య గుర్రం"-కూ స్నేహం కుదరదు. లియొనార్డొ డావిన్సీ కార్టూన్‌లో ప్లేటో, అరిస్టోటిల్—ల లాగా నేలమీద దృఢంగా నిలుచున్న వాడొకడు, మెడను సాగించి ఆకాశంలోని నక్షత్రాల వైపు....లేదా భూతలంపైనే వున్న మెరుపుల వైపూ....చూపు సారించినవాడొకడు. పైన చెప్పిన "Wein" లో ఇస్మాయిల్ .... నగ్నమునితో

"...............
సహస్ర జలపాతాల పాతాల్ని
సుహాస ఫేనంగా మార్చే
హృదయ దృఢత్వం మీది
బతుకులాకుల్ని విప్పేసి మీ
పతనం కోసం వీళ్ళు
పొంచి చూస్తున్నారు
డంగై వీళ్ళు చూస్తుండగ
చెంగున గెంతండి కేశవరావుగారూ.
గుండెల్ని విశాలంగా పరచి
తాండవ నృత్యం చెయ్యండి....
జలపాతమై తలకిందుగా మొలిచి
సంధ్యాకాశంలోకి వేర్లు తన్ని
ఆకాశపు రక్తాన్ని పీల్చండి.
చీకటి లోకంలో జ్వలించండి,"

అంటాడు. (తేదీ: 3-7-1976). బహుశా నగ్నముని అలా చేసేవాడేమో....లేదా ఎప్పటికీ చెయ్యలేడేమో....ఏమో....కాని జీవితంలోని కాఠిన్యం, దుర్మార్గం, అపసవ్యత, క్రౌర్యం.... వీటన్నిటి వెనుకవున్న వర్గ స్వభావం....ఇవి కొన్ని సందర్భాల్లో మాత్రమే కళాకారులకు... నిజాయితీ వున్న ఆలోచనాపరులకూ .... "విలయరూప దర్శన" మిస్తాయి. ఆ క్షణాన జ్ఞాననేత్రం విచ్చుకుంటుంది. 1977 నవంబరు 19 నాటి తుఫాన్....అంతకంటె ఎక్కువగా.. ఆ తుఫాన్ అవశేషాలను పీక్కుతిన్న 'రాబందుల రెక్కల చప్పుడు' "నగ్నముని"కి సత్యదర్శన క్షణం. తత్ఫలితమే "కొయ్య గుర్రం". అంతకు ముందు ఎన్ని తుఫాన్లు రాలేదు....ఎన్ని గుడిసెలు కూలిపోలేదు.... ఎన్ని శవాలు కొట్టుకుపోలేదు, ఎన్ని రాబందులు రక్తపానంచేసి కైపెక్కలేదు....కాని ఈ 1977 నవంబరు తుఫాన్ "నగ్నముని" కళ్ళల్లోకి వచ్చింది. అతని ఆగ్రహం "కొయ్యగుర్రం"గా రూపెత్తింది. "కొయ్యగుర్రం" కావ్యానికి నికితాగురోవ్ లఘుపరిచయం చేకూరి రామారావు దీర్ఘ పరిచయం—22 పేజీలు-వేగుంట మోహనప్రసాద్ విశ్లేషణాత్మక (ప్రశంసాత్మక) కవిత—ఒక అనువాదంతో సహా—ఉన్నాయి.

నికితాగురోవ్—....సాధారణ మానవుడు చూడని చూడలేని వస్తువులను లక్షణాలను.... వాటి సంబంధాలను కవియొక్క సూక్ష్మదృష్టి కనుగొనగలదు అంటాడు. అంతకంటె సామాన్య మానవుడు చూసే....లక్షణాలనే.... కవి వడసారం కట్టి....చిక్కగా అతి చిక్కగా చెపుతాడనడం వాస్తవం. ఎందుకనంటే ప్రతి మహాకవీ....ప్రవక్త కానక్కరలేదు. మయకోవ్‌స్కీ "ఒకటన్ను భాషాఖనిజాన్నుంచి ఒక టొన్ను కవిత్వం" వస్తుందనడానికి కారణం ఇదే....తర్వాత చేకూరి రామారావు ఒక విషయం ముచ్చటించాడు. పాటలు పాటలేగాని కవిత కాదనే అభిప్రాయాన్ని కొంతమంది అభ్యుదయ కవులు—ఆరుద్ర అని గుర్తు—ఒకనాడు సిద్ధాంతీకరించారు. దేశి కవిత ల్లాగానే అభ్యుదయ కవిత, ప్రజాకవితలూ అనుకుంటే అభ్యుదయ కవిత ఇబ్బందైన వర్గంలోకి వెళ్ళిపోయింది....అసలు కవిత్వానికి ప్రజలకూ సంబంధం వుండాలా వద్దా అనే మౌలిక సమస్యకు సమాధానంగా ఏదో ఒక వైపు భుజంపట్టాలి....అంతే .... ప్రజలవైపు భుజంపట్టే వారిదంతా ఒకే పద్ధతి... కవితకు "గానం చేయబడగల లక్షణం" వుండాలి. ఆ గానానికీ కవితా వస్తువు అర్థంకావడానికీ మధ్య అంతరం ఎంత తక్కువైతే ఆ కవిత్వం అంత వుత్తమం. 'కొయ్యగుర్రం' ఫ్రీ వర్సులో సాగినా...కొన్నిచోట్ల సంగీతంలాగానే-అదీ భీకర సంగీతంలాగే—సాగింది. పూర్వకాలపు "నగ్నముని"లో వుండే వైచిత్రి—ఫీట్లు కన బడవు. ధారాప్రవాహంగా సాగిన 'కొయ్య గుర్రం' ఒక కవిత కాదు....ఒక అనుభవం... నగ్నమునీ....గీతాలే రాయకూడదూ! నీ జాతి జనుల గురించి రాస్తున్నావుకదా....వాళ్ళకోసం కూడా రాయకూడదూ....

ఇస్మాయిల్ కవిత్వ తత్త్వం పైన "నగ్నముని"తో అన్న మాటల్లో చూసాంకదా! ఇస్మాయిల్‌కు గూడా వాస్తవికత కవితా రూపంలో కనిపిస్తుంది. "వర్షాల్లో కాలేజీ"లో అంటాడు (వర్షంపడిన తర్వాతి రోజున).

చిలుకలు వాలిన చెట్టు	★	కొయ్యగుర్రం
ప్రకృతి సౌందర్యం		ప్రకృతి బీభత్సం

"పొద్దున వెళ్ళి
చూద్దను కదా
కాలేజి పునాదుల్నుంచి
వేళ్ళాడుతున్నాయి సీడలు
మెరిసే నీళ్ళల్లో
మెల్లిగా కదుల్తో
....
వాయుడుగా రేకాంతులతో
నే యాలనుకున్నారో కాలేజిని
ఇప్పుడు బోధపడింది నాకు.
బిగుసుకున్న మన హృదయాల్లోకి
గగనపు లోతుల్ని దింపాలనీ...."


దీన్లో టాగోర్ ప్రతిధ్వనులున్నాయనో....షెల్లీ ఇమేజరీ వుందనో, కృష్ణశాస్త్రి లాలిత్యం వుందనో....వ్యాఖ్యానించడం అనవసరం. కాని కవికి అద్భుతమైన రూపచిత్రణ — బొమ్మ కట్టడం—చేతనవును.

"మా చిన్నప్పుడు
మమ్మల్నీ మబ్బుల
దరువులు వాయించే
దొరువుల మృదంగాలు
వింతపూసులతో
చెంతకు పిలిచేవి" అని టాగోర్ తో అంటున్న ఇస్మాయిల్....

"మోగటంలేదు
టాగోర్, ఇవాళ
హృదయాంగమాలైన బాల్య
మృదంగాలు
జబ్బులతో, ఆకలితో
ఉబ్బిన
పిల్లల పొట్టలదోళ్ళు
ఎల్లెడలా వాటి చప్పుళ్ళు"

అని దుఃఖిస్తున్నాడు. బాల్యపు అమాయకత్వంలో అజ్ఞానం అందం, సౌందర్యం అనిపించేవన్నీ....వయస్సు వచ్చేస్తుంటే అనుభవాలు దాటిచేస్తుంటే....ఏమౌతాయి? వికృతమౌతాయా? సదా బాల్యమనేది సోమరిపోతుల స్వప్నం. ఇస్మాయిల్ చూసిన సౌందర్యం, సారళ్యం, ఇప్పటికీ వున్నయి. వాటికోసం అన్వేషణ సాగించడం ఒకరకం కవిత్వం. అవి కొంతమందే చేస్తారు. వాళ్ళకు లోకంతో నిమిత్తం .... అంటే లోకంలో ఎక్కువ భాగాన్ని ఇగ్నోర్ చేస్తున్నారన్న మాట. అలా చేయడం ధర్మమూ కాదు. న్యాయమూ కాదు. మానవత్వమూ కాదు...."మేమేం చెయ్యం.... మాది శుద్ధకవిత్వం" అంటే జాలివేస్తుంది.... కోపం కూడా వస్తుంది. ఇస్మాయిల్ గారూ! "తలకిందుల జలపాతం" బాగానే వుంటుంది.... దాన్ని నిజంగా సృష్టించాలంటే లోకంలో చాల మంది సహకారం అవసరం. వాళ్ళకి మీరు చేయూత ఇవ్వండి....మీ స్వప్నాలన్నీ భవంతులు కట్టి మీకిస్తారు!

—"రహి"



బీరం మస్తాన్ రావు తాజా చిత్రం

'బుర్రిపాలెం బుల్లోడు' సినిమాచూసి, ఎవరండీ ఈ కుర్ర డైరెక్టరు యిలాగ తీసేడు పాటలు అని సినిమాస్కోపు ముఖంతో విస్తుపోయింది పరిశ్రమ. పాటల చిత్రీకరణలో ఆ నాటి ఆదుర్తి తరవాత మళ్ళీ యిన్నాళ్ళకి కొత్త పుంతలు తొక్కిన దర్శకుడు కనిపించాడని పెద్దయెత్తున ప్రశంసించిన వారుకూడా వున్నారు. దర్శకుడిగా బీరం మస్తాన్ రావుకి తొలిచిత్రం అది. కృష్ణ అభిమానుల గుండెల్ని భరత నాట్య భంగిమలతో తియ్యతియ్యగా తొలచిన తొలిచిత్రంకూడా అదే! అది విజయవంతంగా నడిచింది. మస్తాన్ రావు కెరీర్ వికసించడం మొదలెట్టింది. విజయం మేధావి అయినవాడి వినయాన్ని ఇనుమడింపజేస్తుంది. వినయం మరిన్ని విజయాలకి సోపానాలు నిర్మిస్తుంది.

'గయ్యాళి గంగమ్మ'లో సెట్ మీద దర్శకుడు బీరం మస్తాన్ రావు, రజనీ శర్మ




మస్తాన్‌రావు జీవితాన్ని బాగా ఆకళింపుకున్న వాడు. ఎత్తుపల్లాలు ఎక్కి దిగినవాడు. సహాయ దర్శకుడిగా భావనారాయణగారి సంస్థలో ప్రవేశించి, సహకారదర్శకుడిగా ఒకమెట్టు పైకెక్కి బాపయ్య, రాఘవేంద్రరావువంటి ఉద్దండుల దగ్గర పనిచేసి, పరిశ్రమించి దర్శకుడి స్థాయికి యెదిగినవాడు. 'గయ్యాళి గంగమ్మ' మస్తాన్‌రావు రెండో సినిమా. జీవితాన్ని ధనాశ యెలా అంధకారమయం చేస్తుందో, సునిశితమైన హాస్య ధోరణిలో వివరించాడు మస్తాన్‌రావు ఈ చిత్రంలో. 'గయ్యాళి గంగమ్మ' మేలో విడుదల కానుంది.

శివమెత్తిన శతదినోత్సవం

ఈ రోజుల్లో మన సినిమాలు వందరోజులాడడమే అపురూపం. అలా విజయవంతంగా ప్రదర్శించబడిన చిత్రాల విజయోత్సవాలు నగరాలలోని యే థియేటర్లోనో జరగడం పరిపాటి. కృష్ణంరాజు సమర్పణలో 'రాధాకృష్ణా' వారు నిర్మించిన 'శివమెత్తిన సత్యం' నూర్రోజుల పండగ తద్భిన్నంగా జరిగింది. మద్రాసుకి పదిమైళ్ళ దూరంలోవున్న వి.జి.పి. గార్డెన్స్‌లో రాధాకృష్ణా మూవీస్ టెక్నికల్ యూనిట్ సభ్యులందరూ వారివారి కుటుంబాలతో సహా చేరి పగలంతా అక్కడే ఆటపాటలతో గడిపి చీకటిపడే వేళకి యిళ్ళకి చేరుకున్నారు. హీరో కృష్ణంరాజు, దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాత సత్తిబాబు, గీత, గిరిజ, వి.ఎస్.ఆర్. స్వామి, యిలా 'శివమెత్తిన సత్యం' సాంకేతిక, నిపుణులూ, ప్రధాన నటీనటులు కొందరు సముద్రతీరాన వున్న సరివి తోటలో (వి.జి.పి. గార్డెన్స్ సరివితోటే) సమావేశమై, యూనిట్ తరఫున నిర్మాతలకి ఒకే ఒక షీల్డు (చాలా పెద్దది, యూనిట్ సభ్యుల సతీమణులందరికీ చీరలు పెట్టిన నిర్మాత హృదయంలాగే) బహూకరించారు. అప్పుడప్పుడయినా యిటువంటి వనభోజనాలు, ఆటవిడుపులూ లేకపోతే జీవితానికి ఏమి సుఖముంటుంది!

—దేవీదాసు

1979 ఉత్తమ గాయకుడిగా జాతీయ బహుమతి పొందిన ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యాన్ని కొడవటిగంటి కుటుంబరావు చేతులమీదుగా 'కళాసాగర్' ఇటీవల సత్కరించినప్పటి చిత్రం.



రామచిత్ర

రాజాధిరాజు

దర్శకత్వం బాపు

నిర్మాతలు శ్రీమతి ఎస్. జయలక్ష్మి శ్రీమతి ఆర్. డి. రెడ్డి

ఈస్ట్‌మన్‌కలర్

రచన ముళ్ళపూడి వెంకటరమణ సంగీతం కె.వి. మహదేవన్ కెమెరా అబ్బార్ ఆజ్మీ

జ్యోతి పాఠకులకు నమస్కారం

టామ్ అంటారు నన్ను. పూర్తి పేరు థామస్ కాసనోవా. అన్న జాన్, వదిన మేరీ, వారిద్దరి ముద్దుల బిడ్డ రీటా. ఇదీ నా కుటుంబం.

మంచివాడినని మా వదినంటుంది నన్ను. ఆకతాయి అనీ, అన్నీ అల్లరిపనులు చేసి తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగజేస్తున్నానని మా అన్నయ్యకు కోపం. దేవుడిని లెక్కచెయ్యనని యీ బాబాయ్‌పై రీటాకు కినుక. అయితే అందరికీ నేనంటే అమితమైన ప్రేమ. వదిన

లిల్లీ

టామ్



నన్ను కన్న బిడ్డలా పెంచింది. రీటా నిజానికి నా పెంపకంలోనే పెరిగింది. ఆ చిన్నారి అంటే నాకు ప్రాణం.

ఆకతాయి నన్న మా అన్న మాటలో నిజం లేకపోలేదు. 'దేవుడులాటి వాడు' అని మా వదిన అన్నమాట అసత్యమూ కాదు. జీవితం అనుభవించడానికే నన్నది నా వాదం. సరదాలు చేసుకొంటూ కులాసాగా జీవితం గడపటం నాకిష్టం. అయితే లేనివాళ్ళను చూస్తే నా గుండె నీరైపోతుంది. ఉన్నవాళ్ళ సొమ్ము దోచుకొని అయినా లేనోళ్ళతో పంచుకోవడాన్ని అంగీకరిస్తాను నేను. అలా ఆ ప్రయత్నాల్లో జైలుకి వెళ్ళడం తరచూ జరుగుతుంది.

సైతాన్ టామ్.



వలపు–మలుపు :

నా జీవితంలో తొలివలపు చోటుచేసుకున్న క్షణం చాలా కీలకమైనది. నా జీవన విధానాన్ని, నా వ్యక్తిత్వాన్నే మార్చివేసి జీవితాన్ని ఓ కొత్తమలుపులోకి మళ్ళించిన దా క్షణం.

మా రాజ్యాన్ని పాలించే రాజుగారి దగ్గర ఓ పెద్దమనిషి గవర్నరుగా వున్నాడు. ఆ గవర్నరు కూతురు లిల్లీ అందాలరాసి. అనుకోని ఓ సంఘటనలో ఆమెకై తీసుకెళుతున్న ఆహార పదార్థాలు లాక్కొని బీదలకు పంచిపెట్టేసను నేను. ఆ పనికి లిల్లీ కోపగించుకుంటే ఎలా వుండేదోగాని నా పనిని మెచ్చుకున్న తీరు ఆమెలో కన్పించడంతో కథ అడ్డం తిరిగింది. తొలిచూపులోనే ఆకర్షితుడనయాను ఆమెవైపు. లిల్లీకూడా 'ఐ లైక్ యు నువ్వు నాకు నచ్చావ్'



రీటా టామ్

అంది. సంతోషంగా ఇంటికి వచ్చేశాను. నన్ను మందలించబోతున్న మా అన్నతో సగర్వంగా చెప్పేశాను 'కోటగారికి అల్లుడుగారిని కాబోతున్నా' నని. అంతలోనే గవర్నరుగారి నుంచి 'సగౌరవంగా తీసుకు రమ్మని' కబురు వచ్చింది. ఎగిరి గంతేశాను. లిల్లీతో నా జీవితాన్ని ఊహించుకుంటూ కోటకి వెళ్ళాను.

నమ్మకద్రోహం !

కోటకెళ్ళిన తరువాత తెలిసింది, గవర్నరు రాజకీయం. రాజకీయాలు నడిపేవాడికి నయవంచన అన్నది కూడా ఒక ముఖ్య లక్షణమని తెలిసింది. ఆదరంగా పిలిచి అవమానించి వాళ్ళ అమ్మాయితో మాట్లాడా నన్న నేరానికి, ఆ అమ్మాయి బాడీగార్డుగాడిని దేహశుద్ధి చేసినదాన్నీ, ఆ పిల్లకు తీసుకెళ్ళే ఆహారాన్ని బీదలకు పంచానన్న దాన్నీ తోడించి, ఒంటరివాడిని చేసి కొరడాలతో కొట్టించాడు ఆ గవర్నరు. శరీరంపై వాతలకంటె నా హృదయంపై తగిలిన గాయాలు బలమైనవి. ఆ అవమానం సహించలేక పోయాను. 'రాక్షసీ....నీ బాబునీ, వాడి బాబునీ అందర్నీ చావగొట్టి నిన్ను పెళ్ళాడి....అప్పుడు... అప్పుడు చూసుకో లిల్లీ ....' అంటూ ప్రతిజ్ఞ చేశాను.

ప్రేమ....పగకాదు

ఆ మాట విని మందలించింది మా వదిన 'ఇంతచేసి ఆమె నీతో జీవిస్తూ, నీకు సేవలు చేస్తూ వుంటే భయంతో సేవిస్తూందో, ప్రేమతోనో నీకు తెలుస్తుందా? వేపగింజలు నాటి మామిడి పళ్ళు రమ్మంటే రావు టామ్....నువ్వామెను ప్రేమించి భార్యగా కోరితే ప్రేమనందించు, పగను కాదు. ప్రేమను ప్రేమతోనే జయించు. పగతోకాదు" అంది.

ప్రేమదీక్ష!

వదిన చెప్పిన మార్గమే సరైనదనిపించింది నాకు. "నీకు పౌరుషంలేదూ కోటలో అన్ని దెబ్బలుతినీ ఆకతాయిలా తిరుగుతున్నావ్' అని లిల్లీ రెచ్చగొట్టినా-వెచ్చబడలేదు నేను. తనకోసం ప్రేమదీక్షను పడుతున్నానని పంతంపట్టి సవాలుచేశాను. ఈ క్షణంనుంచి అన్నం తినను నీరు త్రాగను, నిద్రపోను ఈ చోటు దాటి కదలను.... ఎండా వానా అయినా, రాత్రీ పగలూ ఇక్కడే నీకోసం తపస్సు చేస్తాను. 'టాం నేను నీదాన్ని - నిన్నే పెళ్ళాడతాను అని నువ్వువస్తావు' అని చెప్పి ఒక్కచోట నిలబడి నా ప్రేమదీక్ష ప్రారంభించాను. దీక్షకెన్నో అడ్డంకులు. నా సాయం పొందిన ఎందరో దీనులు, నా కుటుంబ సభ్యులు [illegible] గొడవచేశారు. గవర్నరయితే సరేసరి నానా హింసలూ పెట్టాడు, కొరడాలతో కొట్టించాడు, ముళ్లూ [illegible] పెట్టించాడు, నన్నెలా

గయినా దీక్షమాన్పాలనిచూశాడు. నేను రాయిలా నిలిచాను. చివరకు నేను శారీరకంగా నీరసించి కూలిపోయే సమయాన లిల్లీ వచ్చింది. నా దీక్ష ఫలించింది.

మళ్ళీ మలుపు:

ఈ సారి లిల్లీ వచ్చి నన్ను నా దీక్ష విరమింపజేసి తీసికెళ్ళడమే నాకు తెలుసు. తరువాత స్పృహవచ్చి చూసేసరికి అర్థంగాని కొత్తలోకంలో ఉన్నట్లుగా తోచింది నాకు. మామూలు మానవ రూపంగాగాక, కొంచెం భిన్నంగా నెత్తిన కొమ్ములతో దర్శనమిచ్చాడు కొత్తరకం 'మనిషి'. ఆ మనిషి పరిచయం నా జీవితాన్ని మరోమలుపుతిప్పింది. జరగబోయే మహాసంగ్రామంలో నన్నో పాత్రగాచేసింది. ఎన్నెన్నో ఆటలు ఆడించింది.... ఆ పరిచయం.

నైతాసే-సైతాన్

ఆ పరిచయమయిన వ్యక్తిపేరు నైతాస్. నిజానికతడు సైతాన్అట. దేవుడితోటి వయసు గల వాడినని చెప్పాడు. 'కొమ్ములు మొలిచిన దేవుణ్ణి, కొత్తదేవుణ్ణి' అని చెప్పాడు.

నా పొగరు,ధైర్యం వాడికి నచ్చాయట. 'నీకు కావలసిన వరాలిస్తాను. కోరినపిల్ల, కొండంతబలం ఇస్తాను. నిన్ను మహారాజును చేస్తాను. రాజాధిరాజును చేస్తాను' అని మాటిచ్చాడు.

అక్కడికి నిలదీసి అడిగాను 'ఏం ఎందుకు తండ్రీ ఆ వరాలన్నీ నాకెందుకిస్తున్నట్టు. మనమేం బావమరదులమా' అని. దానికతదేమన్నాడంటే 'ఒక్కళ్ళ సపోర్ట్ ఉంటేనే గొప్పోళ్ళు గొప్పగొప్ప కుర్చీలమీదికెక్కగలరు. మీ దేవుడు సంగతేమిటి. బీదబిక్కి రోగిష్టివాళ్ళు బల హీనులు వాళ్ళభక్తేగా ఆయనగారి బలం. ఆ బలాన్ని, బలగాన్ని బద్దలుకొట్టటమే నా లైఫ్ యాంబిషన్. నీ దేవుణ్ణి నేటుదింపేసి నేను ఎక్కాలి. అందుకే నువ్వు నా నిచ్చెనవి శిశువా.' దేవుడంటే నా కెప్పుడూ ప్రత్యేకమైన గౌరవమూ భక్తిలేదు, దానికితోడు అత్యంత సమర్థవంతంగా ఆ దేవుడు ఎలా హంతకుడో వివరించాడు నైతాస్. నైతాస్ నాకు చూపించిన భవిష్యత్తు అద్భుతంగా గోచరించింది. దానికితోడు నైతాస్ నాకు అద్భుత శక్తులుకూడా ఇచ్చాడు. నైతాస్‌తో చేతులు కలిపేందుకే నిర్ణయించుకొన్నాను. సరే నన్నాను.

కొత్తజీవితం!

మా పథకం ప్రారంభమయింది. మా పోరాటానికి తొలిమెట్టుగా గొప్ప వల పన్ని ఆ రాజ్యాన్ని పాలిస్తున్న వృద్ధుడైన రాజు స్థానంలో రాజునయ్యాను నేను.

మరుక్షణం ఆనందంగా అన్నగారింటికి వెళ్ళాను. అందర్నీ నాతోవచ్చి కోటలో ఉండమన్నాను. 'నీకీ రాజ్యం వద్దు బాబూ' అంది వదిన భయం వ్యక్తపరచి. నేను నవ్వేశాను. రీటానయినా నాతో పంపాలని తీసికెళ్ళాను. నా చిన్నారి బేబీ రీటాను రాణిని చేశాను. దాని కోరిక తీర్చేందుకు ఎప్పుడో చర్చిలో దొంగతనంచేసి తీసికెళ్ళిన వస్తువులు చర్చికి స్వయంగా వెళ్ళి అప్పగించాను. నా బేబీ ముఖంలో ఆనందంచూసి పొంగిపోయాను: అయితే అందుకు నైతాస్ కోపగించాడు. దేవుడుపై యుద్ధంచేయవలసిన వాళ్ళం. నువ్వే దేవుడి మందిరానికి వెళ్తే ప్రజలంతా ఆ దేవుడినే గొప్పవాడనుకోరా అని నిలదీశాడు. అది నా పొరపాటుగా తోచినా 'నా బేబీని కష్టపెట్టడం నాకు సాధ్యంకాదని' నిష్కర్షగా చెప్పేశాను నైతాస్‌కి.

బేబీ-బైబై

నా మాటవిన్న నైతాస్, నవ్వి అన్నాడు 'అంతగా నీ బేబీ అంటున్నావ్. రేపు సాయంత్రానికి ఆ బేబీని నీ దేవుడు చంపెయ్యబోతున్నాడు' అని. నా హృదయానికి సమ్మెటపోటాదెబ్బ. అలగండంతో పాప మరణిస్తుందనిచెప్పి నైతాస్ కనబడకుండా పోయాడు. పాపను కాపాడుకొనేందుకు నేను చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి. నైతాస్ మాటనిజమయింది. పాప



టామ్   సైతాన్

పోయింది. ఆ క్షణం నుంచి నేను పూర్తిగా మారిపోయాను. దేవుడికి శత్రువుగా నిలిచి సైతాన్ జతోపే పోరాటానికి అండగా నిలిచేందుకు నిర్ణయించుకొన్నాను. సైతాన్ ఎలా చెప్పినా, ఏం చెప్పినా చేసేస్తున్నాను.



జీసస్‌గా విజయచందర్

అరాచకం!

రాజ్యంలో సంఘ జీవనంలో కట్టుబాట్లన్నీ తుడిచి పెట్టేశాను. కొత్త శాసనాలు చేశాను, ఎవడిష్టం వాడిది. ఏ ఆంక్షలూ లేవు. అందినంత తిను. దొరికినంత తాగు. దొరికిన ఆడదానితో ఆనందించు. పాపం లేదు నా రాజ్యంలో. కొత్తగా దొరికిన ఈ అవకాశాలను సంఘ విద్రోహ శక్తులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారన్నది నేను పట్టించుకోలేదు. దేవుడిపై పెరిగిన కసి నా కళ్ళను మూసేసింది. కన్నుమిన్నూ కానక ప్రవర్తించాను. ఎవడో దౌర్భాగ్యుడు నా తల్లిలాటి వదినపైనే అత్యాచారంచేయ తలపెట్టినప్పుడు కోటకురానన్న వదినవచ్చి మద్యంమైకంలో ఉన్న నా మత్తు వదలగొట్టి "టామ్. నిన్ను దేవుడు పరీక్షిస్తున్నాడురా. టాం తట్టుకోబాబూ. తట్టుకో. నిన్ను పట్టిన పిశాచాన్ని వెళ్ళగొట్టు. చంపు...." అని నా కళ్ళు తెరిపించింది.

ఆక్టోపస్

కాని ఆ జ్ఞానం క్షణికమే అయింది నాకు. మరుక్షణమే ఆక్టోపస్‌లా నన్ను చుట్టి కమ్మేసి ఉన్న సైతాన్ మైకంలోకి జారిపోయాను ఆ సైతాన్‌తో కలిసి దైవంపై యుద్ధం కొనసాగించాను. అన్న వదినలు గుర్తులేరు నాకు. తల్లి ప్రేమ గుర్తు లేదు. నరనారానా అధికారం మత్తు. దైవంపై ద్వేషభావం నన్ను పూర్తిగా సైతానికి బందీని చేశాయి. నేను నేనుగా లేను. సైతాన్ చేతి కీలుబొమ్మనయినాను. చివరకు ఓ దుష్టక్షణాన నన్ను కన్నబిడ్డలా పెంచిన వదినపైనే కత్తిదూశాను. అందుకు ఫలితం అనుభవించాను.

టాకీగా నా కథ ఇది. టాకీగా యీ కథ రాజాధిరాజు పేరుతో వస్తోంది. నా పాత్రను పోషించిన విజయచందర్ సమర్పణలో విఖ్యాత దర్శకుడు బాపు దర్శకత్వంతో తయారైన ఈ చిత్రంలో సైతాన్‌గా నూతన్‌ప్రసాద్, నా వదిన పాత్రలో శారద నటించారు. రసగుళికల్లాటి మాటలను ముళ్ళపూడి వెంకటరమణ సమకూర్చగా, కె. వి. మహదేవన్ సంగీత సారధ్యం వహించారు. రంగుల రసవల్లరిగా యీ చిత్రాన్ని నిర్మించినవారు శ్రీమతి ఎస్. జయలక్ష్మి, శ్రీమతి ఆర్. డి. రెడ్డి. మీ ఊరి సినిమా థియేటర్లో పర్సనల్‌గా తెరపైకొచ్చి కలుస్తాను. అంతవరకు సెలవ్

ఇంతే సంగతులు
చిత్తగించవలెను

థామస్ కాసనోవా (టామ్)

ADVT

కళాశాల విద్యార్థుల కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

తపస్సు

కర్రి ఆదినారాయణమూర్తి (బి. కాం., ద్వితీయ)
పి. డి. కాలేజి, కాకినాడ.

ఆరోజు కాలేజీలో ఏదో ఫంక్షన్. వేల రంగులు విరబూసినట్లు, కోటికాంతులు వెదజల్లినట్లు విద్యార్థులు. అందరిలో ఆనందం, ఉత్సాహం. ఈలలు, కేకలు, చప్పట్లు, డాన్సులు. అందమైన కారులు, హంసల బారుల్లాంటి స్కూటరులు, కాకుల గుంపుల్లాంటి సైకిళ్ళు. విద్యార్థులు గుంపుగుంపులుగా చేరి, సంతోషాన్ని మాటల్లో నింపుకొని 'ఛీర్స్' చెప్పుకుంటున్నారు. ఇంతలో నలుగురయిదుగురు వడిగా నడచుకుంటూ అక్కడికొచ్చారు.

అక్కడ కాలేజీ, ఆఫీసరుగారి అబ్బాయిలా తల ఎగరేస్తోంది. మంత్రిగారి మనవడిలా వుపన్యాసాలు ప్రాక్టీసుచేస్తోంది. పారిశ్రామిక వేత్త కొడుకులా పచ్చిబూతులు ఆడుతోంది. వూరిలో పేరుమోసిన రౌడీ శిష్యునిలా భూమి మీద కాళ్ళు బలంగా ఆన్చి నిలబడింది. అక్కడ అమెరికా వుంది. స్విస్ బాంకూ వుంది. అక్కడికి వసంతం, ఉమర్‌ఖయ్యాం జట్టు కట్టుకుని వచ్చినట్టుంది. అక్కడ జీవితము క్షణమనే వేదాంతం వుంది. అందులోనే అనుభవించమనే నీతి ఇమిడి వుంది. అక్కడ నేలవుంది. నింగివుంది. నీరువుంది. వెలుగు వుంది. గాలి వుంది.... ఆ గాలిలో పొగవుంది. సింగపూర్ వుంది. సునీల్ గవాస్కరున్నాడు. బార్ వుంది. పెద్దాపురం వుంది. పారిస్ వుంది. ఆనంద్ వున్నాడు.

ఆనంద్ అందంగా వుంటాడు. ఆగర్భ శ్రీమంతునిలా వుంటాడు. గిల్లితే విస్కీ కారేలా వుంటాడు. అడిగితే ఏ విషయంగూర్చి అయినా మాట్లాడగలిగేటట్టు వుంటాడు. కాలేజీలో అతను అందరికీ తెలుసు. [illegible] చిరునవ్వుతో పలకరిస్తాడు. [illegible] చెప్తాడు. ప్యూను [illegible] అబ్బాయిలు, అమ్మాయిలు అందరూ ఆతన్ని గౌరవిస్తారు.

వడిగా నడచుకుంటూ వచ్చిన నలుగురైదుగుర్నీ చూసి ఆనంద్ గుంపుకి "ఎక్స్‌క్యూజ్ మీ" చెప్పి, వాళ్ళతో గ్రౌండులోనికి పోయి, చాలాసేపు మాట్లాడి వాళ్ళని సాగనంపి తిరిగి వస్తున్నాడు. వస్తుంటే....దూరంగా .... చెట్టు కింద....ఒక్కడే....నిలబడి .... ఆకాశం కేసి చూస్తున్న....వ్యక్తి .... ఆనంద్ దృష్టిలోనికి వచ్చాడు.

ఆ వ్యక్తి రావు. ఈ రావు ఏ రావో కాలేజీలో చాలచాల మందికి తెలీదు. మరి అటువంటి వ్యక్తి ఆనంద్ దృష్టిలో పడడానికి కారణం? ఇక్కడి ఆనందానికి, ఉత్సాహానికి దూరంగా, ఈ సంతోషంలో పాలుపంచుకోకుండా, ఈ ఆవేశంలో, ఈ సామూహిక ఆనందంలో తానూ ఒకడు కాకుండా, యీ వసంతంలో ఒక రంగుకాకుండా, ఈ ఉమర్ ఖయ్యాం లోకంకో, ఒక రుబాయత్ కాకుండా, ఎందుకతను వాటన్నిటికీ దూరంగా, ఒంటరిగా ఎండలో, చాలీ చాలని చెట్టునీడలో, తల పైకెత్తి ఆకాశంకేసి చూస్తున్నాడు. ఎందుకు? అదే ఆనంద్‌ని అటుగా నడిపిస్తూంది.

ఇక్కడ కాలేజీ మునులు తపస్సు చేసుకునే కారడవిలా వుంది. నిర్మలంగానూ, నిస్పృహంగానూ వుంది. ఒక అందంలేదు, ఆనందం లేదు. నిశ్శబ్దం నిండుకొని వుంది. ఇక్కడ కాలేజీ [illegible] [illegible] వుంది.

[illegible] ఆనంద్, [illegible] [illegible] ఆతిరం [illegible] పలికాడు.

"ఏం బాసూ హేపీగా లేవు?"

రావుకు నవ్వొచ్చింది.

"లేనా?"

"ఐ పిటీయు మిస్టర్ రావ్! ఐ పిటీ. మీకు చదువే సర్వస్వం. మీరేదో బుద్ధిమంతులమని భావించుకొంటున్నారు. ఈ కాలేజీలోని ఆనందానికి, ఆవేశానికి, అల్లరకు దూరంగా, ఒక ఉత్సాహానికి, ఒక ఉద్రేకానికి చాల దూరంగా వుంటూ కాలేజీలోని పరిస్థితులకు అతీతులమనుకొంటున్నారు. కాని ఎంత విలువయినది కోల్పోతున్నారో మీరు గుర్తించడం లేదు. మీ కాలేజీ జీవితాన్ని ఎంజాయ్ చెయ్యకుండా ఎలా ఖూనీ చేస్తున్నారో తెలుసుకోవడం లేదు. లాటరీలో లక్షరూపాయలు గెలవడం వంటిది జీవితం మిస్టర్ రావ్! అది మళ్ళీరాదు. ఏ వయసు అనుభవించవలసినవి ఆ వయసులోనే అనుభవించాలి. కాని మీరు మీ వయస్సుకు సహజమయిన వాటినికూడా కోల్పోతున్నారు."


"నిజం ఆనంద్‌గారూ! మీరు చెప్పింది అక్షరాలా నిజం! సహజమయిన వాటికి కూడ నోచుకోని దౌర్భాగ్యస్థితి మాది. నేనొకటి చెబుతాను. మీరు సినిమా డైలాగు అనుకోకండి. సహజంగా మాట్లాడలేక పోతున్నాను అనుకోండి. కాని చెప్పక తప్పదు. మావి కేరాఫ్ లేని బ్రతుకులు. మా అడ్రసులో కేరాఫ్ వుండదు. దానిని మేమే సృష్టించుకోవాలి. రేపటి మా పిల్లల జీవితాలు కేరాఫ్‌లేని బ్రతుకులు కాకూడదు. అందుకే మా యీ తపస్సు. మాకు తాతలు సంపాదించి యిచ్చిన ఆస్తులు లేవు. రాజ్యాంగంలో రాసిపెట్టిన రిజర్వేషన్లూలేవు. మాకు ప్రోత్సాహాన్నిచ్చి పైకితీసుకొచ్చే వారులేరు. మాకు మేమే ప్రోత్సహించుకోవాలి, ధైర్యంచెప్పుకోవాలి. మాజీవితగృహాన్ని నిర్మించుకోవటానికి మేమే పునాది తవ్వుకోవాలి. వడ్రంగం మేమే చేసుకోవాలి. సమస్తం మేమే. ఈ ప్రయత్నంలో మా జీవితకాలం ముగిసినా అది రేపటి వారికయినా నీడనివ్వాలి. తప్పదు! రేపుకోసం సిగ్గు, బిడియం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సులనుండి తప్పించుకోవాలి. మంచిరేపును సాధించుకోవటం కోసం, మా అడ్రసులో కేరాఫ్ సృష్టించుకోవటం కోసం, నేటి ఆనందం, సుఖం, సంతోషం, సహజమయిన వాటిని వదులుకొని తపస్సుచేయక తప్పదు ఆనంద్‌గారూ! తప్పదు."

ఆనంద్ ఒకసారి తల విదుల్చుకుని, భుజాలెగరేసి వచ్చినదారి పుచ్చుకున్నాడు.

ఒంటరిగా, ఎండలో, తల పైకెత్తి, ఆకాశంకేసి చూస్తూవున్నాడు రావు. □

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024 & Printed by D. Hanuman – tha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras 600 001

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



వచ్చే నెలనుంచి బహుమతి రు. 100!

పదబంధ ప్రహేళిక విజేతలకు యిచ్చే బహుమతి మొత్తాన్ని వచ్చే నెలనుంచి రు. 100 కి పెంచుతున్నాము. పాఠకులు మరింత ఉత్సాహంతో ప్రహేళిక పరిష్కార పోటీలో పాల్గొనగలరని ఆశిస్తున్నాము.

—ఎడిటర్

ఆ ధా రా లు

జూన్ '80

అడ్డం

1. 50%
3. ప్రమాణమా?
5. 6 నిలువు సర్కారుకి కట్టేది
7. —గా వినమంటారు
9. కొన్ని క్రియలకు లేదు
10. పోనిన కన్ను (తలక్రిందులు)
12. జపాన్‌లో ఉదయిస్తే జర్మనీలో కనిపించదు
13. ఉదకంలో దానం
15. "భారతీయ" వాద్యం
16. నా పురం ఢిల్లీ

17. కధలకి గమ్యం
18. అచ్చ తెలుగులో విదర్శనం
20. కస్తూర తద్భవం
22. కాలం సత్యకాలం
23. హిమ సహితంగా కర్పూరం
25. దారి అటునుంచి ఇటు
27. ఆ తర్వాత
29. పోరు
31. హిందీలో చెప్పు
32. రక్షా

నిలువు

1. అహింసా ప్రవక్త ఆశ్రమం
2. కోటచరిత్ర ప్రసిద్ధం
3. దగ్గర బంధువు
4. గడచిన సంవత్సరం
5. రావడం శుక్ల పక్షంలో
6. చూ. 5 అడ్డం
7. 19 ఎన్నో అంతరించాయి
8. చెవిని పెట్టం (తలక్రిందులు)
11. భీముడు విష్ణుమూర్తి
14. ఇలకాదు అల
16. ఇదీ అదే
18. ఫోటోలో లేదు, సినిమాలో వుంది
19. చూ. 7 నిలువు
21. పారు
22. ఒక శతక మకుటాంతం
23. అగ్నికి తల్లి
24. 18 నిలువు తుదిమొదళ్ళు
26. స్ఫురించు
28. హెచ్చరిక
30. ఈ ఇల్లు భారతంలో వుంది.

మే పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం: 1. బుసా 3. సాగి 5. కనవి 7. సరోజిని 9. కంస 10. హనుమ 12. గాసి 13. ముర 15. డుడు 16. గిడ్డ 17. ల్వరు 18. పొలి 20. రుజ 22. మీద 23. సింగారి 25. వాన 27. సరిగంచు 29. వామనుడు 31. కృప 32. రోలు.


నిలువు: 1. బుసనము 2. సాని 3. సారో 4. గిజిగాడు 5. కళం 6. విహ 7. సమ 8. విసి 11. నుసి 14. రగిలి 15. డురురు 18. పొదరిళ్ళు 19. బాగా 21. జవానులు 22. మీస 23. సించు 24. రివా 26. నడు 28. గంప 30. మరో

మే ప్రహేళిక విజేతలు:

1. కె. రవికుమార్—మిర్యాలగూడ. 2. వి. బి. ఆర్. కృష్ణమూర్తి—శెక్కలి. 3. ఐ. నీలకంఠరావు—ఖమ్మం. 4. శ్రీరాములు యం.—అరసవల్లి. 5. అలవర్తి వెంకట సుబ్బారావు—నందివెలుగు. 6. శేషగిరిరావ్—హైదరాబాదు. 7. వెంకటరావు—విశాఖ పట్నం. 8. శ్రీమతి కె. ముత్యాలు—ఏలూరు. 9. డా. కె. కమలాదేవి—తెనాలి 10. కె. జె. ఎం. కృష్ణారావు—ఏలూరు, 11. జి. విద్యాసాగర్—నగరం. 12. టి. సుధాదేవి—హైదరాబాదు, 13. కె. మీనాదేవి—గుంటూరు.

నిబంధనలు గమనించండి:

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి మే 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.


చలం సమర్పించు శ్రీరమణ చిత్ర వారి
దీపక్
వి.యం.సి